మంగళవారం
05-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 315
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ 130వ వర్ధంతి నేడు

ప్రత్యేక వ్యాసం 4లో

అసెంబ్లీ ముందుకు
కాళేశ్వరం నివేదిక

- ఊరు...పేరు మార్చి అక్రమాలకు పునాది
- రాజకీయ కక్ష చర్యలకు పాల్పడం
- అందరి సూచనల ప్రకారమే చర్యలు: సీఎం రేవంత్

విశాలాంధ్ర – హైదరాబాద్ : ఊరు మార్చి, పేరు మార్చి అక్రమాలకు పునాదులు వేసి నిర్మించిన కాళేశ్వరం కూలిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ రీడిజైనింగ్ పేరుతో మార్పులు చేసి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించారని వివరించారు. సోమవారం కేబినెట్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిన మూడేళ్లల్లోనే మేడిగడ్డ కుంగడం, అన్నారం పగలడం జరిగిందన్నారు. ప్రణాళిక, నిర్మాణ, నిర్వహణ లోపాలు ఉన్నాయని ఆనాడు కేసీఆర్‌కు నిపుణులు నివేదిక అందించారని తెలిపారు. రూ.లక్ష కోట్లుపెట్టి కట్టిన కాళేశ్వరం కూలిపోవడంపై... అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ చేపడతామని ప్రజలకు ఆనాడు మాట ఇచ్చామని గుర్తు చేశారు. అపార అనుభవం ఉన్న పీసీ ఘోష్ చైర్మన్‌గా జ్యుడీషియల్ ఎంక్వైరీ కమిషన్ నియమించామని తెలిపారు. 16 నెలల తరువాత జులై 31న 665 పేజీల నివేదికను పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిందని పేర్కొన్నారు. నివేదిక సారాంశాన్ని తయారు చేసి కేబినెట్ కు అందించాలని ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశామని వివరించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కేబినెట్ లో ఆమోదించామని, రాబోయే రోజుల్లో అసెంబ్లీలో ఈ నివేదికను ప్రవేశపెట్టి అందరి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్... కమిషన్ రిపోర్టును తప్పుపట్టడం సహజమే అని, నివేదిక వారికి అనుకూలంగా ఉంటే ఒకలా... లేకపోతే మరోలా మాట్లాడటం వారికి అలవాటే అని వ్యాఖ్యానించారు. కమిషన్ నివేదికలో ఎలాంటి రాజకీయ జోక్యం లేదని, ఇది స్వతంత్ర జ్యుడీషియల్ కమిషన్ ఇచ్చిన నివేదిక అని అన్నారు. అందరి సూచనల ప్రకారమే చర్యలు ఉంటాయని, రాజకీయ కక్ష పూరిత చర్యలకు పాల్పడం, నివేదికపై అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకెళతామని స్పష్టం చేశారు.

ఈ నివేదిక ప్రభుత్వం ఇచ్చింది కాదు: డిప్యూటీ సీఎం

ప్రజాధనం దుర్వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని న్యాయ విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్‌ను నియమించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇందులో రాజకీయ ఆరోపణలు లేవన్నారు. ఇది ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టు కాదు... స్వతంత్ర న్యాయ విచారణ కమిషన్ ఇచ్చిన రిపోర్టు అని అన్నారు. కాళేశ్వరం నిర్మాణం, నిర్వహణ అవకతవకలు అన్నింటికీ బాధ్యుడు, జవాబుదారీ అప్పటి సీఎం కేసీఆరే అని నివేదికలో పేర్కొన్నారన్నారు. నిపుణుల కమిటీ సూచనలకు కాకుండా సొంత నిర్ణయంతోనే మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారని విమర్శించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'లైఫ్‌సైన్సెస్'... మరో మైలురాయి

'ఎలీ లిల్లీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్' ప్రారంభోత్సవంలో రేవంత్

విశాలాంధ్ర – హైదరాబాద్ : తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో చేసిన ప్రయత్నాల ఫలితంగానే నేడు హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి గ్లోబల్ జీసీసీ రాజధానిగా ఎదిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 'ఎలీ లిల్లీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్'ను

- మిగతా 2 లో

శిబూసోరెన్ కన్నుమూత

న్యూఢిల్లీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూసోరెన్ (81) సోమవారం కన్నుమూశారు. మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ ఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో ఆయన తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'మన ప్రియనేత దిషోమ్ గురూజీ మనల్ని విడిచివెళ్లిపోయారు. నాకు సర్వం కోల్పోయినట్టుగా ఉంది' అని ఉద్వేగపూరితంగా రాసుకొచ్చారు. బీహార్‌లో భాగమైన రామ్‌గఢ్ జిల్లాలో శిబూసోరెన్ జన్మించారు. ఆయన సతీమణి పేరు రూపీ సోరెన్. ఆయనకు నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు హేమంత్, బసంత్, దుర్గా సోరెన్. కుమార్తె పేరు అంజలి. 2009లో దుర్గా సోరెన్ మృతి చెందారు. బసంత్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. సంతాల్ కమ్యూనిటీకి చెందిన శిబూ సోరెన్... వామపక్ష నేత ఏకే రాయ్, కుర్మి మహతో వినోద్ బిహారీ మహతోతో కలిసి 1972లో జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం)ను ఏర్పాటు చేశారు. తర్వాత ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన పోరాటంలో కీలక నేతగా ఎదిగారు. ఆ పోరాట ఫలితంగా 2000లో జార్ఖండ్ రాష్ట్రం ఏర్పడింది. 2005లో ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన మూడుసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ... ఒక్కసారి కూడా పూర్తికాలం పదవిలో కొనసాగలేదు. 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించినా... అక్కడా అదే పరిస్థితి. 1974 నాటి కేసు కారణంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. తన మాజీ కార్యదర్శి హత్య కేసులో దోషిగా తేలడంతో మరోసారి కేంద్రమంత్రి పదవి కోల్పోయారు. ఒక హత్యకేసులో కేంద్రమంత్రి దోషిగా తేలడం అదే తొలిసారి. అయితే ఢిల్లీ హైకోర్టు తర్వాత ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. శిబూ సోరెన్‌కు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఆయన ఎనిమిది సార్లు లోక్‌సభ, రెండుసార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. 'శిబూసోరెన్‌జీ అట్టడుగు స్థాయి నుంచి ప్రజాజీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగారు. ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. గిరిజనులు, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడం కోసం కృషి చేశారు. ఆయన మరణం బాధాకరం. ఆయన కుటుంబం, అభిమానుల గురించే నా ఆలోచనంతా. ఇప్పటికే హేమంత్ సోరెన్‌జీతో మాట్లాడాను' అని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు.



రాహుల్‌కు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై దాఖలైన క్రిమినల్ పరువునష్టం కేసులో విచారణను సుప్రీంకోర్టు సోమవారం నిలిపివేసింది. భారత్ జోడోయాత్ర సందర్భంగా సరిహద్దుల్లో భారత్, చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణల గురించి మీడియాతో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై లక్నో కోర్టులో క్రిమినల్ పరువునష్టం కేసు దాఖలైన సంగతి తెలిసిందే. 'భారత భూభాగంలో 2 వేల కిలోమీటర్లు చైనా ఆక్రమించిందని మీకు ఎలా తెలుసు? మీరు అక్కడ ఉన్నారా? అందుకు సాక్ష్యంగా మీదగ్గర ఏదైనా విశ్వసనీయమైన ఆధారం ఉందా? మీరు నిజమైన భారతీయులైతే

- మిగతా 2 లో

ఏపీ హైకోర్టు అదనపు జస్టిస్‌గా తుహిన్ ప్రమాణం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అదనపు న్యాయమూర్తిగా జస్టిస్ తుహిన్ కుమార్ గేదెల సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయనచే రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగేలా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. తుహిన్ నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. తుహిన్ కుమార్ స్వస్థలం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కత్తుల

- మిగతా 2 లో

భారత్‌పై సుంకాలు పెంచుతా: ట్రంప్

వాషింగ్టన్: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం వల్ల భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో విరుచుకుపడుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు ఆగని పక్షంలో భారత్‌పై ఇప్పటికే విధించిన సుంకాలను గణనీయంగా పెంచుతానంటూ ప్రకటించారు. 'రష్యా నుంచి భారత్ భారీగా చమురును కొనుగోలు చేయడం మాత్రమే కాదు దానిని బహిరంగ మార్కెట్‌లో అధిక లాభాలకు

- మిగతా 2 లో

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

రూ.665 కోట్లతో అభివృద్ధి పనులు: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో – కొత్తగూడెం : తన నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అత్యంత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం పరితపిస్తున్నానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజక వర్గం పరిధిలో కొత్తగూడెం, సుజాతనగర్, చుంచుపల్లి మండలాలలో రూ.665.31 కోట్ల

- మిగతా 2 లో

కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నైతిక బాధ్యత వహించాల్సిందేనని, దీనిపై సీబీఐ విచారణకు కేంద్రం ఆదేశించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమ వేదికగా ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన నివేదికను ప్రభుత్వానికి అందజేశారని, దాని నివేదిక ఆధారంగా వచ్చే వార్తలను ఏ మూలన చూసినా అవినీతి జరిగిందనే అర్థమవుతోందని, దానికి డిజైన్ మార్చిన మాటా వాస్తవమేనని అన్నారు. అదేమిటంటే కేసీఆర్ తాను 73 వేల పుస్తకాలు చదివినట్లుగాను, ప్రపంచ పరిజ్ఞానం ఆయనకే ఉన్నట్లుగాను, ఆయనే చెప్పిందే వేదమని, ఆయనే ప్రాజెక్టును డిజైన్ చేసినట్లుగా ఒక రాజకీయ రూపకల్పన చేశారేగానీ, సాంకేతిక పరమైన రూపకల్పన చేయలేదని తెలిపారు. దీంతో అనేక అవకతవకలకు ఆస్కారం ఏర్పడిందని, అందులో పని చేసే ఇంజినీర్ల ఇళ్లల్లో కట్టలు కట్టలుగా డబ్బులు దొరికాయని గుర్తు చేశారు. అందులో పని చేసే ఇంజినీర్ల దగ్గరే కోట్ల రూపాయలు దొరికితే, దాన్ని రూపకల్పన చేసిన వారి దగ్గర ఇంకెంత ఉంటుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌పై బీజేపీకి ఎలాంటి ప్రేమలేదనుకుంటే సీబీఐ విచారణకు ఆదేశించాలన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో ఇలాంటి అవినీతికి ఆస్కారం ఉండబోదని అన్నారు.

2 లో

రాజ్యాధికారంలో బీసీలకు సమ ప్రాధాన్యం

42 శాతం రిజర్వేషన్ల కోసం కవిత దీక్ష

తెలంగాణ జాగృతి చేసే పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సోమవారం ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్ష చేపట్టారు.

జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదా పునరుద్ధరణ?

రాష్ట్రపతితో మోదీ, అమిత్‌షా భేటీపై ఊహాగానాలు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించనున్నారనే ప్రచారం ఊపందుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదివారం ఒకరి తరువాత మరొకరు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. రాష్ట్రపతి భవన్ ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ధ్రువీకరించింది. అయితే సమావేశాల వెనుక కారణం ఏమిటనేది మాత్రం స్పష్టం చేయలేదు. అమిత్‌షా తన కసరత్తులో భాగంగా కొంతమంది

- మిగతా 2 లో

పార్లమెంటులో బిల్లు పెట్టాలి

మోదీకి డి.రాజా లేఖ



న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తక్షణమే పునరుద్ధరించాలని, ఈ వ్యవహారంలో మరింత జాప్యం చేయొద్దని, ఇందుకోసం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. ఇదే అంశమై ఆయన సోమవారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. అధికరణ 370ను ఏకపక్షంగా రద్దు చేసి, జమ్మూకశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించి ఆరేళ్లు గడిచాయని గుర్తుచేశారు. జమ్మూకశ్మీర్‌కు మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని, రాష్ట్ర హోదాను పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. 'దీర్ఘకాలం ప్రజా ప్రభుత్వం లేకపోయినా, విపత్తులు ఎదురైనప్పటికీ జమ్మూకశ్మీర్ ప్రజలు ప్రజాస్వామ్యం పట్ల తమ నిబద్ధతను చాటారు. అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పాల్గొన్నారు. ఓట్లు వేసి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. అయినా వారికిచ్చిన హామీ

- మిగతా 2 లో

ఎస్ఐఆర్‌పై వీడని పట్టు

- చర్చకు విపక్షాల డిమాండ్
- తెరపైకి క్రీడాబిల్లు తెచ్చిన ప్రభుత్వం
- తీవ్ర నిరసన తెలిపిన ప్రతిపక్ష సభ్యులు
- ఉభయసభలు నేటికి వాయిదా

న్యూఢిల్లీ: బీహార్‌లో ఎస్ఐఆర్ అంశాన్ని చర్చించాల్సిందేనని విపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య ఉభయసభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా సీనియర్ నాయకుడు, సిట్టింగ్ ఎంపీ శిబూ సోరెన్‌కు నివాళులర్పించిన తర్వాత రాజ్యసభ వాయిదా పడింది. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాల నిరసన నేపథ్యంలో లోక్‌సభ కార్యకలాపాలు స్తంభించాయి. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి తరచూ అంతరాయం కారణంగా ఒక్క బిల్లు కూడా సభ ఆమోదం పొందలేదని స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్ష సభ్యులకు గుర్తు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ సమావేశమైనప్పుడు కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ... ప్ల కార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి ఎస్ఐఆర్‌పై చర్చించాలనే డిమాండ్‌కు మద్దతుగా నినాదాలు చేశాయి. అయితే సోమవారం రెండు కీలక క్రీడా బిల్లులను చర్చకు జాబితా చేశామని, బిల్లులను చర్చించి ఆమోదించకపోతే సభ ఆటగాళ్లకు న్యాయం చేయదని స్పీకర్ స్థానంలో కూర్చున్న జగదాంబికా పాల్ అన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. జాతీయ క్రీడా పాలన బిల్లు–2025, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు–2015 పై చర్చ జరపాలని బీసీఏ సమావేశంలో నిర్ణయించినట్లు మంత్రి కిరెన్ రిజిజు పేర్కొంటూ... ప్రతిపక్ష ఎంపీల నిరసనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బిల్లులు క్రీడా రంగానికి, అథ్లెట్లకు ముఖ్యమైనవని అన్నారు. సభలో గందరగోళం సృష్టించడం, కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం ప్రతిపక్షాలకు సముచితం కాదని తెలిపారు. మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ జాతీయ క్రీడా పాలన బిల్లు–2025 చాలా ముఖ్యమైనదని అన్నారు. చర్చ, ఆమోదం కోసం దీనిని పరిగణించాలని ఆయన సభను కోరారు. 2036 ఒలింపిక్స్ కోసం భారతదేశం బిడ్ చేయబోతోందన్నారు. నిరసన తెలుపుతున్న సభ్యులు తమ సీట్లకు తిరిగి వెళ్లి బిల్లులపై చర్చించడానికి అనుమతించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ ఆర్.సుధ బంగారు గొలుసును లాక్కున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, స్పీకర్ ఓం బిర్లా కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ పోలీసులను ఆదేశించారని పాల్ సభ్యులకు చెప్పారు. కొనసాగుతున్న గందరగోళం మధ్య, ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి కస్టమ్స్ సుంకంపై తీర్మానం ప్రవేశపెట్టారు, దీనిని వాయిస్ ఓటు ద్వారా ఆమోదించారు. ఉదయం 11 గంటలకు సభ సమావేశమైనప్పుడు... ప్రతిపక్ష ఎంపీలు ఎస్ఐఆర్, ఇతర అంశాలపై నిరసన తెలిపారు.

ఇదీ లోకం!

ఈ మతలబేమిటి?

- లూలూ పెట్టుబడి రూ.160 కోట్లు
- ఆర్టీసీ స్థలాల విలువ రూ.400 కోట్లు
- ఎవరి లాభం కోసం ఆగమేఘాలపై జీవో
- ఏపీఎస్ఆర్టీసీ బతుకు బస్టాండే : ప్రజా సంఘాలు
- నేటి నుంచి జిల్లాల వారీగా సమావేశాలు : ఈయూ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: సాధారణంగా ఎవరైనా జీవనం తలక్రిందులైతే వారి బతుకు బస్టాండే అని ఎద్దేవా చేస్తుంటారు. ఇప్పుడు అది ఏకంగా ఆర్టీసీ బస్టాండుకే వర్తిస్తోంది. ఆర్టీసీ ఆస్తులు... బతుకు బస్టాండే అయ్యేలా ప్రభుత్వ తీరు ఉంది. ఇప్పటికే మలేషియాలో వ్యాపారాలను బంద్ చేసుకున్న లూలూకు విలువైన ఆర్టీసీ స్థలాలను కారు

- మిగతా 2 లో

విశాలాంధ్ర

మంగళవారం 05, ఆగస్టు 2025

ట్రంప్ సుంకాలు, ఆంక్షలకు వ్యతిరేకంగా

బ్రెజిల్‌లో ప్రజాందోళనలు

బ్రసిలియా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలను బ్రెజిల్ ప్రజలు తిరస్కరిస్తున్నారు. సుంకాలు పెంచడం, తమ దేశంపై ఆంక్షలు విధించడంపై నిరసన గళం వినిపిస్తున్నారు. ఈనెల 1 నుంచి బ్రెజిల్ వ్యాప్తంగా ప్రజాందోళనలు మిన్నంటాయి. సార్వభౌమత్వంపై రాజీ లేదన్న నినాదాలు మార్మోగాయి. ఇదే క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లోగల అమెరికా కాన్సులేట్లను నిరసనకారులు ముట్టడించారు. బ్రెజిల్‌లో అమెరికా రాయబార కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సుంకాలను అస్త్రంగా మల్చుకొని బ్రెజిల్ సార్వభౌమత్వాన్ని, న్యాయపరమైన స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేందుకు అమెరికా యత్నిస్తోందని బ్రెజిల్ ప్రజలు ఆరోపించారు. మాజీ అధ్యక్షుడు బొల్సనారోకు మద్దతుగా తమ దేశంపై కక్షసాదింపునకు ట్రంప్ పాల్పడటాన్ని ఎండగట్టారు. బోల్సనారోతో పాటు ట్రంప్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. భారీ బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. బ్రెజిల్ ఉత్పత్తులపై 50 శాతం వరకు సుంకాలను అమెరిరా ప్రకటించింది. మాజీ అధ్యక్షుడు బోల్సనారో కేసును విచారించే బ్రెజిల్ ఫెడరల్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ దే మొరేల్స్‌పై ఆంక్షలు విధించింది. అమెరికా తన వాణిజ్య భాగస్వామ్య దేశాలన్నింటికంటే బ్రెజిల్‌పైనే అత్యధిక సుంకాలు ప్రకటించింది. అధికారాన్ని దుర్వినియోగిస్తున్నట్లు బ్రెజిల్ సర్వోన్నత న్యాయ వ్యవస్థను ట్రంప్ విమర్శించారు. బోల్సనారోపై విచారణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాలతో బ్రెజిల్ అధ్యక్షుడు లులా దా సిల్వా అమెరికా తీరును ఆక్షేపించారు. బ్రెజిల్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని తీవ్రంగా ఖండించారు. దేశ ప్రయోజనాల కంటే విదేశీ పొత్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారంటూ ప్రతిపక్షాన్ని ముఖ్యంగా బోల్సనారో కుటుంబాన్ని దుయ్యబట్టారు. బోల్సనారో వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని ప్రతిఘటిస్తామన్నారు. ఇదిలావుంటే, బోల్సనారోకు మద్దతు తెలుపుతూ ప్రజలు కొందరు అనేక నగరాల్లో సుప్రీం ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి మోరేస్, అధ్యక్షుడు లులా దా సిల్వాకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించారు.

అమెరికాలో బోయింగ్ ఉద్యోగుల సమ్మె

న్యాయమైన కార్మిక ఒప్పందానికి డిమాండ్- పాల్గొన్న 3వేల మంది

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికాలోని మిస్సోరీ, ఇల్లినాయిస్ రాష్ట్రాల్లో 3,200 మంది బోయింగ్ యూనియన్ వర్కర్లు సమ్మెబాట పట్టారు. న్యాయమైన ఒప్పందం కోసం కంపెనీతో చర్చలు ఫలించకపోవడంతో ఉద్యోగులు వీధుల్లోకి వచ్చి సోమవారం భారీ స్థాయిలో నిరసన తెలిపారు. బోయింగ్‌తో నాలుగేళ్ల లేబర్ ఒప్పందం సవరణను తిరస్కరిస్తూ 837 మంది ఓటేసినట్లు ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ మెషినిస్ట్స్ అండ్ ఏరోస్పేస్ వర్కర్స్ (ఐఏఎం) సభ్యులు ప్రకటించిన తర్వాత సమ్మెకు పిలుపునిచ్చారు. 'కార్మికుల ఐక్యశక్తి బోయింగ్‌కు తెలిజేస్తాం' అని ఐఏఎం అంతర్జాతీయ అధ్యక్షుడు బ్రెయిన్ బ్రయంట్ ఒక ప్రకటన చేశారు. తమ కుటుంబాలకు భద్రత కల్పిస్తూ, తమ విలువైన అనుభవానికి గుర్తింపు లభించే విధంగా ఒప్పందాన్ని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారని, ఇది న్యాయమైనదేనని ఐఏఎం మిడ్‌వెస్ట్ టెరిటరీ జనరల్ వైస్ ప్రెసిడెంట్ శామ్ సిసినెల్లీ వెల్లడించారు. ఐకమత్యమే మన బలం అని నినదించారు. వ్యతిరేక ఓటు ద్వారా కార్మికుల శక్తి ఏమిటో యాజమాన్యానికి తెలియజేస్తామని, కార్పొరేట్ అత్యాసను తిరస్కరిస్తామని, మాకు, మా కుటుంబాలకు మెరుగైన భవిష్యత్ కోసం పోరాడతామని ఐఏఎం రెసిడెంట్ జనరల్ వైస్ ప్రెసిడెంట్ జోడీ బెన్నెట్ పిలుపునిచ్చారు. ఆరు లక్షల మందికిపైగా ఏరోస్పేస్, రక్షణ, ఎయిర్‌లైన్స్, రైల్‌రోడ్, ఆరోగ్య సంరక్షణ, ఆటోమొటివ్ తదితర రంగాల కార్మికులకు ప్రాతినిధ్యం వహించే ఉత్తర అమెరికాలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా ఐఏఎం ఉంది. తాము ప్రతిపాదించిన కార్మిక ఒప్పందాన్ని వర్కర్లు తిరస్కరించడంపై బోయింగ్ యాజమాన్యం అసంతృప్తి వ్యక్తంచేసింది. 40శాతం సగటు వేతన వృద్ధిని వారు వద్దంటున్నారని పేర్కొంది. సమ్మెకు సిద్ధమని, ఆందోళనలకు వెళ్లని సిబ్బంది ద్వారా తమ వినియోగదారులకు సేవలు అందించేలా ఏర్పాట్లు చేసుకున్నట్లు పేర్కొంది.

మా గళం ప్రపంచానికి వినిపించాలి

వెస్ట్‌బ్యాంక్‌లో పలస్తీనియన్ల భారీ ర్యాలీ - గాజాకు మద్దతు కోసం డిమాండ్

గాజా: గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ సైనిక చర్యలను నిరసిస్తూ, గాజాకు సాయాన్ని మరింత పెంచాలని డిమాండ్ చేస్తూ వెస్ట్‌బ్యాంక్‌లో వేలాది మంది పలస్తీనియన్లు వీధుల్లోకి వచ్చారు. భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. పలస్తీనా జెండాలు, పౌష్టికాహార లోపంతో భాపడే గాజా ప్రజల చిత్రాలు ప్రదర్శిస్తూ కదం తొక్కారు. తమ గళం ప్రపంచానికి వినిపిస్తామన్నారు. మధ్య రమల్లాలోని అల్ మనారా స్క్వేర్ వద్దకు చేరుకొని ప్రదర్శన నిర్వహించారు. నబ్లస్, తుబాస్, ఖల్కిల్యా, సల్ఫిట్, జెనిన్, హెబ్రాన్‌లో ఆందోళనలు జరిగాయి. యుద్ధాన్ని తక్షణమే ఆపాలని, ఆంక్షలు ఎత్తివేయాలని, మానవతా సహాయానికి అనుమతి ఇవ్వాలని ప్రదర్శకారులు డిమాండ్ చేశారు.

ఇజ్రాయిల్ దాష్టీకాలకు అద్దంపట్టే విధంగా ఆకలితో పిల్లలు అల్లాడుతుండటాన్ని కళ్లకు కట్టేలా అస్థిపంజరాలను పోలిన దుస్తులతో, శవాలను మోసుకెళుతున్నట్లుగా చిత్రీకరిస్తూ నిరసన తెలిపారు. ఇజ్రాయిల్ తీరును తీవ్రస్థాయిలో ఆక్షేపించారు. సహాయ సామగ్రితో వేల సంఖ్యలో ఉన్న ట్రక్కులను అనుమతించకుండా గాజా ప్రజలను పస్తులుంచి చంపుతున్నారని ఆరోపించారు. పలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని నిర్ణయించిన ప్రపంచ దేశాల్లో ఇందుకు జాప్యం చేయకుండా, ఆంక్షలు విధించకుండా ముందుకెళ్లాలని ఫత్హా సెంట్రల్ కమిటీ ఉప ప్రధాన కార్యదర్శి సబ్రీ సైదమ్ కోరారు. తమ ఆత్మగౌరవం, మాతృభూమి ప్రతిష్ఠ, స్వాతంత్ర్యం, స్వేచ్ఛ జీవితం కంటే పలస్తీనియన్లకు ఒక సంచి గోదుమ పిండి, ఆహారం ఎక్కువ విలువైనది కాదని నొక్కిచెప్పారు. స్వాతంత్ర్య-సార్వభౌమ పలస్తీనా సాధనకు పోరు మరింత బలోపేతం కావాలని పలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ పిలుపునిచ్చింది.

జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదా పునరుద్ధరణ?

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ నేతలు, అప్పటి జమ్మూకశ్మీర్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులతో సమావేశమైనట్టు చెబుతున్నారు. మోదీ సైతం మంగళవారం ఎన్డీయే ఎంపీలతో కీలక సమావేశం జరపనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆగస్టు 5న 370 అధికరణ రద్దు వార్షికోత్సవం కావడంతో ఆరోజు కీలక ప్రకటన ఉండవచ్చని, ముందస్తు కసరత్తులో భాగంగానే కీలక సమావేశాలు జరుగుతున్నాయని ఊహాగానాలు వెలువడుతున్నాయి. కాగా, ఈనెల మొదటి రెండు రోజుల్లో జమ్మూకశ్మీర్ బీజేపీ మాజీ అధ్యక్షుడు సత్‌పాల్ శర్మ, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తాతో అమిత్‌షా సమావేశమయ్యారు. ఆల్ జమ్మూ అండ్ కశ్మీర్ షియా అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్రాన్ రజా అన్సారి సైతం సోమవారం అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఢిల్లీలో వరుస సమావేశాల నేపథ్యంలో ఆగస్టు 5న కీలక ప్రకటన వెలువడే అవకాశాలపై సోషల్ మీడియాలోనూ చర్చ జరుగుతోంది.

దీనిపై రిటైర్డ్ ఆర్మీ అధికారి, రచయిత కన్వల్‌జిత్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ కశ్మీర్‌లో శాంతి కోసం ఎన్నో విలువైన ప్రాణాలు కోల్పోయామని, ఆ కారణంగా ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదని అన్నారు. శాంతి పునరుద్ధరణ ప్రక్రియ కొనసాగుతున్నందున పరిస్థితి మొత్తం సానుకూలమయ్యేంత వరకూ వేచిచూడాలని, హడావిడి నిర్ణయం మంచిది కాదని చెప్పారు. రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తారనే బలమైన ఊహాగానాలు రావడం నిజమేనని జియోపొలిటికల్ విశ్లేషకులు ఆర్తి టికూ సింగ్ అన్నారు. అయితే మరో విచిత్రమైన వాదన కూడా వినిపిస్తోందని, కశ్మీర్, జమ్మూను వేరు చేసి రెండు వేర్వేరు రాష్ట్రాలుగా గుర్తిస్తారనే ప్రచారం ఒకటి ఉందని, అదే జరిగితే ఇంతకంటే వినాశకర పరిణామం మరొకటి ఉండదని వ్యాఖ్యానించారు.

పార్లమెంటులో బిల్లు పెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం రాష్ట్ర హోదాను కేంద్రప్రభుత్వం పునరుద్ధరించలేదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి తమ నీడలో ఉంచుకోవాలని కేంద్రం చూస్తోంది. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. దేశ సమాఖ్య స్ఫూర్తికి విఘాతం' అని డి.రాజా వెల్లడించారు. పార్లమెంటు వర్షకాల సమావేశాల్లో జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరద్దరణ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేయించాలని, ఇందులో జాప్యం వద్దని సూచించారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరించడమన్నది కేంద్రం ఇచ్చే రాయితీ కాదని డి.రాజా నొక్కిచెప్పారు. అది న్యాయమైన చర్య... రాజ్యాంగబద్ధ దిద్దుబాటుగా వర్ణించారు. దేశ ఐక్యత, ప్రజాస్వామిక స్వీయ పరిపాలనను బలోపేతం చేసేందుకు అవసరమైన అడుగుగా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ ప్రజలకు న్యాయం జరిగేలా... వారంతా మరోమారు గౌరవంగా జీవించగలిగేలా, హక్కులు పొందేలా... ప్రజాస్వామిక స్వీయపరిపాలన అనుభవించగలిగే తక్షణమే చర్యలు తీసుకోవాలని, రాజ్యాంగబద్ధ హామీలకు కట్టుబడుతూ జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని డి.రాజా కోరారు. ప్రధాని మోదీ నుంచి సానుకూల స్పందనను ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏపీ హైకోర్టు అదనపు జస్టిస్‌గా తుహిన్ ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

కవిటి గ్రామం. 1994 మార్చి 9న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఆయన పేరు నమోదయింది. 2000-2004 మధ్య హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా సేవలు అందించారు. 2010-14 మధ్య జీఎంసీ తరపున హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2016-17లో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

(మొదటిపేజీ తరువాయి)

నిధులతో చేపట్టిన పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. కొత్తగూడెంలో జెన్కో సీఆర్‌ఆర్ నిధులు రూ.కోటితో నిర్మించనున్న బీసీ బాలికల భవన సముదాయాలకు శంకుస్థాపన చేశారు. కూనంనేని మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని సాటివారిగూడెం, చాతకొండ, హమాలీ కాలనీ, సంజయ్ నగర్, అశోక్ నగర్ పంచాయతీల్లో రూ.414.5కోట్లు, చుంచుపల్లి మండలంలో రూ.64 లక్షలు, సుజాతనగర్ మండలంలో రూ.87.37లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలు, వాటర్ ట్యాంకుల పనులు చేపట్టి కొన్నింటిని పూర్తి చేశామన్నారు. గ్రామాలు, బస్తీల్లో ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేపడుతున్నామని వివరించారు. పనుల్లో నాణ్యతా లోపం, జాప్యాన్ని సహించబోనని హెచ్చరించారు. దీనికి అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఈఈ వెంకటేశ్వర్ రావు, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, పంచాయతిరాజ్ డీఈ రామకృష్ణ, ఏఈ శివలాల్, మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్‌శాఖ, ఐటీసీపీ అధికారులు, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, ఎండి యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్, సత్యనారాయణాచారి, నేరెళ్ల రమేష్, నేరెళ్ల శ్రీనివాస్, జగన్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, సాధిక్, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంలో బీసీలకు సమ ప్రాధాన్యం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ జాగృతి చేసే పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సోమవారం ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. తొలుత ఆమె అంబేద్కర్, పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... తెలంగాణలో ప్రతి ఒక్కరికీ రాజ్యాధికారంలో వాటా కావాలన్నారు. ఆర్థిక అవకాశాలూ రావాలన్నారు. సమాజంలో సగ భాగం బీసీలు ఉన్నారనీ, వాళ్లకు రాజకీయంగా సమ ప్రాధాన్యత దక్కాలన్న ఉక్కు సంకల్పంతో ఈ దీక్ష చేపట్టినట్టు పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లు బీసీలకు న్యాయం చేయాలని గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడుతున్నాం... అందరి ఆకాంక్ష ఒకటే... స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని... కానీ రాష్ట్ర ప్రభుత్వం బీజేపీపై నెపం పెట్టి తప్పించుకోవాలని చూస్తోందని విమర్శించారు. బీసీ బిల్లుపై బీజేపీ లేవనెత్తిన అనుమానాలను సీఎం రేవంత్‌రెడ్డి నివృత్తి చేయాలన్నారు. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు ఇస్తామని సీఎం హామీ ఇవ్వాలన్నారు. ముస్లింలను మినహాయించి బీసీలకే 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పాలి... అప్పుడు బీజేపీ ఎందుకు ఒప్పుకోదో మేం చూస్తామన్నారు. 'ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్‌కు ప్రత్యేకంగా పార్లమెంటులో బిల్లు పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇందుకు కృషి చేయాలి' అని కవిత అన్నారు. పెద్దఎత్తున కార్యకర్తలు, తెలంగాణ జాగృతి శ్రేణులు తరలివచ్చి ఆమెకు మద్దతు తెలిపారు.

ఈ మతలబేమిటి?

(మొదటిపేజీ తరువాయి)

చౌకగా కట్టబెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ దుర్భర పరిస్థితులు తలెత్తాయి. నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న లూలూ కంపెనీ కేవలం రూ.160 కోట్లు మాత్రమే పెట్టుబడులు పెడుతుండగా... అంతకుమించి రూ.400 కోట్ల విలువైన ఆర్టీసీ స్థలాలను కారుచౌకగా 99 ఏళ్ల పాటు అద్దెకు కట్టబెట్టడం వెనుక మతలబు, డొల్లతనం ఏమిటని ఆర్టీసీ యూనియన్ల నేతలు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇంతవరకు ఏర్పాటు చేసిన ఏ ప్రైవేట్ మాల్‌కు ప్రభుత్వ స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవనీ, ఒక్క లూలూకే ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటని నిలదీస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీ అయిన లూలూ వస్తే తమ వ్యాపారాలు దెబ్బతింటాయని వర్తక, వాణిజ్య సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం జారీజేసిన జీవో నంబరు 137 రద్దు చేయాలని వామపక్ష పార్టీలు, ఆర్టీసీ, ఇతర ప్రజా సంఘాలు కార్యాచరణ ప్రకటించిన విషయం విదితమే. ఆర్టీసీని లూలూకు దారాదత్తం చేసే ప్రభుత్వ విధానాలను తూర్పారబడుతున్నాయి. ఇటీవల సీపీఐ, పౌర వేదిక అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాలను వేర్వేరుగా నిర్వహించాయి. అతి విలువైన ఆర్టీసీ, ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం చేయొద్దు అని, లూలూ వంటి కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెట్టవద్దని తీర్మానించాయి. విజయవాడ నగర నడిబొడ్డులోని పాత బస్టాండ్ (గవర్నరుపేట) 4.15 ఎకరాల స్థలంతో పాటు విశాఖపట్నంలో 13.5 ఎకరాల ప్రభుత్వ స్థలాలను లూలూ మాల్ ఇంటర్నేషనల్ సంస్థకు చంద్రబాబు ప్రభుత్వం దారాదత్తం చేయడాన్ని తూర్పారబట్టాయి. ఉద్యమ కార్యాచరణలో భాగంగా పౌర వేదిక అధ్వర్యంలో ఆర్టీసీ స్థలాల పరిరక్షణ కమిటీ ఏర్పాటయింది. వాస్తవంగా ప్రభుత్వానికి కంపెనీలు తేవడం, ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ఉన్నప్పుడు అమరావతి రాజధాని పరిధిలో తొలి విడతగా తీసుకున్న 54 వేల ఎకరాల భూమి, దానిపక్కనే సీఆర్డీఏ పరిధి బయట గుంటూరు జిల్లాల్లో అదనంగా భూమి ఉందని, అక్కడ లూలూకు కేటాయిస్తే ఎవరూ వ్యతిరేకించేవారు కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నొక్కిచెప్పిన విషయం తెలిసిందే. నష్టాల్లో ఉన్న లూలూకు కమిషన్లకు కక్కుర్తిపడి కావాలనే ఆర్టీసీ ఆస్తులను అప్పనంగా కట్టబెడుతున్నారని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి.

ఈయూ ఉద్యమ కార్యాచరణ ఇలా...

ఆర్టీసీ(పీటీడీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య ఉద్యమ కార్యాచరణ వివరాలను వెల్లడించారు. ఈ నెల 5న అనంతపురం, తిరుపతి, ఒంగోలు, కాకినాడ, విశాఖపట్నం, ఏలూరులో విలేకరుల సమావేశాలను నిర్వహిస్తారు. 9వ తేదీన కడప, నెల్లూరు, గుంటూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, కృష్ణాలో ఈయూ విలేకరులు సమావేశాలను ఏర్పాటు చేసింది. ఇదే తరహాగా 13న కర్నూలు, పల్నాడు, ధర్మవరం, విజయనగరం, పార్వతీపురం, శ్రీసత్యసాయి, 17వ తేదీన నంద్యాల, చిత్తూరు, అనకాపల్లి, కోనసీమ, అన్నమయ్య, పాడేరు, బాపట్లలో ముఖ్య నేతలు పాల్గొని... జీవో 137 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమావేశాలు నిర్వహిస్తారు. పత్రికల ద్వారా ప్రజలకు వాస్తవ సమాచారం అందజేస్తారు. పౌర వేదిక అధ్వర్యంలో ఈ నెల 6న పాత బస్టాండ్ వద్ద తలపెట్టిన మహాధర్నాకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో ఉద్యమం తీవ్రతరం కానుంది.

రాష్ట్ర స్థాయి పోరాటానికి పునాది : పలిశెట్టి దామోదరరావు(రాష్ట్ర అధ్యక్షులు-ఈయూ)

జిల్లా స్థాయిలో చేపడుతున్న ఈ కార్యక్రమాల అనంతరం త్వరలో రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం. రాష్ట్రంలో అనేక షాపింగ్ మాల్స్ ఉన్నప్పటికీ వాటికి ఏ ప్రభుత్వమూ స్థలాలు కేటాయించలేదు. అభివృద్ధి చేయాలంటే విజయవాడ నగర పరిసర ప్రాంతాల్లో అనేక ఖాళీ స్థలాలు ఉన్నాయి. అక్కడ మాల్స్ ఏర్పాటు చేస్తే ఆయా ప్రాంతాలు అభివృద్ధి అవుతాయి. అంతేగానీ ఆర్టీసీ స్థలాలను అభివృద్ధి పేరుతో లూలూకు కట్టబెట్టే ప్రయత్నాన్ని విడనడాలి. జీవో 137 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పూర్తిగా నష్టాల్లో లూలూ మాల్స్ : జీవీ నరసయ్య (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి-ఈయూ)

పూర్తిగా నష్టాల్లో ఉన్న లూలూ మాల్స్ ఉన్న కంపెనీకి రూ.160 కోట్ల పెట్టుబడికిగాను రూ.400 కోట్ల విలువైన ఆర్టీసీ స్థలాలను కట్టబెట్టడంలో ప్రభుత్వ మతలబేమిటి? విజయవాడ, విశాఖపట్నంలో ఆర్టీసీ స్థలాలను లూలూకు దారాదత్త చేసే జీవో నంబరు 137 తక్షణమే విరమించాలి. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సంఘటితంగా ఆందోళనలు నిర్వహిస్తాం.

బస్టాండ్ల బతుకు బస్టాండే : సిహెచ్.సుందరయ్య (రాష్ట్ర అధ్యక్షులు, ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్)

విలువైన ఆర్టీసీ స్థలాలు లూలూకు అప్పనంగా కట్టబెట్టడంతో ఆర్టీసీ బస్టాండ్లు, స్థలాల నిర్వహణ సైతం బతుకు బస్టాండ్ తరహాగానే మారింది. సిబ్బంది నియామకాలు, అదనపు బస్సులపై చంద్రబాబు ప్రభుత్వం నోరు మెదపలేదు. లూలూకు ఆగమేఘాన ఆర్టీసీ ఆస్తులను దారాదత్తం చేసే జీవోతో ప్రజా రవాణా సంస్థను ప్రైవేట్ పరం చేసే ఆలోచనలుగా ఈ ప్రభుత్వ విధానాలు స్పష్టమవుతున్నాయి. గుజరాత్ మోడల్ పేరుతో, ఇంటిగ్రేటెడ్ బస్ స్టేషన్ల అభివృద్ధి సాకుతో ఆటోనగర్ డిపోను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేలా ప్రభుత్వం వ్యూహం పన్నుతోంది.

'లైఫ్‌సైన్సెస్'... మరో మైలురాయి

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలంగాణ లైఫ్‌సైన్సెస్ రంగంలో ఈరోజు ఓ మైలురాయిగా నిలిచిపోతుందని, ఇందుకు నేటి ఈ కార్యక్రమమే నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వ చిత్తశుద్ధి, దృష్టికోణం, కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందన్నారు. ఈ విజయం సాధించడంలో అహర్నిశలు శ్రమించిన మంత్రి శ్రీధర్ బాబుకి, జయేష్ రంజన్ కి, పాలుపంచుకున్న అధికారులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇది తెలంగాణ రైజింగ్ 2047 దిశగా మేము వేసిన మరొక ముఖ్యమైన అడుగని, తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దుతామని, ఎలీ లిల్లీ సంస్థ లీడర్ షిప్ ను, ఉద్యోగులను హైదరాబాద్ నగరానికి సాదరంగా ఆహ్వానం పలుకుతున్నానని తెలిపారు. తెలంగాణపై నిరంతర నమ్మకం ఉంచి, అండగా నిలిచి అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నందుకు పారిశ్రామికవేత్తలు-పెట్టుబడిదారులు, ప్రపంచ శ్రేణి కార్పొరేషన్లకు, కంపెనీలకు ధన్యవాదాలు అన్నారు. నేడు ప్రారంభమైన ఎలీ లిల్లీ నూతన కేంద్రం... ఆ సంస్థ గ్లోబల్ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ టెక్నాలజీ, ఇన్నొవేషన్ సెంటర్, ప్రపంచవ్యాప్తంగా రోగులకు పరిష్కారాల కోసం పరిశోధనలో కీలక పాత్ర పోషిస్తుందని, ఎలీ లిల్లీ సంస్థను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయడమంటే ఈ నగరం ఘనతను మీరు ప్రపంచానికి చాటి చెప్పినట్లే అన్నారు. హైదరాబాద్ నగరంలో టాలెంట్ ఉంది, లీడర్‌షిప్ ఉంది, విజన్ ఉంది, మంచి పాలసీ ఉంది, మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. అందుకే ఎలీ లిల్లీ లాంటి గ్లోబల్ లీడర్‌కు ఇది అనుకూలమైన కేంద్రంగా మారిందని, భారతదేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్ ఇప్పటికే గుర్తింపు పొందిందన్నారు. 2000కు పైగా లైఫ్‌సైన్సెస్ కంపెనీలు ఇక్కడ ఉన్నాయని, 200కి పైగా ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ నగరం నుంచి తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని వివరించారు. భారత్‌లో ఫార్మాస్యూటికల్ ఉత్పత్తిలో సుమారు 40 శాతం తెలంగాణలోనే జరుగుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ప్రతి మూడు టీకాలలో ఒకటి హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం లేదా తయారవుతుండటం మాకు గర్వకారణం అన్నారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, భారతదేశంలోని అతిపెద్ద లైఫ్ సైన్సెస్ పరిశోధన- అభివృద్ధి సముదాయంగా నిలిచిందన్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ సంస్థల కోసం హైదరాబాద్ అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రపంచ గమ్యస్థానంగా మారిందని పేర్కొన్నారు. ఎలీ లిల్లీ సంస్థ రాకతో, లైఫ్ సైన్సెస్ రంగంలో తాము మరో మెట్టుకు చేరుకున్నామని అభిప్రాయపడ్డారు. మధుమేహం, ఆంకాలజీ, ఇమ్యునాలజీ, న్యూరోసైన్స్ రంగాలలో ఎలీ లిల్లీ సంస్థ కృషి ఒక గేమ్-ఛేంజర్ గా నిలిచిపోతుందన్నారు. ఎలీ లిల్లీ సంస్థ చేసిన కృషి మిలియన్ల మంది జీవితాలను ప్రభావితం చేయడంతో వారిని రక్షించడానికి తోడ్పడిందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ 2024-25లో హైదరాబాద్‌లో 70 జీసీసీలు ప్రారంభమయ్యాయని, ఇది దేశంలోనే ఒక రికార్డు. మాకు, ఇతర రాష్ట్రాలకు పోలికే లేదు. మాకు మేమే పోటీ. 2025-26లో 100 జీసీసీలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుని, ఆ దిశగా పకడ్బందీ కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మెడ్ టెక్ రంగంలో తెలంగాణ అవకాశాల గని, లైఫ్ సైన్సెస్, డిజిటల్ హెల్త్, ఏఐ ఇన్ హెల్త్ కేర్, తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ తో ఇండస్ట్రీ పాలసీని అనుసంధానం చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పుకొచ్చారు.ఏటా మూడు లక్షల మంది స్టెమ్ గ్రాడ్యుయేట్స్ బయటకు వస్తున్నారని, జీనోమ్ వ్యాలీ, మెడ్ టెక్ పార్క్ లాంటి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు. తెలంగాణ ను మెడ్ టెక్ క్యాపిటల్‌గా తీర్చి దిద్దేందుకు చిత్త శుద్ధితో కృషి చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్ నేతల 'చలో ఢిల్లీ'

విశాలాంధ్ర-హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ 'చలో ఢిల్లీ' కార్యక్రమం చేపట్టింది. ఆ పార్టీ నేతలు సోమవారం చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీ బయలుదేరివెళ్లారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి జెండా ఊపి రైలును ప్రారంభించారు. వీరితో పాటు కాంగ్రెస్ శ్రేణులంతా ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. జంతర్ మంతర్ వద్ద బుధవారం ధర్నా చేపట్టనున్నారు. ప్రతి జిల్లా నుంచి 25 మంది చొప్పున రైలులో వెళ్లారు. మరోవైపు బీసీ రిజర్వేషన్ పెంపుపై చర్చ కోరుతూ మంగళవారం పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానం ఇవ్వనున్నారు. ఈ నెల ఏడో తేదీన ఆ పార్టీ నేతలు రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం అందజేస్తారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించినా కేంద్రం మోకాలడ్డుతోందని విమర్శించారు. రిజర్వేషన్లను సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు.

రాహుల్‌కు సుప్రీంలో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ఇటువంటి వ్యాఖ్యలు చేయరు' అని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. రాహుల్ వ్యాఖ్యలు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సమాచారాన్ని బహిర్గతం చేయడానికేనని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, న్యాయవాది ప్రసన్న కోర్టుకు తెలిపారు. సోషల్ మీడియలో తన అభిప్రాయాలు ఎందుకు వ్యక్తం చేశారని, పార్లమెంటులో మాట్లాడాలని ధర్మాసనం పేర్కొంది. పార్లమెంటులో సమస్యలు లేవనెత్తాలని తెలిపింది. యూపీ ప్రభుత్వానికి, రిటైర్డ్ బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ) అధికారి ఉదయ్ శంకర్ శ్రీవాస్తవకు నోటీసులు జారీ చేసింది. వివిధ కోర్టుల్లో రాహుల్‌పై 20కి పైగా ప్రసంగ సంబంధిత క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఆయనను కేసులతో అణచివేయాలని అనేక మంది చూస్తున్నారని సింఘ్వీ పేర్కొన్నారు. ఈ చర్యలన్నీ చట్టవిరద్ధమైనవని, ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వ విధానాలు, వైఖరులపై వ్యతిరేకతను వ్యక్తం చేయకుండా ఆయన నోరు నొక్కేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు.

భారత్‌పై సుంకాలు పెంచుతా

(మొదటిపేజీ తరువాయి)

అమ్ముకుంటోంది' అని ట్రూత్ మాధ్యమంగా విమర్శించారు. రష్యా యుద్ధ యంత్రం ఉక్రెయిన్‌లో ఎంత మందిని చంపినా భారత్‌కు పట్టడంలేదని, అందుకోసమే అమెరికాకు ఆ దేశం చెల్లించాల్సిన సుంకాలను గణనీయంగా పెంచాలని నిర్ణయించానని ట్రంప్ పేర్కొన్నారు. అయితే దేనిపై సుంకాలు పెంచుతారో వెల్లడించలేదు. ఇటీవల సుంకాల ప్రకటన వేళ ట్రంప్ చేసిన హెచ్చరికలను భారత్ పట్టించుకోలేదు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగుతాయని వెల్లడించింది. ఈ క్రమంలో ట్రంప్ తాజా హెచ్చరికకు ప్రాధాన్యత ఏర్పడింది. ఓ వైపు భారత్ మిత్రదేశమని, నరేంద్ర మోదీ మంచి మిత్రుడు అంటూ మురిపిస్తూ, మరోవైపు సుంకాలు, జరిమానాలు విధిస్తూ అక్కసును ట్రంప్ వెళ్లగక్కుతుండటంపై విమర్శలు వస్తున్నాయి. ఇదిలాఉంటే, ట్రంప్ మంత్రివర్గంలో కీలకంగా ఉన్న స్టీఫెన్ మిల్లర్ కూడా ఓ ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత్‌పై విమర్శలు గుప్పించారు. రష్యాకు పరోక్షంగా ఆదాయాన్ని భారత్ సమకూరుస్తోందని దుయ్యబట్టారు.

ఏపీలో కొత్త బార్ పాలసీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రస్తుత బార్ పాలసీ గడువు తీరడంతో సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ అమల్లోకి రాబోతోంది. మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక, ప్రతిపాదనల ఆధారంగా కొత్త పాలసీకి రూపకల్పన చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు ఉన్నాయి. కొత్త పాలసీలో లాటరీ పద్ధతి ద్వారా బార్లకు అనుమతులు ఇస్తారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, ఐదు లక్షల లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, ఐదు లక్షల పైన జనాభా ఉంటే రూ.75 లక్షల చొప్పున లైసెన్స్ ఫీజు ఏడాదికి పెట్టాలనే సూచన మంత్రివర్గ ఉపసంఘం నుంచి వచ్చింది. కొత్త పాలసీలో అప్లికేషన్ ఫీజు, లైసెన్స్ ఫీజు ద్వారా రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు రావాలనే నిబంధన పెట్టనున్నారు. బార్ పాలసీలోనూ గీత కులాలకు 10 శాతం బార్లు ఇవ్వనున్నారు. లిక్కర్ షాపుల్లో ఎలా అయితే 10 శాతం ఇచ్చారో... అదేవిధంగా బార్లలోనూ ఆ వర్గాలకు బార్లు కేటాయించనున్నారు. సీఎం చంద్రబాబు సచివాలయంలో ఎక్సైజ్ శాఖపై సోమవారం సమీక్ష చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ మద్యం పాలసీ అంటే ఆదాయమే కాదని... ప్రజల ఆరోగ్యం కూడా ముఖ్యమన్నారు. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకుని నూతన బార్ పాలసీ రూపొందించాలని ఆదేశించారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 20, గృహ నిర్మాణ శాఖకు 15, ఉపాధి కల్పనకు 07, పెన్షన్ 09, ఇతర శాఖలకు సంబంధించినవి 14 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు ఘనంగా ఏర్పాట్లు

విశాలాంధ్ర - తొర్రూర్: బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్ అన్నారు. సోమవారం అంబేద్కర్ నగర్లోని ముత్యాలమ్మ టెంపుల్ దగ్గర సిఐ గణేష్ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పొనుగోటి సోమేశ్వరరావుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ గణేష్‌తో కలిసి కమిషనర్ మాట్లాడుతూ బోనాల పండగ ధార్మిక ఉత్సవాలకు మణిహారం మాతృ శక్తికి అంకితమైన ఈ బోనాల ఉత్సవం నగరానికి ఆధ్యాత్మిక వెలుగు నింపుతుందని అన్నారు. తొర్రూర్ భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా అని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని శానిటేషన్, త్రాగునీరు, విద్యుత్ దీపాల అలంకరణ ఏర్పాట్లలో ఇప్పటికే మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారని అని అన్నారు. కావున భక్తులు తీసుకువచ్చే బోనాలు అమ్మవారికి సమర్పించి ఆనందంగా పండగను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్, మున్సిపల్ మాజీ చైర్మన్ రామచంద్రయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ మచ్చ సురేష్, కాంగ్రెస్ నాయకులు దొంగరీ శంకర్, బిజ్జాల అనిల్ మనోహర్, కుశాల్ అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

విశాలాంధ్ర - వనపర్తి : ప్రజావాణి లో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. కీమ్య నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 53 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య ఇప్పటివరకు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులు, మంత్రి నుండి వచ్చిన దరఖాస్తులు, కలెక్టర్ కార్యాలయాని వచ్చిన దరఖాస్తుల పెండింగ్ వివరాలను వివరిం చారు. వచ్చే వారం లోగా దరఖాస్తులు అన్ని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు పాల్గొన్నారు.

వరదకు కొట్టుకుపోయిన డ్రైనేజ్

విశాలాంధ్ర - గూడూరు: గత 15 రోజుల క్రితం నిర్మించిన డ్రైనేజీలు రాత్రి కురిసిన వర్షానికి చల్లాచెదిరి విరిగి పడిపోయాయి. గ్రామస్తులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే నాసిరకంగా డ్రైనేజీని నిర్మించినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే గూడూరు మండలంలోని ఎస్సీ కాలనీలో సైడ్ కాలువల పనులు మొదలుపెట్టి వాటి నాణ్యతను కూడా పట్టించుకోకపోవడంతో విశాలాంధ్ర 'నిర్లక్ష్యంగా డ్రైనేజీల నిర్మాణం' శీర్షిక ద్వారా 15 రోజుల క్రితం ప్రచురించడం జరిగింది. డ్రైనేజీ నిర్మాణ పనులను అధికారులు ఇంతవరకు పరిశీలించినట్లు లేవు. ఐదు లక్షలతో మంజూరైన డ్రైనేజీ నిర్మాణం నత్తనడకన సాగుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే వరద తాకిడికి కూలిపోయి అస్తవ్యస్తంగా తయారైందని కాలనీవాసులు కాంట్రాక్టర్‌పై మండిపడుతున్నారు. కాంట్రాక్టర్ డ్రైనేజీ నిర్మించి కనీసం కూలి వారిని పెట్టి నీళ్లను కూడా కొట్టడం లేదని అలా అయితే కూలిపోయే ప్రమాదం ఉన్నదని మాజీ వార్డ్ మెంబర్ హెచ్ శివ గత పది రోజుల క్రితం హెచ్చరించిన విషయం తెలిసిందే. గ్రామ పెద్దలు కాంట్రాక్టర్‌పై చర్య తీసుకొని అధికారులు తక్షణమే జరిగిన నష్టాన్ని పూడ్చి వెంటనే నష్టం జరిగిన స్థానంలోనే మళ్లీ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులకు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల కోరుతున్నారు.

సంఘీభావ ర్యాలీకి సీపీఐ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర - ఖమ్మం : అమెరికా అండతో ఇజ్రాయిల్ పాలస్తీనాపై చేస్తున్న దాడులను నిరసిస్తూ పాలస్తీనాకు సంఘీభావంగా ఈనెల ఏడున జరిగే సంఘీభావ ర్యాలీకి సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, నగర సమితి బాధ్యుల సంయుక్త సమావేశం సోమవారం గిరిప్రసాద్ భవన్ లో జరిగింది. మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ గాజాలో వేల మంది మరణిస్తున్నారని కేవలం సంపదపై కన్నేసి మాత్రమే ఇజ్రాయిల్ దాడి చేస్తుందన్నారు. కనీస యుద్ధ నీతిని మరిచిపోయిందని సురేష్ తెలిపారు. పసి పిల్లలు, వృద్ధులు, మహిళలు అనే తేడా లేకుండా జనావాసా ప్రాంతాలపై బాంబు దాడులు చేస్తుందని ఇప్పటికే 52వేల మరణించినట్లు వివిధ అంతర్జాతీయ సంస్థలు వెల్లడించాయని ఆయన తెలిపారు. ఇందులో 20 వేల మంది పిల్లలు ఉన్నారని సురేష్ అన్నారు. అమెరికా ప్రపంచ దేశాలపై పెత్తనం చేయాలన్న కాంక్షతో పాలస్తీనాపై దాడికి ఇజ్రాయిల్ను ప్రోత్సహిస్తుందన్నారు. ఖమ్మంలో ఏడున జరిగే సంఘీభావ ర్యాలీలో సిపిఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి ఇందిరా భవన్‌గా నామకరణం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : 5 బెడ్ రూములు, వీడియో కాన్ఫరెన్స్ హాల్, స్టాఫ్ క్వార్టర్స్, సెక్యూరిటీ గదులతో అత్యంత అదనాతన సౌకర్యాలతో నల్గొండ పట్టణం నడిబొడ్డున 13 కోట్ల నిధులతో నిర్మించిన నల్గొండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంను సోమవారం ప్రారంభించి మినిస్టర్ బంగ్లాకు ఇందిరా భవన్ అని పేరు పెడుతున్నట్లు రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే విధంగా క్లాక్ టవర్ సెంటర్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నిర్మించామని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎమ్మెల్యే ఒక్కడిదే కాదని అందరిదని, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు నల్గొండకు వచ్చినప్పుడు వసతి ఉండే విధంగా క్యాంపు కార్యాలయాన్ని నిర్మించామని తెలిపారు. అందుకే ఈ కార్యాలయానికి ఇందిర భవన్ అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. నల్గొండ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా నడుస్తున్నాయని, అంతేకాక ఆయా నియోజకవర్గాలలో కొత్త పనులు మంజూరయ్యాయని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో తహసిల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలకు 20 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ మంత్రి క్యాంప్ కార్యాలయంలో మొదటి ఫైల్‌పై సంతకం పెట్టారు. కోటి 20 లక్షల రూపాయలతో నిర్మించనున్న బ్రాహ్మణ వెల్లేముల గ్రామపంచాయతీ భవనం దక్షిణ భారతదేశంలోనే ఆదర్శంగా ఉండేలా కట్టనున్నామని వెల్లడించారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో చింతపల్లి, నందిపాడు 2 బ్రిడ్జిలను హామ్ విధానంలో చేపట్టనున్నామని, పది రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడ-హైదరాబాద్ మధ్య గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ని కూడా నల్గొండ మధ్యలో పోయే విధంగా మంత్రి నితిన్ గడ్కరీతో చర్చిస్తామన్నారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : మండలాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్‌లను సవాల్‌గా తీసుకొని సందర్శించాలని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు, ఇతర ప్రాధామ్య పథకాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అందువల్ల మండలాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పథకాలు వేగవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తమండల ప్రత్యేక అధికారులు వారి మండలంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు మోడల్ పాఠశాలలను సందర్శించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు. కాగా ఈ సోమవారం 99 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు సంబంధించిన 43, రెవెన్యూ శాఖకు సంబంధించి 56 పిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్లు జే.శ్రీనివాస్, నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, డిఆర్డిఓ నాగిరెడ్డి, ఆర్డీవోలు వై.అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు హాజరై ఫిర్యాదులను స్వీకరించారు.

ఆపరేషన్ ముస్కాన్-11 విజయవంతం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: కమీషనరేట్ పరిధిలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకోసం ఆపరేషన్ ముస్కాన్-11 విజయవంతమైందని,లో 193 మంది బాలలకు విముక్తి చేశామని రామగుండం పోలీసు కమీషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం జూలై 1 నుండి 31 వరకు ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమాన్ని కమీషనరేట్ వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో బాలురు-52, బాలికలు-19 మొత్తం మంది 71మందిని గుర్తించామని,అందులో 08 మంది బాలకార్మికులని పాఠశాలలో చేర్పించడం జరిగినదన్నారు. మంచిర్యాల జిల్లా పరిధిలో 84 మంది బాలురు, 38 మంది బాలికలు మొత్తం మంది 122 మందిని గుర్తించామని అందులో 13 మంది బాలకార్మికులని పాఠశాలలో చేర్పించడం జరిగిందని తెలిపారు. వీరితో పనిచేయించుకుంటున్న యజమానులపై కేసులు నమోదు చేశామని అన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ జాతీయస్థాయిలో మంచి స్థానంలో నిలవడంలో ఫ్రంట్ లైన్ వర్కర్స్ కృషి గర్వించదగ్గదని అన్నారు. గవర్నర్ చేతుల మీదుగా కాంస్య పతకాన్ని స్వీకరించినందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లను జిల్లా అధికారుల సంఘం తరపున సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాకు చెందిన వైద్య, ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఉద్యోగి జొన్న వినోద్ కుమార్ దంపతులు మరణానంతరం వారి దేహాలను నిర్మల్ వైద్య కళాశాలకు విద్యార్థుల శిక్షణ కొరకు దానం చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో అవయవ దానానికి ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చర్ల : మండలంలోని సి కత్తిగూడెంలో ఈ నెల 9 న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసి సంఘాల జేఏసీ చైర్మన్ పాలెం సత్యనారాయణ కోరారు. సోమవారం ఇక్కడ సుమేవేశామైన ఆదివాసులతో గోండ్వానా సంక్షేమ పరిషత్తు నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక బడ్జెట్ నిధులు కేటాయించాలని కోరారు. ఆగస్టు 9న ఆదివాసి ఉద్యోగస్తులకు ఆప్షనల్ హాలిడే ప్రకటించాలన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసి హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాల అమలకు కృషి చేయాలని ఈ సందర్భంగా పాయం డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసి విద్యార్థి రాష్ట్ర కన్వీనర్ ఇర్ప ప్రకాష్ దొర, చర్ల మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ పూనేం వరప్రసాద్, నాయకులు ఇర్ప అరుణ్ కుమార్, ఇర్ప తులసమ్మ, కొమరం నాగేశ్వరరావు, గ్రామ యువకులు పెద్దలు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు అభినందనలు

విశాలాంధ్ర - కొమరం భీం : ఆదివాసి, గిరిజనుల సంక్షేమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాను అత్యున్నత స్థానంలో నిలిపినందున జిల్లా కలెక్టర్ వెంకటేష్, దోత్రేను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్‌రావులు శాలువాలతో సత్కరించి అభినందన లు తెలిపారు. ఈ నెల 2వ తేదీన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో గల రాజ్‌భవన్‌లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినందున గవర్నర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ పురస్కారం తీసుకున్న సందర్భంగా కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల పర్యవేక్షకులు, సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపి శాలువాలతో సన్మానించారు.

యువత స్వయంకృషితో ఎదగాలి : సీఐ

విశాలాంధ్ర - కారేపల్లి : యువత స్వయం కృషితో ఎదగాలని సింగరేణి సిఐ బి. తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం సింగరేణి మండల కేంద్రంలోని తహసిల్దార్ ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఆదివాసి గిరిజన యువకుడు కుంజా కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డెక్కన్ చాయ్ స్టాల్ ను సిఐ తిరుపతిరెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువతీ యువకులు చదివిన చదువులకు ప్రభుత్వ ఉద్యోగాలు రావడం లేదని నిరాశకు గురికాకుండా బయట ప్రపంచంలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించి ఉపాధి అవకాలను చూసుకోవాలన్నారు. పురోహితుడు కొండపల్లి శ్రీనివాస శర్మ ప్రత్యేక ప్రారంభోత్సవ పూజలు చేశారు. చీమల మహేందర్, పులసం భద్రం, కుంజా వెంకటేశ్వర్లు, కుంజా భరత్,ఈసం ఫణిందర్, చీమల శైలు, కుంజా మానస, మోకాళ్ళ సతీష్, ముక్తి కోటేష్, ఈసాల ఛాయాదేవి, ఈసాల వెంకటేశ్వర్లు, పొదేం రామూర్తి, బొర్రా స్వామి, పొడుగు హరీష్, దుస్సా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఐదు రోజులు ప్రత్యేక శానిటేషన్ డ్రైడే

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: మెదక్ జిల్లాలో మంగళవారం నుండి ఐదు రోజులపాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల ద్వారా డ్రై డే పటిష్టంగా అమలు కావాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్ కార్యాలయ అధికారులు సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధి నిర్వహణలో జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని, అన్ని శాఖల అధికారులు సిబ్బంది మూమెంట్ రిజిస్టర్ తప్పనిసరిగా మెయింటైన్ చేయాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలనపై నిఘా ఉంచాలన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల చేపట్టి డ్రై డేలో ఇంటింటికి పంచాయతీ సెక్రెటరీ, ఆశ, ఏఎన్ఎం, హెల్త్ డిపార్ట్మెంట్ సమన్వయంతో నీరు నిల్వ ఉండకుండా చూడటం, ఆదిలోనే సీజనల్ జ్వరాలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవడం వల్ల దోమల లార్వాలను నిర్మూలించి సీజనల్ వ్యాధుల నుండి ప్రజలను రక్షించేందుకు వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, కలెక్టరేట్ ఏవో యూనస్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి కలెక్టర్ రాహుల్ రాజ్ వినతులు స్వీకరించారు. వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు తదితరులున్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన పర్వీన్ తన భర్త కుద్బోద్దీన్ కు ఇటీవలే ప్రమాదం జరిగి కాలు తీసివేయడం జరిగిందని, తమకు కుటుంబ పోషణ కష్టంగా ఉందని, సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల (మహిళలు) లో వాచ్మెన్ ఖాళీగా ఉందని అట్టి అవుట్‌సోర్సింగ్ నౌకరి తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. నంది మేడారం గోపాల్ రావు పేట గ్రామాలకు చెందిన రైతులు గోలివాడ నుండి గోపాలరావు పేట వరకు ఉన్న రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయని, వాటిని పూర్తి చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ధర్మారం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో నూతన బ్లడ్ బ్యాంక్ ప్రారంభం...

విశాలాంధ్ర - పినపాక : పినపాక నియోజకవర్గం మణుగూరులోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. సోమవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ రిబ్బన్ కట్ చేసి ప్రారభించారు. బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. రక్త నిల్వ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ స్వయంగా రక్తదానం చేసి ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం అంటే ప్రాణదానం ఇలాంటిదన్నారు. మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ఇతరులకు జీవం పోసే వరంగా మారుతుందని చెప్పారు. గర్భిణీలు, తలసీమియా, సికిల్ సెల్, అనీమియా వంటి వ్యాధులతో బాధపడేవారి తోపాటు ప్రమాదాల వల్ల గాయపడిన వారు రక్తానికి ముఖ్యంగా ఆధారపడుతారన్నారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన స్ఫూర్తితో డి సి హెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సునీల్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 20 మంది వరకు రక్తదానం చేశారు. స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - ఇల్లందు: మండల పరిధిలోని బోజ్జాయి గూడెం వద్ద 45.256 కేజీల నిషేధిత గంజాయిని ఇల్లందు పోలీసులు సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. ఈ మేరకు ఇల్లందు డిఎస్పి చంద్రభాను వివరాలను వెల్లడించారు. ఇల్లందు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తన సిబ్బందితో కలిసి బొజ్జాయిగూడెం పంచాయతీ ఆఫీస్ దగ్గర నమ్మదగిన సమాచారం పై వాహనాలు తనిఖీ చేసారు. కొత్తగూడెం వైపు నుండి ఇల్లందు వైపుకు మహీంద్రా ఎక్స్ యు వి 300 కారు (నెంబర్ TS12 EK 3236) వెళ్తుండగా ఆపి దానిలో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కారులోపల తనిఖీ చేయగ గంజాయి గుర్తించినట్లు చెప్పారు. పట్టుబడ్డ గంజాయిని మహారాష్ట్రకు చెందిన హరిబాబు అలియాస్ హరిఓం ఆదేశాల మేరకు ఒడిస్సా, అలూరికోటకు చెందినా రాము, తాతారావు వద్ద నుండి మహారాష్ట్ర కు చెందిన మహాకాల్, జాల్నా తీసుకున్నారని డిఎస్పీ తెలిపారు. ఈ గంజాయిని మహారాష్ట్ర రాష్ట్రం కు భద్రాచలం - ఇల్లందు మీదగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. దీని విలువ రూ.22,62,800 ఉంటుందన్నారు. కారుతోపాటు మూడు ఫోన్లు, నిందితులను స్వాదినపరచుకోని సీఐ తాటిపాముల సురేష్ కు అప్పజెప్పడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి ముగ్గురు ముద్దాయిలను రిమాండ్ కు తరలించామన్నారు. అరెస్ట్ చేసిన ముద్దాయిలు మహబూబాబాద్ జిల్లాకు చెందిన తేజావత్ శంకర్, తేజావత్ జంకు, ఆంగోత్ సంతు ఉన్నట్లు చెప్పారు.

భద్రాచలం సబ్ కలెక్టర్‌గా మృణాల్ శ్రేష్ట బాధ్యతల స్వీకరణ



విశాలాంధ్ - భద్రాచలం : భద్రాచలం సబ్ కలెక్టర్‌గా మృణాల్ శ్రేష్ట బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ ప్రాంగణంలోని హౌసింగ్ గెస్ట్ హౌస్ లో సోమవారం భద్రాచలం ఆర్డీవో కార్యాలయం సిబ్బంది ఆయనను స్వాగతం పలికారు. అనంతరం భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు నుండి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. సబ్ కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న మ్రీణాల్ శ్రేష్టను దామోదర్ రావు, తాసిల్దార్ ఆయనను సన్మానించారు. సబ్ కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ బీహార్ రాష్ట్రానికి చెందిన తాను శిక్షణ కలెక్టర్గా ఖమ్మం జిల్లాలో పనిచేసిన అనుభవం ఉన్నదన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధిలోని మండలాలలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏ సమస్యనైనా తన వంతుగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది తనకు సహాయ సహకారాలు అందించి, కార్యాలయానికి వచ్చే గిరిజనుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా ఐకమత్యంగా పనిచేద్దామ న్నారు. తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, వీఆర్వో రామ్ నాయక్ పాల్గొన్నారు.

ఒక దివ్యాంగురాలు మరో దివ్యాంగునికి సైకిల్ దానం

విశాలాంధ్ర - ఇల్లందు : ఒక వికలాంగురాలు తన వద్ద ఉన్న బ్యాటరీ సైకిల్ ని మరో వికలాంగుడికి ఇచ్చి తన ఔదార్యాన్ని చాటుకుంది. వివరాల్లోకి వెళితే..21 ఫీట్ ఏరియాకి చెందిన గాదె జ్యోతి తన బ్యాటరీ సైకిల్ దాన్ని మరో వికలాంగుడికి ఒక ఉపయోగపడాలన్న ఉద్దేశంతో వికలాంగ సంఘ అధ్యక్షుడు ముజాహిద్ అలియాస్ సాజన్ కి తెలియజేయగా దానికి కొన్ని మరమ్మతులు చేయించిన ఆయన రాజేష్ అనే వికలాంగుడికి అందించారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉండి మన ఇంట్లో ఉండాల్సిన వస్తువుల కంటే అదనంగా ఉన్న వాటిని ఇతరులకు దానం చేయాలన్న సంకల్పం రావాని జ్యోతి అంటున్నారు. ఆమె దత్రుత్వానికి పలువురు ప్రశంసిస్తున్నారు.

పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ యాన్యువల్ ఇన్స్పెక్షన్



విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లొ యాన్యువల్ ఇన్స్పెక్షన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. హెడ్ క్వార్టర్స్‌కు చేరుకున్న ఎస్పీ ఆర్మడ్ రిజర్వు పోలీసుల చేత గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం అక్కడ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది కి చెందిన ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. తరువాత అడ్మిన్ ఆర్ఐ కార్యాలయం, మోటార్ ట్రాన్స్పోర్ట్ కార్యాలయం, వెల్ఫేర్ కార్యాలయం తోపాటు ఆర్ఐ హెూంగార్డ్స్ ఆఫీసులలో రికార్డులను తనిఖీ చేశారు. బాంబు డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలను పరిశీలించి ఇంచార్జ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది చాలా క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. శారీరిక మానసిక ద్రోగత్వానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎం టీ ఓ సుధాకర్, ఆర్ఐ లు నరసింహారావు, లాల్ బాబు, కృష్ణారావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమా సొమ్ము, రూ. 10 లక్షల చెక్కు అందజేత

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రమాదవశాత్తు మరణించిన మల్టీపర్పస్ వర్కర్‌కు సంబంధించిన భీమా సొమ్ము 10 లక్షల రూపాయల చెక్కును నామినీకి ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అందజేశారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో మల్టీపర్పస్ వర్కర్ వీరస్వామి నామినికు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి పది లక్షల రూపాయల భీమా చెక్కు అందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో మల్టీ పర్పస్ వర్కర్లుగా పనిచేస్తున్న 2087 మంది కార్మికులకు పోస్టల్‌శాఖ ద్వారా ప్రమాద భీమా చేయించడం జరిగిందని, ఏప్రిల్‌లో ప్రమాదవశాత్తు మరణించిన మల్టీపర్పస్ వర్కర్ వీరస్వామి నామినీ జి. జమలమ్మకు నేడు ప్రమాద భీమా సొమ్ము రూ.10 లక్షలు అందిస్తున్నామన్నారు.

సంపాదకీయం

రాష్ట్రపతితో మోదీ, షా భేటీల లోగుట్టు!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. అయితే వీరు రాష్ట్రపతిని విడివిడిగా కలుసుకున్నారు. సాధారణంగా విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తరవాత ప్రధానమంత్రి రాష్ట్రపతిని కలుసుకుని ఆ పర్యటనల విశేషాలు నివేదించడం ఆనవాయితీ. లేదా మరే ప్రత్యేక అంశాన్ని అయినా రాష్ట్రపతి దృష్టికి తీసుకు రావాలనుకున్నప్పుడు కూడా ప్రధాన మంత్రి రాష్ట్రపతిని కలుసుకుంటారు. అలాంటి సమయంలోనూ ప్రధాని ఒక్కరే వెళ్తారు. విదేశీ పర్యటనలు, దేశంలోని పరిస్థితులను, లేకపోతే ప్రభుత్వం తీసుకున్న లేదా తీసుకోవాలనుకుంటున్న చర్యలని రాష్ట్రపతికి నివేదించవలసిన అవసరం ఉదని అనుకున్నప్పుడూ ప్రధానమంత్రి రాష్ట్రపతిని కలుసుకుంటారు. ఈ ఆనవాయితీని మోదీ సంపూర్ణంగా పాటిస్తున్న దాఖలాలు లేవు. ప్రధాని, కేంద్ర హోం మంత్రి వేర్వేరుగా రాష్ట్రపతిని కలుసుకోవడానికి కారణం ఏమిటన్న చర్చ జరుగుతోంది. ఈ అంశాన్ని లోతుగా విశ్లేషించాల్సిందే. ఇటీవలి రాజకీయ పరిణామాలను చూస్తే ఈ విశ్లేషణ అవసరం మరింత పెరుగుతుంది. గత వారం ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటులో విస్తృతమైన చర్చ జరిగింది. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారు. తరవాత ప్రధానమంత్రి మోదీ ఈ చర్చకు లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. ఆయన జవాబిచ్చిన తీరు చూస్తే ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం మీది కన్నా ప్రతిపక్షాలను తూర్పారపట్టడానికే ఆయన ఎక్కువ సమయం కేటాయించారు. ఆపరేషన్ సిందూర్ అంశంపై రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జై శంకర్ కూడా చర్చలో పాల్గొన్నారు. వారి ప్రసంగాల్లోనూ ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు సంపూర్ణంగా లేవు. రాజ్యసభలో జరిగిన చర్చకు ప్రధాన మంత్రి సమాధానం ఇవ్వలేదు. ఆ పని అమిత్ షా చేశారు. లోక్‌సభలో మోదీ అనుసరించిన పద్ధతినే అమిత్ షా రాజ్యసభలో కొనసాగించారు. ఇటీవల మరికొన్ని ముఖ్యమైన పరిణామాలూ జరిగాయి. శనివారం ఆర్‌ఎస్‌ఎస్. అగ్రనాయకుల సమావేశం జరిగింది. సహజంగానే అందులో ఏం చర్చించారో బయటకు పొక్కలేదు. గురువారం ప్రతిపక్ష ఐక్య సంఘటన "ఇండియా" సమావేశం జరగనుంది. 11 వ తేదీన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ "ఇండియా" నేతలకు విందు చేస్తారట. వచ్చే వారం బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం జరగనుంది. పార్లమెంటు సమావేశాలు వచ్చే 12 వ తేదీ దాకా జరుగుతాయి. ఈ పరిణామాలన్నింటికీ రాజకీయ ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని, హోం మంత్రి విడివిడిగా రాష్ట్రపతిని కలుసుకోవడానికి ఉన్న ప్రాధాన్యత ఏమిటి అన్న చర్చ జరగక తప్పదు. కేంద్ర హోం మంత్రి రాష్ట్రపతితో భేటీ కావడం అంత తరచుగా జరిగే వ్యవహారం ఏమీ కాదు. పైగా రాష్ట్రపతి ఎదుట అమిత్ షా చాలా ఒద్దికగా కూర్చున్న తీరు చూస్తే ఇది అసహజమైన వినయంగా కనిపించకమానదు. రాష్ట్రపతితో అగ్రనాయకులిద్దరి భేటీ చూస్తే పెద్ద పరిణామాలేవో జరగబోతున్నాయన్న అనుమానమూ ఉంది. ప్రధానమంత్రి రాష్ట్రపతిని గతంలో కలుసుకున్నా ఆ విషయం గురించి కూడా పెద్దగా సమాచారం ఏమీలేదు. ఇప్పుడు అమిత్ షా కూడా రాష్ట్రపతి భవన్‌కు వెళ్లడంతో ఊహాగానాలు చెలరేగుతున్నాయి. పహల్గాంలో అంతటి ఘోరం జరిగిన తరవాత, లేదా ఆ సమయంలో సౌదీ అరేబియాలో ఉన్న మోదీ తిరిగి వచ్చిన తరవాత, ఆపరేషన్ సిందూర్‌కు ముందు కానీ, తరవాత కానీ మోదీ రాష్ట్రపతిని కలుసుకుని పరిస్థితిని వివరించిన వార్తలేవీ రాలేదు. అన్నిటికన్నా మించి కేంద్ర హోం మంత్రి వెళ్లి రాష్ట్రపతితో ముచ్చటించిన సందర్భాలూ కనిపించవు. ప్రధాని, హోంమంత్రి కలిసి రాష్ట్రపతిని కలుసుకున్న ఉదంతాలూ దాదాపు లేవు. అధికార మర్యాదల ప్రకారం విడివిడిగానే రాష్ట్రపతిని కలుసుకోవడం సమంజసమే.

పార్లమెంట్ సమావేశాల మధ్యలో ప్రధాని, హోం మంత్రి రాష్ట్రపతిని ఎందుకు కలుసుకోవాల్సి వచ్చిందన్న సంశయమూ కలగకమానదు. ఇద్దరు అగ్రనాయకులు వేర్వేరు సమయాల్లో రాష్ట్రపతిని కలుసుకోవడం అంటే ఏదో విశేషం ఉండే ఉంటుంది. అమిత్ షా రాష్ట్రపతిని ఎందుకు కలుసుకున్నారు అన్న ప్రశ్నతో పాటు అగ్రనాయకులిద్దరి ఎజెండాలు ఒకటిగానే ఉండాలిగా అన్న భావనా కల్గుతుంది. పార్లమెంటులో రోజూ ఏదో ఓ రచ్చ జరుగుతూనే ఉంది. వాయిదాల మీద వాయిదాలు కొనసాగుతున్నాయి. బీహార్‌లో ఓటర్ల జాబితా తయారీ మీద కూడా అనేక వివాదాలున్నాయి. కానీ ఈ విషయాలలో రాష్ట్రపతి జోక్యం ఉంటుందనుకోలేం. కానీ అనేక కీలక విషయాలు చర్చలో ఉన్నాయి కనక మొత్తం పరిస్థితిని రాష్ట్రపతికి వివరిస్తే బాగుంటుందని ప్రధాని భావిస్తే అందులో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. అనేక అంశాలపై ప్రభుత్వం భవిష్యత్తులో తీసుకోబోయే చర్యల గురించి ప్రధాని రాష్ట్రపతికి వివరించి ఉండవచ్చు. మోదీ ప్రభుత్వం అనేక సమస్యలతో సతమతమవుతున్న మాట మాత్రం వాస్తవం. మరో రకంగా ఆలోచిస్తే ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల కమిషన్ నడవడిక గురించి మంగళవారం "అణుబాంబు"లాంటి సమాచారమేదో బయట పెడ్తానంటున్నారు. ఒక వేళ అలాంటిది ఏమైనా జరిగినా అది ప్రభుత్వాన్ని ఇబ్బందిలో పడవేసినా దానిని ప్రభుత్వాధినేతలు రాజకీయంగా ఎదుర్కోవాల్సిందే తప్ప రాష్ట్రపతి పాత్ర ఉండే అవకాశమే లేదు. రాహుల్ లేవనెత్తుతున్న అంశం రాజ్యాంగ సంబంధమైందే. ఎందుకంటే రాజ్యాంగబద్ధ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్‌పై రాహుల్ గురిపెట్టారు. రాహుల్, ఇతర ప్రతిపక్ష నాయకులు, రాజ్యవ్యవస్థ గురించి అపారమైన జ్ఞానం ఉన్నవారు ఎన్నికల కమిషన్ వ్యవహార ధోరణిని ఎండగడ్తూనే ఉన్నారు. గత చరిత్రలోకి వెళ్లి చూస్తే 1975 లో ఇందిరా గాంధీ నాయకత్వంలోని అప్పటి ప్రభుత్వం ఎదుర్కొన్న సంకట స్థితే ఇప్పుడు మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎదుర్కుంటోందనిపిస్తోంది. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే రాజకీయ పక్షాల పాత్రలు తారుమారయ్యాయి. అప్పుడు ఇందిరా గాంధీ మీద దాడి చేసిన పక్షాల్లో ఇప్పటి బీజేపీకి పూర్వ రూపమైన జనసంఘ్ పాత్ర పెద్దదే. ఇప్పుడు మోదీ ప్రభుత్వాన్ని ఇరుకున పెడ్తున్నది అప్పుడు సంకటస్థితిలో ఉన్న కాంగ్రెస్. ప్రధానమంత్రి తరచుగా రాష్ట్రపతిని కలుసుకుంటూ ఉండి ఉంటే ఊహాగానాలకు తావుండేదే కాదు. నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ ప్రధానులుగా ఉన్నప్పుడు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నారు. ఆయన ఒక మాట చెప్పారు. నెహ్రూ ఉన్నప్పుడు దేశ కాల పరిస్థితులు నాకు 75 శాతం తెలియపరిచే వారు. శాస్త్రి సమయంలో అది 50 శాతానికి తగ్గింది. ఇందిరా గాంధీ సమయంలో 25 శాతానికి తగ్గింది అని అన్నారు. మోదీ హయాంలో పరిస్థితిని ఎంత నామమాత్రంగా ప్రధానికి వివరిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందుకని కూడా ఈ భేటీలు చర్చనీయాంశం అయినాయి. అప్పుడైనా అమిత్ షా ఎందుకు వెళ్లారన్న ప్రశ్న మిగిలే ఉంటుంది.

నోట్లు కోట్లు ఓట్లు

చింతపట్ల సుదర్శన్

మద్యం మరీ ఎక్కువై కుడివైపు పడాలో, ఎడమవైపు కూలబడాలో తెలీకుండా ఊగిసలాడ్తున్న మనిషిలా గ్రవుండులో కొబ్బరిచెట్టు ఊగుతున్నది. మద్యం మరి కాస్త ఎక్కువై సూర్యుడు మబ్బుల్లోకి పోతూ, బయటకి వస్తుండడంతో అప్పుడే ఎండ పెళ్లు మంటున్నది. మరి కాస్సేపటికి పట్టపగలైనా చీకటి పడుతున్నది. మధ్యాహ్నం కావడం వల్ల ఇళ్లల్లో జనం కునుకేస్తుండటం వల్ల ఇళ్లన్నీ మత్తుగా పడుకున్నవి.

అరుగు మీద ఓ పక్కన డాగీ మరో పక్కన డాంకీ కడుపులో బరువు పడ్డం వల్ల ఆయాసం తగ్గడానికి నిద్రపోతున్నవి. ఉన్నట్టుండి ఏదో చప్పుడు వినపడి చెవులు రిక్కించింది డాంకీ. నిజంగానే ఏదో చప్పుడు వినపడ్తున్నది కూలిన కొంప లోపలి వైపు నుంచి. ఈ టైంలో ఈ దిక్కుమాలిన కొంపలో జొరబడిందెవరా అని విస్తుపోయింది డాంకీ. ఏ బైరాగోడో, పట్టపగలే దొంగ చాటుగా మందు కొట్టే బేవార్సు లమిడి కొడుకో లోపల జొరబడి ఉంటాడు. పోన్లే మనకెందుకు వాడి మందు వాడే తాగి చస్తాడు అనుకున్న డాంకీ కళ్లు మూసుకుంది. లోపల దూరిన మనిషి సీసామూత విప్పాడో లేదో అల్లాఉద్దీన్ ల్యాంపులోంచి బయటపడ్డ జిన్ భూతంలా మందు

రంగస్థలం

బయటకు తుళ్లిపడిందో లేదో గాలి ఉలిక్కిపడేట్టు వాసన గుప్పుమంది.

ఈసారి ముక్కుకి వాసన కొట్టి ఉక్కిరి బిక్కిరై లేచింది డాగీ. నిద్ర లేచిన డాగీ లేచి నాలుక్కాళ్ల మీద నిలబడింది. నిలబడి మూతి ముందుకు చాచి మైకు ఉంది ఉపన్యాసం ఇవ్వడానికి గొంతు సవరించుకునే నాయకుడిలా గుర్రుగుర్రుమంది. నాయకుడైతే ఏదో ఓ భాషలో మొరుగుతాడు. డాగీ అయితే భౌ భాషలో మొరుగుతుంది అంతేకదా అనుకున్న డాంకీ కళ్లు తెరిచి, డాగీ కొంప లోపలికి దూరి మందేస్తున్న మనిషిని తరిమేస్తుందనుకున్న డాంకీ, ఎందుకు లేచావోయ్. లోపలి వాసనకు ముక్కు పట్టేసిందా. పోనీలే. ఎక్కడా చోటులేక వచ్చినట్టున్నాడు, మందేసే మనిషి. వాడి పేగు వాడే కాల్చుకుంటాడు, వాడి లివర్‌ని వాడే 'ఫ్రై' చేసుకుంటాడు, వాడి కిడ్నీతో వాడే గోటీ ఆడుకుంటాడు. నీకెందుకు చెప్పు అంది.

నో! ఈ అరాచకాన్ని నేను సహించలేను. మందు వాసన భరించలేను, అని ముందుకు కదిలింది డాగీ. అప్పుడెక్కాడు అబ్బాయి అరుగు. ఏమిటీ హడావిడి? లోపల ఎవరన్నా ఉన్నారా? ముక్కు పగిలి పోతున్నది అంటూ లోపలికి తొంగి చూశాడు. అబ్బాయిని చూసి, కోటర్‌లో లాస్టు డ్రాప్స్ కోసం నాలుకతో తంటాలు పడుతున్న మనిషి గతుక్కుమన్నాడు. ఓహో ఇదా విషయం. భయ్యా! ఏమి మందు అది? బ్రాండెడేనా? అయినా హోలోగ్రామ్ కరెక్టుగా ఉందా. సీలు ఊడి ఉందా? ఊడదీశావా? అసలది నిజంగా మందేనా? మందు రూపంలో ఉన్న కాలకూట విషమా? అని అబ్బాయి ప్రశ్నల వర్షం కురిపించేసరికి ఆ మనిషి 'మద్య' దరా సముద్రంలో 'సారా ఖాతం' వచ్చినట్లు బెంబేలుపడి, దభేలుపడి, గోడకు అడ్డంపడి ఆ పైన అవతలివైపు పడి, పోయాడెక్కడికో.

ఇక అరిచే పనేమీ లేదని కూలబడింది డాగీ. కొవ్వొత్తిలా తను కాలిపోతూ కరిగిపోతూ ప్రభుత్వాన్ని నిలబెట్టే మనిషిని తాగుబోతని ఛీ కొట్టడం న్యాయం కాదు. అసలు ప్రజాస్వామ్యాన్ని, తను చస్తూ బతికించే వాడు కదా. వాడి మీద అరవడానికి తయారయ్యావా? అన్నాడు అబ్బాయి. ఇప్పుడు పత్రికలన్నీ మద్యం వాసనేస్తున్నాయి సారీ మద్యం స్కాము గురించే రాస్తున్నాయి. ఏమిటో డెన్నులంటున్నారు. వాటి నిండా కోట్ల రూపాయల కట్టలంటున్నారు. నాకెక్కడా కనిపించలేదు. ఓ కోటి కట్టన్నా నమిలేసి 'రిచ్చు డాంకీ' ననిపించుకుని ఉందును అంది డాంకీ. అలాగనిపించుకుంటూ చార్టర్డు విమానాల్లో తిరిగే వాళ్లున్నారులే డాంకీ నీకెందుకు? జనం ప్రాణాలు తీసే కల్తీ మందుకు కట్టలు గావచ్చిన కరెన్సీ పాపపు కూడు అన్నాడు అబ్బాయి. అవునవును ఆ కట్టలు ఎలెక్షన్లలో ఓట్లు కొండానికే కాని గాడిదలు నవలడానికి పనికిరావులే అంది డాంకీ. అసలీ స్కాము లేమిటన్నా అనడిగింది డాగీ అమాయకంగా. అధికారంలో ఉంటే స్కాములు చేయవచ్చు. స్కాములు చేస్తే అధికారంలోకి రావచ్చు అని నమ్మే రాజకీయ నాయకులు అక్రమంగా డబ్బు సంపాదించడానికి చేసే అడ్డదిడ్డమైన పనులన్నీ స్కాములే అన్నాడు అబ్బాయి. గొర్రెల స్కాములు, అవి మేసే గడ్డి స్కాములు, లిక్కర్ స్కాములు అనేక రకాల స్కాములుంటయి. నదులన్నీ సముద్రంలో కల్సినట్టు స్కాములన్నీ 'పవరు సముద్రం' లో కలిపేస్తే సరి కనపడకుండా పోతయి అన్నది డాంకీ.

తాగినోడు పత్తా లేకుండా పోయేడు కానీ వాసన ఇంకా ముక్కును పీడిస్తూనే ఉంది అంది డాగి ముక్కు ఎగరేస్తూ. అసలీ కల్తీ లేకుంటే బాగుండు అంది డాంకీ. కల్తీ మందేసినోడే మరి ఓట్లు వేస్తాడు. అటు నోట్లూ ఇటు ఓట్లూ కలిసి వస్తయి కదా అన్నాడు అబ్బాయి. అసలు మందన్నదే లేకుండా చేస్తే అంది డాగీ ముక్కు గోడకు రాసుకుంటూ. ఇదీ పాయింటేస్మీ అంది డాంకీ. అప్పుడు ఇక ప్రభుత్వాలుండవు, ప్రజాస్వామ్యముండదు. ఎలెక్షన్లూ ఓట్లే కాదు ప్రభుత్వాలు చేసే అప్పులకు వడ్డీకట్టే దిక్కూ ఉండదు అన్నాడబ్బాయి అరుగు దిగుతూ.

శ్రామిక విప్లవయోధ ఎంగెల్స్

డీవీవీఎస్ వర్మ

ఫ్రెడరిక్ ఎంగెల్స్ కేవలం మార్క్స్‌కు సహచరుడు మాత్రమే కాదు, ఆయన చేసిన అనేక రచనలకు భాగస్వామి. అంతకు మించి ఎంగెల్స్ తన స్వీయ రచనలతో మార్క్సిజాన్ని పరిపుష్టం చేసినవాడు. లెనిన్ మాటలలో ఎంగెల్స్ శ్రామికవర్గ పోరాట యోధుడు, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు. 1820 నవంబరు 28న నాటి జర్మనీలోని ప్రష్యా రాష్ట్రంలో బార్మెన్ పట్టణంలో జన్మించిన ఎంగెల్స్ 1895 ఆగస్టు 5 న లండన్ లో మరణించాడు. మంగళవారం ఎంగెల్స్ 230 వర్ధంతి జరుపుకుంటున్నాం. సంక్షోభంలో కూరుకుపోయిన ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకోడానికి, ప్రత్యామ్నాయాలను అన్వేషించడానికి తగిన మార్గాలు మార్క్స్- ఎంగెల్స్ రచనలలోనే ఉన్నాయని చివరకు ఉదారవాద ఆర్థికవేత్తలు కూడా ప్రకటించాల్సి వచ్చింది. ఈ వ్యవస్థను మార్చాలన్న భావనలకు, ఉద్యమాలకు మార్క్సిజంలోని చారిత్రిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో కొన్నింటికి పునాదినీ, మరికొన్నింటికి పరిపుష్టినీ కల్పించిన ఎంగెల్స్ రచనలు, సాగించిన విప్లవ కార్యకలాపాలు మరోమారు ప్రపంచాన్ని నిస్సందేహంగా ప్రభావితం చేస్తాయి.

మార్క్స్ గురించి ఎంగెల్స్ "కొన్ని ప్రత్యేక రంగాలలో నేను చేసిన కృషిని మినహాయిస్తే ఇతర రచనలలో నేను సమకూర్చిన అంశాలను నేను లేకపోయినా మార్క్స్ తనంతటతానే చేయగలిగేవాడు. కానీ మార్క్స్ సాధించిన అంశాలను నేనుగా అందుకోలేకపోయి వుండేవాడిని. ఆయన మా కంటే చాలా ఎత్తులో ఉన్నందున చాలా దూరంగా వున్న వాటిని కూడా చూడగలగడమే కాదు. మరింత సమగ్రంగా అత్యంత శీఘ్రంగా వాటిపై అభిప్రాయాలను చెప్పగలిగేవాడు. మార్క్స్ గొప్ప మేధావి. మేము మహా అయితే ప్రావీణ్యం గల వ్యక్తులం మాత్రమే. ఆయనే ఉండి ఉండకపోతే ఈ సిద్ధాంతం ప్రస్తుత స్థితికి ఎంతో దూరంలో వుండివుండేది" అందుచేత మార్క్స్ పేరుతో ఈ సిద్ధాంతం ఉండడమే సరైంది" అని చెప్పిన ఈ మాటలు ఆయన నమ్రతను సూచిస్తాయే కాని

అవి పూర్తి సత్యాలు కావు. ఎందుకంటే ఎంగెల్స్ చేసిన కృషి కేవలం "కొన్ని రంగాలకు" మాత్రమే పరిమితమైంది కాదు. మార్క్స్‌తో భాగస్వామ్యం వహించి చేసిన సిద్ధాంతపరమైన రచనలు ఏక పక్షంగా సాగినవి కావు. అవి వారి ఆదాన ప్రదానాలు.

ఎంగెల్స్ జీవిత చిత్రణ చేసిన చాలా మందిలో ఆయనను ఒక వ్యాపారవేత్తగా,మార్క్స్‌కి జీవితకాల మిత్రునిగా, ఆర్థికంగా సహాయపడిన వ్యక్తిగా చూపే



(మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఎంగెల్స్ 130వ వర్ధంతి నేడు సందర్భంగా)

ప్రయత్నాలే కనిపిస్తాయి. అంతకు మించి శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతానికి ఎంగెల్స్ సమకూర్చిన భూమికను అవి తక్కువ చెయ్యడం జరిగింది. ఎంగెల్స్ కేవలం మార్క్స్ నీడతో మెరిసిన చంద్రుడు కాదు. మార్క్స్‌లాగే ఆయన కూడా స్వయంప్రకాశం గలవాడే. ఇది మార్క్స్ తగ్గించి చూపడం ఎంత మాత్రమూ కాదు. వారు సమఉజ్జీలు అయినందునే అది వారి చిరకాల స్నేహానికి, పరస్పర పూరకమైన రచనల భాగస్వామ్యానికి, శాస్త్రీయ దృక్పథాన్ని అనేక రంగాలకు అన్వయించడానికి స్థిరమైన పునాది అయింది. ఎంగెల్స్ చదువు హైస్కూల్ మధ్యలోనే ఆగిపోయింది. స్వయంకృషితోనే అర్థశాస్త్రం, మానవ పరిణామ చరిత్ర అధ్యయనంతో పాటు తత్వశాస్త్రం, సైన్స్, సాహిత్యం, మిలటరీకి సంబంధించిన విషయాలతో పాటు అనేక రంగాలలో మంచి పరిజ్ఞానం పొందారు. ఇంగ్లీషులో ప్రావీణ్యంతో పాటు దాదాపు 20 భాషలు నేర్చుకున్నారు. మార్క్స్, ఎంగెల్స్ మొదటసారి 1842లో కొలోన్‌లో కలుసుకున్నారు. ఈ సమావేశంలో వారు ఒకరిని గురించి మరొకరు ప్రత్యేకంగా తెలుసుకున్నది ఏమీ లేదు. 1844లో పారిస్ నుంచి యంగ్ హెగెలియన్ ఆర్నాల్డ్ రూజ్ ప్రచురిస్తున్న "ది జర్మన్, ఫ్రెంచ్ ఇయర్ బుక్" రూపకల్పనలో భాగస్వామిగా మార్క్స్ అక్కడికి వెళ్లారు. దీనిలో ప్రచురణ కోసం ఎంగెల్స్ రాసిన "అవుట్ లైన్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" వ్యాసం మార్క్స్‌ను విశేషంగా ఆకట్టుకుంది. ఇది ఒక పురోగామి మేధావి రచనగా పేర్కొన్నాడు. జర్మనీ వెళ్లేటప్పుడు తనతో పారిస్‌లో కొన్ని రోజులు ఉండేలా రమ్మని ఎంగెల్స్‌ను కోరాడు. అలా వారిద్దరూ 1844 ఆగస్టులో పారిస్‌లో పది రోజుల పాటు కలిసి వున్నారు. ఈ పది రోజులలో వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

చారిత్రకాభివృద్ధి క్రమంలో బూర్జువా సామాజిక వ్యవస్థ ఒక దశ మాత్రమేనని అది మారి తీరుతుందనీ కార్మికవర్గం ఆ మార్పును సాధించే విప్లవకర వర్గమనీ అదే సోషలిజానికి లేదా కమ్యూనిజానికి మార్గం అని ఉభయులూ భావించారు. ఇవి చర్చల నుంచి వచ్చిన భావసారూప్యత కాదు. అంతకు ముందే ఎవరికి వారుగా వచ్చిన నిర్ధారణలు. పైగా వేర్వేరు మార్గాల ద్వారా పొందినవి. బ్రిటీష్ క్లాసికల్ అర్థశాస్త్రాల, బ్రిటీష్ లేబర్ ఉద్యమాల అధ్యయనం ద్వారా ఎంగెల్స్, మరో పక్క మార్క్స్ ఫ్రెంచ్ విప్లవాన్ని, దాని నుంచి ఉత్పన్నమైన కార్మికవర్గ రాడికలిజం, సోషలిస్టు సమానత్వ భావజాలాల అధ్యయనం నుంచి పై నిర్ధారణలకు చేరుకున్నారు. ఇలా మార్క్స్, ఎంగెల్స్ భిన్న మార్గాలలో ఒకే లక్ష్యానికి చేరుకున్న మేధాసంపన్నులు. ఈ దిగ్గజాల కలయికతో మార్క్సిస్టు సిద్ధాంతం రూపుదిద్దుకోడానికి మూలాధారాలైన బ్రిటీష్ క్లాసికల్ అర్థశాస్త్రం, ఫ్రెంచ్ ఊహాజనిత సోషలిజం, జర్మన్ క్లాసికల్ ఫిలాసఫీలు ఒక్కచోటికి చేరినట్లయింది. ఒకే లక్ష్యం కోసం ఏకమైన ఈ ఇద్దరూ చివరిదాకా అదే బాటలో నడిచారు. ఒకపక్క విప్లవ సిద్ధాంతాలకు పదునుపెట్టడం, మరోపక్క దానిని ఆచరణలో పెట్టగల విప్లవ కార్మికోద్యమాన్ని నిర్మించే పనిలో పూర్తిగా నిమగ్నమయ్యారు.

ఎంగెల్స్ పారిస్‌ను వదిలి వెళ్లే ముందే "ది హోలీ ఫ్యామిలీ ఎ క్రిటిసిజం ఆఫ్ క్రిటికల్ క్రిటిసిజం" పుస్తకంలో తొలి ప్రకరణం రాసి ఇచ్చాడు. మార్క్స్ దానిని పూర్తి చేశారు. తర్వాత 1848లో కమ్యూనిస్టు లీగ్ కోసం ఎంగెల్స్ ముందుగా "కమ్యూనిస్టు సూత్రాలు" పేరుతో, ప్రశ్నలు జవాబుల రూపంలో ముసాయిదాను రాశారు అది మార్క్స్ ఎంగెల్స్ ఉమ్మడి రచనగా నేటికీ ప్రపంచ ప్రసిద్ధమైన 'కమ్యూనిస్టు ప్రణాళిక'కు ప్రాతిపదిక అయింది. మార్క్స్ రచనలలో చాలా వాటికి అర్థవంతమైన ముందు మాటలను ఎంగెల్స్ రాశారు. మార్క్స్ తీరిక దొరకనప్పుడు న్యూయార్క్ ట్రిబ్యునల్‌కు ఆయన పేరుతో ఎంగెల్స్ కొన్ని వ్యాసాలు కూడా రాశారు. అలా విడదీయరాని భావజాల అనుబంధం వారిది. ఎంగెల్స్ స్వీయ రచనలు కూడా చాలా ప్రసిద్ధమైనవి. మార్క్సిజాన్ని అనేక రంగాలకు వర్తింపజేయడం ద్వారా దానిని మరింత సుసంపన్నం చేశాడు. "యాంటీ డ్యూరింగ్" గ్రంథంలో మార్క్సిస్టు తత్వశాస్త్రపు మూల సూత్రాలు విస్పష్టంగా, హేతుబద్ధంగా విపులీకరించాడు. ఆర్థిక సిద్ధాంతానికి శాస్త్రీయమైన పునాదులు వేశాడు. తర్వాత కార్మికుల కోసం ఈ పుస్తకంలోని కొన్ని భాగాలను వేరుచేసి "సోషలిజం ఊహాజనితము-శాస్త్రీయము" అన్న పేరుతో ఎంగెల్స్ ప్రచురించారు. సోషలిజానికి శాస్త్రీయ పునాదిని ఆవిష్కరిస్తూ గతితర్కాన్ని, చారిత్రిక భౌతికవాదాన్నీ విపులీకరించాడు. ఎంగెల్స్ రచనలలో ఈ పుస్తకం ప్రపంచ వ్యాపితంగా అత్యంత ప్రాచుర్యాన్ని పొందింది. ఎంగెల్స్ మరో రచన "ప్రకృతి గతితర్కం". ఇందులో ఆయన తన కాలపు ప్రకృతి విజ్ఞాన శాస్త్రాలు సాధించిన అతి ముఖ్య విజయాలన్నింటికీ తాత్వికపరమైన సాధారణీకరణలు చేశాడు. అలాగే లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ - సంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి" అనే పుస్తకంలో తత్వశాస్త్రపు మౌలిక సమస్య చైతన్యానికీ, అస్తిత్వానికీ, పదార్థానికీ భావానికీ మధ్య ఉన్న సంబంధాలకు సంబంధించినదే అన్న ప్రధానాంశాన్ని ఎంగెల్స్ శాస్త్రీయంగా నిరూపించాడు. జర్మనీలో రైతు యుద్ధం పేరుతో రాసిన పుస్తకంలో కార్మిక వర్గానికి రైతాంగంతో గల విప్లవకర భాగస్వామ్యాన్ని చరిత్ర మూలాల నుంచి ఆవిష్కరించాడు. కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం అన్న పుస్తకంలో చారిత్రకంగా సాగిన సామాజిక అభివృద్ధి క్రమాన్ని విశ్లేషించాడు. వీటికి తోడు మార్క్స్ మరణానంతరం ప్రచురణకు సిద్ధంగాలేని కాపిటల్లోని రెండు, మూడు భాగాలను పరిష్కరించి ప్రచురించి తన చిరకాల మిత్రుని కలను సాకారం చేశాడు. అదే కాలంలో అంతర్జాతీయ కార్మికోద్యమ నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశాడు. మార్క్స్ మరణానంతరం తానే సారథిగా కొత్త సోషలిస్టు ఇంటర్నేషనల్ స్థాపనకు పూనుకున్నాడు. 22దేశాలకు ప్రాతినిధ్యం వహించే 407 మంది ప్రతినిధులతో 1889 జులై 14న పారిస్‌లో మార్క్సిస్టుల మొదటి మహాసభ జరిగింది. "సకల దేశాల కార్మికులారా ఏకంకండి!" అన్న నినాదంతో, ఎనిమిది గంటల పని దినాన్నీ, అంతర్జాతీయ కార్మికవర్గ సంఘీభావాన్ని సాధించుకోవడం కోసం ఏటా మే 1 న ప్రదర్శనలు జరపాలని సూచించింది. 1895 మార్చిలో ఎంగెల్స్‌కు అస్వస్థత తిరగబెట్టింది. 1895 ఆగస్టు 5న రాత్రి పదిన్నర గంటలకి ప్రముఖ పండిత విప్లవకారుడూ, శాస్త్రీయ కమ్యూనిజం మూల పురుషుల్లో ఒకడూ అయిన ఎంగెల్స్ హృదయ స్పందనం శాశ్వతంగా నిలిచిపోయింది. ఎంగెల్స్ 230 వర్ధంతి సభలు వర్తమాన తాత్విక, ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణలతో విప్లవోద్యమాలకు దారిచూపే విధంగా అర్థవంతంగా స్ఫూర్తిదాయకంగా జరుగుతాయని ఆశిద్దాం.

జాతీయ స్ఫూర్తి సంపాదకులు

మోదీ ఆరాటానికి ముందున్నది అసలు పరీక్ష!

ఎం.కోటేశ్వరరావు

అమెరికాతో వాణిజ్య ఒప్పందాల కోసం వెంపర్లాడిన నరేంద్రమోదీ బృందానికి ప్రస్తుతానికి డోనాల్డ్ ట్రంప్ తగిన పాఠమే చెప్పాడు. మన దేశం నుంచి తాము దిగుమతి చేసుకొనే వస్తువులపై 25శాతం పన్నులు, రష్యా నుంచి మనం ముడిచమురు, ఆయుధాలు, ఇతర వస్తువులను దిగుమతి చేసుకొంటున్న కారణంగా అదనంగా జరిమానా విధిస్తున్నట్లు గత బుధవారం ప్రకటించాడు. మన సార్వభౌమత్వాన్నే కించపరిచాడు. పుండు మీద కారం చల్లినట్లుగా పాకిస్థాన్‌తో ఒప్పందం కుదుర్చుకొని అక్కడ నిల్వచేసే చమురును భారత్‌కు అమ్మిస్తానని కూడా చెప్పాడు. ఇది మరీ అవమానం. రష్యా, భారత్ రెండూ మృత ఆర్థిక వ్యవస్థలు, కలసి ఏం చేస్తాయో చేసుకోండి అంటూ ఎద్దేవా చేశాడు. ట్రంప్ ప్రకటించిన మేరకు ఆగస్టు ఒకటి నుంచి మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న వివిధ సరకులపై కనిష్టంగా 25 గరిష్టంగా 193 శాతం పన్నులు విధిస్తామన్నారు. వీటికి జరిమానా అదనం. ఇవి ఇలానే ఉండేట్లయితే ఏ రంగం ఎలా ప్రభావితం అవుతుందో ఆచరణలో తెలుస్తుంది. ఔషధాలు, సెల్‌ఫోన్లు వంటి వాటిని ప్రస్తుతానికి మినహాయించారు. ఇది మన దేశాన్ని బ్లాక్‌మెయిల్ చేసే ఎత్తుగడలో భాగం తప్ప మరొకటి కాదు. జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటామంటూ కేంద్ర ప్రభుత్వం ఒక సాదాసీదా ప్రకటన విడుదల చేసింది. మహా వ్యూహవేత్త అంటున్నారు గనుక మామూలుగానే ప్రధాని నరేంద్రమోదీ, ఇతర మంత్రులు నోరు విప్పలేదు, సమాచార శాఖ(పీఐబీ) ద్వారా మొక్కుబడిగా ఒక ప్రకటన విడుదల చేసింది. పరిస్థితిని అన్ని విధాలుగా మదింపు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అమెరికా చర్యలకు ప్రతిగా చైనా మాదిరి మన ప్రభుత్వం కూడా ప్రతి సుంకాలు విధిస్తుందా లేదా అన్నది ఇంకా స్పష్టం కాలేదు. అమెరికాతో ఇప్పుడున్న 130 బిలియన్ డాలర్ల వాణిజ్య లావాదేవీలను మరో ఐదు సంవత్సరాల్లో 500 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచుతామని రంగుల కలను జనం ముందుంచిన నేతలు ఇప్పుడేం చేస్తారో చూడాల్సి ఉంది. ఈ నెల 25 వరకు భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగుతాయని, తమ ప్రతినిధి వర్గం దిల్లీ సందర్శించనున్నదని అమెరికా అధికారులు చెప్పినదాన్ని బట్టి ఇప్పటికీ మన మీద వత్తిడి తెచ్చే యత్నాలను ట్రంప్ మానుకోలేదని, సుంకాల ప్రకటన బెదిరింపుల్లో భాగమే అని చెప్పవచ్చు. మోదీ లొంగుతారా లేదా అన్నది చూడాల్సి ఉంది. ఇప్పటి వరకు జరిగింది ఒక ఎత్తయితే అసలు అగ్ని పరీక్ష ముందుంది. ఫిబ్రవరి నుంచి జరుగుతున్న చర్చల గురించి రకరకాల లీకుల కథనాలు, ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ రంగంలో పెద్ద మొత్తంలో చైనా పెట్టుబడులను ఆకర్షించేందుకు మన దేశం సానుకూల సంకేతాలను పంపిందంటూ తాజాగా ఒక వార్త. ఇలాంటి పరోక్ష సందేశాలతో చైనాను చూపి అమెరికా నుంచి రాయితీలు రాబట్టుకొనే ఎత్తుగడగా కూడా దీన్ని చెప్పవచ్చు. గతంలో అమెరికాను చూపి సోవియట్, దాన్ని చూపి వాషింగ్టన్‌తో బేరసారాలాడిన మన పాలకవర్గం ఇలాంటి వాటిలో ఆరితేరింది. ఇప్పటి వరకు ఈ ఎత్తుగడ ఫలించినట్లు లేదు. నిజంగానే మన దేశం చైనా ఎలక్ట్రానిక్ కంపెనీలు, వాటి పెట్టుబడులను అనుమతిస్తే అమెరికా మరింత శత్రు పూరితంగా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయి. జిగినీ దోస్తుతో సంబంధాలను మోదీ అంత తేలికగా వదులుకుంటారా అన్నది చూడాల్సి ఉంది.

మన జీడీపీ పది లక్షల కోట్ల డాలర్లకు చేరాలంటే చైనాతో సయోధ్య తప్పనిసరని కొందరి సూచన, డ్రాగన్‌తో పెట్టుకుంటే మృత్యుఘంటికలే అని కొందరి హెచ్చరిక. ఏది సత్యం ! ఏదసత్యం ఓ మహాత్మా, ఓ మహర్షీ !! గాల్వాన్ లోయ ఘర్షణ తర్వాత చైనాతో మాటల్లేవు. పోరే శరణ్యం అంటూ ఊగిపోయిన దృశ్యాలు మన కళ్ల ముందే ఉన్నాయి. చైనా కమ్యూనిస్టు పార్టీతో ఒప్పందం, రాయబారి నుంచి పాఠాలు నేర్చుకున్నట్లు రాహుల్ గాంధీని ఎద్దేవా చేసిన వారు తమ కింది నలుపు చూసుకుంటున్నట్టులేదు. 2001లోనే బీజేపీ చైనా కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు పెట్టుకుంది. గాల్వాన్ ఉదంతాలు జరిగి ఐదేళ్లు గడచిన తరువాత చూస్తే మూసిన తలుపులను మనమే తెరుస్తున్నాం. అప్పుడెందుకు మూశారు, ఇప్పుడెందుకు తెరిచారు, ఇన్నేళ్లు ఎందుకు ఆలస్యం చేశారు అని ఎవరైనా అడిగారో దేశద్రోహ ముద్రవేస్తారు జాగ్రత్త. త్వరలో షాంఘై సహకార సంస్థ సమావేశాలకు ప్రధాని మోదీ బీజింగ్ సందర్శనకు వెళతారని అంటున్నారు.అన్నీ సక్రమంగా ఉంటే జిన్‌పింగ్ కూడా దిల్లీ రావచ్చు. ఏదీ అసాధ్యం కాదు, జిన్‌పింగ్ రమ్మనాలే గానీ వెళ్లటానికి అన్నీ సర్దుకొని ట్రంప్ ఉన్నాడు. ఎవరి ఎత్తుగడలు వారివి, ఎవరి ప్రయోజనాలు వారికి ముఖ్యం.

త్వరలో చైనాను అధిగమించేందుకు ముందుకు పోతున్నామని కొందరు చెబుతుంటారు. ఆ చైనీయులేమో అమెరికాను దాటేస్తాం చూడండి అన్నట్లుగా సందడి లేకుండా తమపని తాము చేసుకుపోతున్నారు. మన సంకల్పం మంచిదే, ఆరోగ్యకరమైన పోటీ ప్రతి దేశంతోనూ ఉండాల్సిందే. మధ్యలో చైనా ఎందుకు ఏకంగా అమెరికాతోనే పోటీ పడాలి. అయితే పేచీ ఎక్కడ అంటే ఎవరికి వారు మేమే ముందుండాలి, అగ్రస్థానం మాకే దక్కాలి అనుకుంటే ఫలితం, పర్యవసానాలు ప్రతికూలంగానే ఉంటాయి. ఎవరి సంగతి వారే చూసుకోవాలి అనుకున్నప్పుడు మన అభివృద్ధిని మరొకరు ఓర్వలేకుండా ఉన్నారని ఏడిస్తే ప్రయోజనం లేదు. 1970వ దశకం వరకు కమ్యూనిస్టు చైనాకు ఐరాసలో, 2001 వరకు ప్రపంచ వాణిజ్య సంస్థలో సభ్యత్వమే లేదు. అడ్డుకున్నది ఎవరంటే అమెరికా, దాని కనుసన్నలలో నడిచే దేశాలే అన్నది తెలిసిందే. చిత్రం ఏమిటంటే అదే అమెరికా తరువాత కాలంలో తన కంపెనీల పెట్టుబడులను చైనాలో అనుమతించింది, తన అవసరం కోసం పరిమితంగా, ఫరవాలేదు పాతబడిందే కదా అనుకున్న సాంకేతిక పరిజ్ఞాన బదిలీని అనుమతించింది. లాటిన్ అమెరికా దేశాల మాదిరి వస్తు ఎగుమతి ఆధారిత దేశంగా ఉంటూ తనకు లాభాలను అందిస్తుంది అనుకున్న ఆశలను చైనా వమ్ము చేసింది. లాటిన్ అమెరికా దేశాలు పెట్టుబడిదారీ, చైనా కమ్యూనిస్టుల నాయకత్వంలో ఉందనే వాస్తవాన్ని పశ్చిమ దేశాల వారు అర్థం చేసుకోలేకపోయారు. చేయి అందిస్తే ఏకంగా అల్లుకు పోతుందని అమెరికా కార్పొరేట్ మేధావులు నాలుగు దశాబ్దాల క్రితం గుర్తించలేకపోయారు. చైనా నేడు అనేక రంగాలలో సవాలు చేస్తున్నది. అడ్డుకొనేందుకు అడుగడుగునా అమెరికా కూటమి చూస్తున్నది. ఆధునిక చిప్స్ అందుబాటులో లేకుండా చేయాలని ఆంక్షలు పెట్టిన సంగతి తెలిసిందే. తన కోడి కూయకపోతే చైనాలో తెల్లవారదని అది భావిస్తున్నది. ఇలాంటి ఆటంకాలు మనకు లేవు. నిజంగానే " కమ్యూనిస్టు నియంతృత్వ" చైనా మనకు అడ్డుపడుతున్నది అనుకుంటే మనవారు కీర్తించే " ప్రజాస్వామ్య " అమెరికా, ఇతర పశ్చిమదేశాలు మిత్రులు, భాగస్వాములే, అయినా సాయం చేసేందుకు ఎందుకు ముందుకు రావటం లేదు. బీజింగ్‌కు పోటీగా మనలను ఎందుకు నిలపటం లేదు? మన దేశంలోని కొందరు మేధావులు చైనా మాత్రమే మనలను అడ్డుకుంటున్నదని తమ దాడిని ఎందుకు ఎక్కుపెడుతున్నట్లు? జనం ఆలోచించాలి ! అమెరికాతో మన దేశ వాణిజ్య ఒప్పంద గడువు జులై తొమ్మిది, ఆగస్టు ఒకటి రెండూ మురిగిపోయాయి. చైనాతో వాణిజ్యం మీద లేని ఒప్పందం అమెరికాతో ఎందుకు అన్నది సామాన్యులకు అర్థం కావటం లేదు. భద్రతాపరమైన తనిఖీలతో నిమిత్తం లేకుండా చైనా కంపెనీలను 24 శాతం వాటాలతో భారత కంపెనీల్లో పెట్టుబడులను అనుమతించవచ్చని నీతి ఆయోగ్ ఇటీవల ప్రతిపాదించింది. కేంద్ర ప్రభుత్వం, అధికార బీజేపీలో ఒక వర్గం చైనా పెట్టుబడులను వ్యతిరేకిస్తుండగా మరొకటి సానుకూలంగా ఉంది. నీతి ఆయోగ్ చెప్పటం అంటే మన బడా కార్పొరేట్ల ప్రయోజనాలు, వాటి పరిరక్షణకు మోదీ మనసెరిగి నివేదించటం తప్ప మరొకటి కాదు. నిజంగా అదే జరిగితే ముందే చెప్పుకున్నట్లు డోనాల్డ్ ట్రంప్ మరింత రెచ్చిపోతాడు.

ఎంపీ మెడలో గొలుసు కొట్టేసిన దొంగ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఓ మహిళా ఎంపీ మెడలోని గొలుసును దొంగలు లాక్కుపోయారు. ఢిల్లీలో మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో తన మెడలోని చైన్ కొట్టేశారని కాంగ్రెస్ నేత, పార్లమెంట్ సభ్యురాలు సుధా రామకృష్ణన్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమిళనాడులోని మయిలాదుతురై పార్లమెంట్ నియోజకవర్గానికి సుధ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డీఎంకే నాయకురాలు రజతితో కలిసి చాణక్యపురిలోని పోలెండ్ ఎంబసీ సమీపంలో మార్నింగ్ వాక్ చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దొంగతనంపై ఆమె కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు కూడా లేఖ రాశారు. 'ఉదయం 6.15-6.20 గంటల సమయంలో హెల్మెట్ పెట్టుకొని స్కూటీ మీద మాకు ఎదురుగా వచ్చిన ఒక వ్యక్తి... నా మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. మాకు ఎదురుగా బండిపై నిదానంగా వస్తుండటంతో అతడిని మేం చైన్ స్నాచర్‌గా అనుమానించలేదు. అతడు బలంగా గొలుసు లాగడంతో నా మెడమీద గాయాలయ్యాయి. నా డ్రెస్ కూడా కొద్దిమేర చినిగింది. కిందపడిపోకుండా ఆగగలిగాను. తర్వాత మేమిద్దరం సహాయం కోసం ఎదురుచూశాం. కొద్దిసేపటికి పెట్రోలింగ్ వాహనం కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇలాంటి అత్యంత భద్రత కలిగిన ప్రాంతంలో ఎంపీగా ఉన్న మహిళపై జరిగిన ఈ దాడి దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ప్రదేశంలోనే ఒక మహిళ సురక్షితంగా నడిచే పరిస్థితి లేకపోతే... ఇతర ప్రాంతాల్లో రోజువారీ పనులను మేం ఎలా ధైర్యంగా పూర్తి చేసుకోగలం? ఈ ఘటన వల్ల నాకు మెడపై గాయాలయ్యాయి. నాలుగు సవర్ల గొలుసు పోగొట్టుకున్నాను. ఇదంతా నన్నెంతో బాధిస్తోంది' అని ఆమె లేఖలో పేర్కొన్నారు. ఆ నిందితుడిని గుర్తించి, త్వరగా న్యాయం జరిగేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని హోంమంత్రిని కోరారు. ప్రస్తుతం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతుండటంతో ఆమె ఢిల్లీలో ఉన్నారు. ఈ చాణక్యపురిలో పలు దేశాల దౌత్య కార్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అధికారిక భవనాలు ఉన్నాయి.

గిరిజన హక్కుల పరిరక్షకుడు శిబూ సోరెన్

రాంచి: జేఎంఎం వ్యవస్థాపక సభ్యుడు శిబూసోరెన్ జార్ఖండ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. గిరిజన హక్కుల కోసం ఎనలేని కృషి చేశారు. ఆయన సోమవారం ఉదయం కన్నుమూశారు. శిబూ సోరెన్ జనవరి 11, 1944లో జన్మించారు. నెమ్రా గ్రామంలో (గతంలో బీహార్‌లో భాగమైన... ప్రస్తుతం జార్ఖండ్‌లో ఉన్నది) జన్మించారు. ఆయన తండ్రి షోబరన్ సోరెన్. శిబూ సోరెన్‌కు 15 ఏళ్ల వయసు ఉన్నప్పుడు వడ్డీవ్యాపారుల దాడిలో తన తండ్రి షోబరన్ మృతి చెందారు. ఈ ఘటన శిబూ సోరెన్‌పై తీవ్ర ప్రభావం చూపింది. హజారిబాగ్‌లోని గోలా హైస్కూల్‌లో శిబూ సోరెన్ మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. రూపీ సోరెన్‌ను జనవరి 1, 1962లో వివాహమాడారు. వీరికి నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు దుర్గా సోరెన్ 2009లో మృతి చెందారు. కుమార్తె అంజలి జేఎంఎం ఓడిశా శాఖకు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన చిన్న కుమారుడు బసంత్ సోరెన్ ఎమ్మెల్యేగా ఉన్నారు. మరో కుమారుడు హేమంత్ సోరెన్ జార్ఖండ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. శిబూ సోరెన్ మృతితో గిరిజనుల గొంతు వినిపించే జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన ఓ రాజకీయ శకం ముగిసింది.

శిబూ 'దిషోమ్ గురు' (దేశ నాయకుడు)గా విస్తృత ప్రసిద్ధి చెందారు. గిరిజనుల హక్కుల కోసం నిరంతరాయంగా పోరాడిన నేతగా ఆయన గుర్తింపు పొందారు. ప్రాంతీయ, జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1973లో ట్రేడ్ యూనియన్ నాయకుడు ఏకే రాయ్, బిహారీ మహతోతో కలిసి శిబూసోరెన్ జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)ను స్థాపించారు. ఆయన నాయకత్వంలో గిరిజన రాష్ట్రం జార్ఖండ్ కోసం జేఎంఎం పార్టీ ప్రధాన శక్తిగా ఎదిగింది. ప్రత్యేక రాష్ట్రం కోసం చోటానాగపూర్, సంతల్ పరగణ ప్రాంతాలలో ఈ పార్టీ బలమైన మద్దతు కూడగట్టుకుంది. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి... పోరాడి వారి కలను సాకారం చేసుకున్నారు. ఆయన అధ్వర్యంలో దశాబ్దాల తరబడి సాగించిన ఆందోళనల తర్వాత నవంబర్ 15, 2000 సంవత్సరంలో జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది.

శిబూ రాజకీయ జీవితం 1980లోనే మొదలైంది. అదే ఏడాది ఏడవ లోక్‌సభ ఎన్నికల్లో దుమ్కా స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఈ స్థానం నుంచే ఆయన పలుమార్లు గెలిచారు. ఆయన 2020లో రాజ్యసభకు ఎంపీగా పనిచేశారు. అక్టోబర్ 2024లో గిరిజన వ్యవహారాల



మంత్రిత్వశాఖకు సంబంధించిన కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. శిబూసోరెన్ మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే ఎప్పుడూ పూర్తికాలం ఆ బాధ్యతల్లో లేరు. కేవలం కొన్నిరోజులు లేక... కొన్ని నెలలే ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యల్లో ఉన్నారు. మార్చి 2-11 2005, ఆగస్టు 27 (2008)-జనవరి 12 (2009) వరకు, డిసెంబర్ 30 (2009) -మే 31 (2010) వరకు ఆయన సీఎంగా ఉన్నారు. యూపీఏ-1 హయాంలో 2004-2006 మధ్య మూడుసార్లు కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖమంత్రిగా పనిచేశారు. ఆయన కేంద్ర మంత్రివర్గంలో ఉన్న సమయంలో... చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 1975 చిరుదిహ్ ఊచకోత కేసుకు సంబంధించి సోరెన్‌పై 2004లో అరెస్టు వారెంట్ జారీ అయింది. దీంతో ఆయన కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్లారు. తర్వాత ఆయనను అరెస్టు చేశారు. బెయిల్ పొందిన తర్వాత తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. మార్చి 2008లో ఆయన ఈ కేసులో నిర్దోషిగా విడుదలయ్యారు. 1994లో తన మాజీ కార్యదర్శి శశినాథ్ ఝా కిడ్నాప్, హత్య కేసులో సోరెన్ నవంబర్ 2006లో దోషిగా నిర్ధారించబడ్డారు. 1993లో పీవీ నరసింహారావు ప్రభుత్వంపై జరిగిన అవిశ్వాస తీర్మానం సందర్భంగా రాజకీయ పలుకుబడి కలిగిన శశినాథ్ ఝా నోరు మూయించేందుకు అతనిని శిబూ సోరెన్ హత్య చేశారని సీబీఐ ఆరోపించింది.

సోరెన్ ఈ కేసులో నిర్దోషిగా

విడుదలయ్యారు. ఏప్రిల్ 2018లో సుప్రీంకోర్టు శిబూ సోరెన్‌ను నిర్దోషిగా తేల్చింది. జూన్ 2007లో సోరెన్‌ను జైలుకు తీసుకెళుతున్నప్పుడు దేవగఢ్ సమీపంలో ఆయన కాన్వాయ్‌పై బాంబులు విసిరి హత్యాయత్నం చేశారు. ఈ దాడిలో ఆయన తప్పించుకున్నారు. ఆయన రాజకీయ జీవితంలో అస్థిరతలు ఉన్నప్పటికీ జార్ఖండ్‌లో ఆయన ప్రభావం చెక్కుచెదరకుండా ఉంది. ఆయన ఏప్రిల్ 2025 వరకు 38 సంవత్సరాలు జేఎంఎం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. శిబూ సోరెన్ దశాబ్దాల రాజకీయ జీవితం.. జార్ఖండ్ రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలుపుతుంది. గిరిజనుల గుర్తింపు, గౌరవం, స్వయంపాలన కోసం చేసిన ఆయన పోరాటం... ముందు తరాలకు శాశ్వత వారసత్వంగా నిలిచిపోతుంది.

గిరిజన సంక్షేమానికి ఎనలేని కృషి

శిబూ సోరెన్‌కు రాష్ట్రపతి, ప్రధాని నివాళి

న్యూఢిల్లీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ మృతికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. రాష్ట్రపతి, ప్రధాని వేర్వేరుగా ఆస్పత్రిని సందర్శించి... శిబూ సోరెన్ భౌతిక కాయానికి నివాళు లర్పించారు. ఆయన తనయుడు, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను పరామర్శించారు. గిరిజన, పేద, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించేందుకు శిబూ సోరెన్ ఎనలేని కృషి చేశారని మోదీ పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి నుంచి ప్రజాజీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు శిబూ సోరెన్‌కు నివాళు లర్పించిన వారిలో ఉన్నారు. జేఎంఎం వ్యవస్థాపకుల్లో ఒకరైన శిబూ సోరెన్‌కు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఆయన ఎనిమిది సార్లు లోక్‌సభ, రెండుసార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ... ఒక్కసారి కూడా పూర్తికాలం పదవిని నిర్వహించలేకపోయారు. తండ్రి మరణంపై హేమంత్ సోరెన్ మీడియాతో మాట్లాడారు. 'దేశ గిరిజన వీరుడు ఇక మన మధ్య లేరు. ఆయన చివరి క్షణం వరకు పోరాడారు. గొప్ప వ్యక్తిని కోల్పోయినందుకు మాటలు రావడం లేదు' అని పేర్కొన్నారు.

విమానంలో బొద్దింకలు

ఎయిరిండియా క్షమాపణలు

అహ్మదాబాద్: దేశీయ దిగ్గజ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా తరచూ వార్తల్లో నిలుస్తోంది. అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం అనంతరం సంస్థకు చెందిన వివిధ విమానాల్లో సాంకేతిక సమస్యలు, బాంబు బెదిరింపులతో నిత్యం వార్తల్లో నిలిచింది. తాజాగా ఆ సంస్థ మరోసారి ప్రధాన శీర్షికల్లో నిలిచింది. ఈసారి విమానంలో బొద్దింకలే అందుకు కారణం. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబైకి వెళ్తున్న ఏఐ 180 విమానంలో బొద్దింకలు కనిపించడంతో గందరగోళం నెలకొంది. వీటివల్ల ఇద్దరు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో క్యాబిన్ సిబ్బంది... ప్రయాణికులను అదే క్యాబిన్‌లోని వేరే సీట్లకు మార్చారు. ఆ తర్వాత విమానం ఫ్యూయల్ ఫిల్లింగ్‌కోసం కోల్‌కతాలో ఆగినప్పుడు గ్రౌండ్ సిబ్బంది విమానాన్ని పూర్తి శుభ్రం చేసినట్టు ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. సాధారణంగా తమ సిబ్బంది విమానాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తారని, అయితే కొన్నిసార్లు గ్రౌండ్ ఆపరేషన్ల సమయంలో కీటకాలు విమానంలోకి ప్రవేశిస్తాయని పేర్కొన్నారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దారి తప్పిన విమానం..

రాజస్థాన్ సీఎంకు తప్పిన ప్రమాదం

జైపూర్: రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మకు చేదు అనుభవం ఎదురైంది. ఆయన ప్రయాణిస్తున్న చార్టర్డ్ విమానం దారి తప్పింది. ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో దిగాల్సిన విమానం పొరపాటున సివిల్ ఎయిర్‌స్ట్రిప్‌లో దిగింది. ఈ ఘటనకు పైలట్ల పొరపాటే కారణమని తేలింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... భజన్ లాల్ శర్మ గత నెల 31న ఢిల్లీ నుంచి ఫలోడికి చార్టర్డ్ 2000 ఫాల్కన్ విమానంలో ప్రయాణించారు. షెడ్యూల్ ప్రకారం ఆ విమానం ఫలోడి ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోని ఎయిర్‌స్ట్రిప్‌లో దిగాల్సి ఉంది. అయితే, విమానం దానికి సమీపంలోని సివిల్ ఎయిర్‌స్ట్రిప్‌లో దిగింది. పైలట్లు వెంటనే తప్పు గుర్తించి విమానాన్ని ఫలోడి ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే ఈ సంఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తీవ్రంగా స్పందించింది. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తునకు ఆదేశించింది. పైలట్లు రన్‌వేను తప్పుగా గుర్తించడం వల్లే ఈ పొరపాటు జరిగినట్లు డీజీసీఏ గుర్తించి పైలట్లను ఫ్లయింగ్ డ్యూటీ నుంచి తొలగించింది.

చైనాపై నిజం దాయడమెందుకు?

జైరాం రమేశ్

న్యూఢిల్లీ: గాల్వన్ సంఘటన తర్వాత దేశభక్తిగల ప్రతి భారతీయుడు చైనా వ్యవహారంపై సమాధానాలు కోరుతున్నాడని, కానీ మోదీ ప్రభుత్వం 'డీడీఎల్‌జే... తిరస్కరించు, దృష్టి మరల్చు, అబద్ధం చెప్పు, సమర్థించు' అనే విధానంతో సత్యాన్ని దాచడానికి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ సోమవారం విమర్శించింది. 1962 నుంచి భారతదేశం ఎదుర్కొన్న అతిపెద్ద ప్రాదేశిక ఎదురుదెబ్బకు మోదీ ప్రభుత్వమే కారణమని ప్రతిపక్ష పార్టీ విమర్శించింది. దాని పిరికితనం, తప్పుడు ఆర్థిక ప్రాధాన్యతల కారణంగా చైనాతో 'సాధారణీకరణ'ను అనుసరిస్తోందని పేర్కొంది. తన భారత్ జోడో యాత్రలో భారత సైన్యం గురించి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అవమానకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై సుప్రీం కోర్టు స్పందించిన తర్వాత ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. జూన్ 15, 2020న గాల్వన్‌లో 20 మంది సైనికులు అమరులైనప్పటి నుంచి దేశభక్తి గల ప్రతి భారతీయుడు సమాధానాలు

వెతుకుతున్నాడని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'అయినప్పటికీ, సమాధానాలు ఇవ్వడానికి బదులుగా ఐదేళ్లుగా మోదీ ప్రభుత్వం నిజాన్ని కప్పిపెట్టడం అనే ఆయుధాన్ని ఎంచుకుంది' అని తెలిపారు. 'ఎక్స్' వేదికగా జైరాం రమేశ్ వరుస ప్రశ్నలు అడిగారు. 'గాల్వన్‌లో మన సైనికులు దేశం కోసం వీరోచితంగా ప్రాణాలు త్యాగం చేసిన నాలుగు రోజుల తర్వాత నా కోయి హమారీ సీమా మే ఘుస్ ఆయా హై, న హి కోయి ఘుసా హువా హై అని చైనాకు ప్రధానమంత్రి ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారు' అని నిలదీశారు. 'మేము ఏప్రిల్ 2020 నాటి స్థితికి తిరిగి వెళ్లాలనుకుంటున్నామని 'సైన్యాధ్యక్షుడు జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారని తెలిపారు. 21, అక్టోబరు 2024 నాటి ఉపసంహరణ ఒప్పందం మమ్మల్ని తిరిగి యథాతథ స్థితికి తీసుకువెళుతుందా' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. భారత క్లెయిమ్ లైన్‌లో ప్రధానంగా ఉన్న 'బఫర్ జోన్'లు భారతీయ గస్తీ దళాలను గాల్వన్, హాట్ స్ప్రింగ్, పాంగోంగ్ త్సోలోని వారి గస్తీ పాయింట్లను పొందకుండా నిరోధించడం లేదా అని అడిగారు. 2020లో డెప్సాంగ్‌లోని 900 చదరపు కిలోమీటర్లు సహా తూర్పు లదాఖ్‌లోని 1,000 చదరపు కిలోమీటర్లు చైనా నియంత్రణలోకి వచ్చాయని విస్తృతంగా నివేదించబడలేదా? తూర్పు లదాఖ్‌లోని 65 పెట్రోలింగ్ పాయింట్లలో 26 పాయింట్లకు భారతదేశం ప్రాముఖ్యత కోల్పోయిందని లెహ్ ఎస్పీ వార్షిక డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సమావేశంలో ఒక పత్రాన్ని సమర్పించలేదా?' అని ఆయన ప్రశ్నించారు. చైనా నుంచి దిగుమతులు, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ బ్యాటరీలు, సోలార్ సెల్స్ వృద్ధి చెందుతున్నాయనేది నిజం కాదా, అలాగే టెలికం, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి ముఖ్యమైన రంగాలు చైనా దిగుమతులపై ఆధారపడి ఉన్నాయా అని అడిగారు.

ఎస్‌ఐఆర్ అతి పెద్ద సమస్య: ప్రియాంక

న్యూఢిల్లీ: బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) చాలా 'పెద్ద సమస్య' అని, ప్రభుత్వం దానిపై చర్చకు అంగీకరించి ముందుకు సాగాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం అన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన విషయం అయినప్పుడు ప్రతిపక్షాలు ఈ అంశాన్ని ఎందుకు లేవనెత్తకూడదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చ డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల నిరసనల కారణంగా లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడిన తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాలు ఎస్‌ఐఆర్ అంశాన్ని లేవనెత్తడం

గురించి అడిగినప్పుడు, ప్రియాంక గాంధీ... 'ఇది చాలా పెద్ద సమస్య. ఓటర్ల జాబితాకు ఇదంతా జరిగితే మనం దానిని ఎందుకు లేవనెత్తకూడదు?' అని అన్నారు. 'ప్రభుత్వం చర్చకు అంగీకరించి ముందుకు సాగాలి' అని ఆమె పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో అన్నారు. బీహార్‌లో ఎస్‌ఐఆర్ ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇండియా ఐక్య సంఘటనకు చెందిన అనేక మంది ఎంపీలు పార్లమెంటు భవన సముదాయంలో ప్రతిరోజూ నిరసన తెలుపుతున్నారు. అయితే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సియోరెన్ మరణం దృష్ట్యా సోమవారం ఈ నిరసన జరగలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో 'ఓటర్ల ఓటు హక్కును తొలగించడం' లక్ష్యంగా బీజేపీ ఈ చర్య చేపట్టిందని ఆరోపిస్తూ ఎస్‌ఐఆర్‌కి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు పార్లమెంటు ఉభయ సభలలో నిరసన తెలుపుతున్నాయి. ఈ అంశంపై రెండు సభలలో చర్చ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

విద్యతోనే సనాతన బానిసత్వం అంతం

కమల్ హాసన్

లక్నో: సనాతన బానిసత్వాన్ని అంతం చేయగల ఏకైక ఆయుధం విద్యేనని ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ అన్నారు. సినీ నటుడు సూర్య విద్యా స్వచ్ఛంద సంస్థ అగరం ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమల్ హాసన్ మాట్లాడారు. ప్రజలు వేరే ఏ ఆయుధాన్ని చేతిలోకి తీసుకోకుండా కేవలం విద్యను మాత్రమే గట్టిగా పట్టుకోవాలని కమల్ సూచించారు. 'విద్య లేకుండా మనం గెలవలేం. ఎందుకంటే బహుసంఖ్యాక మూర్ఖులు (మూదర్గల్) మిమ్మల్ని ఓడించగలరు. అందుకే మనం విద్యను గట్టిగా పట్టుకోవాలి' అని ఆయన కోరారు. విద్యా వ్యవస్థలు, సామాజిక సాధికారతపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. 2017 నుంచి అమల్లో ఉన్న 'నీట్' విధానాన్ని కమల్ హాసన్ తీవ్రంగా విమర్శించారు. ఇది ఆర్థికంగా వెనుకబడిన, అణగారిన వర్గాల విద్యార్థుల వైద్య విద్య కలలను నాశనం చేసిందని ఆరోపించారు. 'వచ్చే ఏడాది ఇలాంటి డాక్టర్లను మీరు చూడలేరు. 2017 తర్వాత ఈ పిల్లలు తమ ప్రయత్నాలు కొనసాగించలేకపోతున్నారు. అందుకే మేము నీట్‌ను వ్యతిరేకిస్తున్నాం. ఆ చట్టం ఇలాంటి పిల్లల చదువులను అడ్డుకుంది' అని చెప్పారు. కేవలం విద్య మాత్రమే ఆ చట్టాన్ని మార్చగల శక్తి ఇస్తుందని కమల్ స్పష్టం చేశారు. సినిమాలో మంచి నటనకు కిరీటం లభిస్తే, సామాజిక సేవకు ముళ్ల కిరీటం లభిస్తుందని కమల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ముళ్ల కిరీటాన్ని స్వీకరించడానికి బలమైన హృదయం కావాలని, ఎందుకంటే సామాజిక సేవను ఎవరూ మన కోసం చేయబోరని, మనమే చేయాలని కమల్ సూచించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో నిన్న జరిగిన తన సంభాషణను కమల్ హాసన్ గుర్తు చేసుకున్నారు. సామాజిక సేవ చేసే స్వచ్ఛంద సంస్థలు డబ్బు అడగడం లేదని, కేవలం పని చేయడానికి అనుమతి మాత్రమే కోరుతున్నాయని తాను ముఖ్యమంత్రితో చెప్పినట్టు కమల్ తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. ఈ గొప్ప కార్యంలో భాగం కావడం తనకు గర్వకారణమన్నారు. నాయకత్వం అంటే ఒక స్థానంలో కూర్చుని పాలించడం కాదని, సమాజంలో కనిపించకుండా సేవ చేయడమని కమల్ స్పష్టం చేశారు.

బెంగాలీ భాషను అవమానించడమే: స్టాలిన్

చెన్నై: కేంద్రహోంశాఖ పరిధిలోని ఢిల్లీ పోలీసులు బెంగాలీని 'బంగ్లాదేశ్ భాష'గా అభివర్ణించడాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం తీవ్రంగా ఖండించారు. ఇది మన జాతీయ గీతం రచించిన బెంగాలీ భాషను ప్రత్యక్షంగా అవమానించడమేనని మండిపడ్డారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సంఘీభావం ప్రకటిస్తున్నట్లు సోషల్‌మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ ప్రకటనలు అనుకోకుండా చేసిన లేదా అజాగ్రత్తతో కూడిన తప్పులు కాదని, వైవిధ్యాన్ని నిరంతరం అణగదొక్కే, గుర్తింపుపై ఉద్దేశపూర్వకంగా దాడి చేసే పాలకుల చీకటి మనస్తత్వాన్ని బయటపెడుతుందని స్టాలిన్ విమర్శించారు. హిందీయేతర భాషలపై దాడి నేపథ్యంలో మమతా బెనర్జీ భాషకు, ప్రజలకు రక్షణ

కవచంగా నిలిచారని, తగిన విధంగా ప్రతిస్పందిస్తారని అన్నారు. ఢిల్లీ పోలీసులు చేసిన ఒక ప్రకటనలో బెంగాలీని బంగ్లాదేశ్ భాషగా పేర్కొన్నట్లు మమతా బెనర్జీ తెలిపారు. ఇది అవమానకరమైనది, అపఖ్యాతికరమైనది, దేశ వ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధమైనదిగా అభివర్ణించారు.

తేజస్విపై పోలీసులకు ఫిర్యాదు

పట్నా: ఆర్జేడీ నేత, బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌పై పట్నాలోని దిఘా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఆయనకు రెండు ఓటర్ ఐడీ కార్డులు ఉన్నాయంటూ న్యాయవాది రాజీవ్ రంజన్ చేసిన ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సి ఉంది. తేజస్వి శనివారం ఎన్నికల సభలో మాట్లాడుతూ తన పేరు సరికొత్త ఓటర్ల జాబితా నుంచి మాయమైందని ఆరోపించారు. దీంతో అప్రమత్తమైన ఎన్నికల అధికారులు జాబితాలు తెప్పించుకొని వెతికారు. బీహార్ యానిమల్ సైన్సెస్ విశ్వవిద్యాలయం లైబ్రరీ బిల్డింగ్‌లోని పోలింగ్ బూత్ 204లో దానిని గుర్తించారు. జాబితాలో 416 నెంబర్‌లో తేజస్వి వివరాలున్నాయని పేర్కొన్నారు. తన ఎపిక్ నంబరును ఈసీ ఒకటి చూపిస్తే...తేజస్వి మరొకటి చూపించారు. తేజస్వి చూపిన నంబరుతో తాము ఎపిక్ నంబరు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. చివరికి తేజస్విపై బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోండి

బాంకే బిహారీ ఆలయ కేసులో సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: వృందావన్‌లోని శ్రీ బాంకే బిహారీ ఆలయ ట్రస్ట్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మధ్య నెలకొన్న వివాదంపై సోమవారం సుప్రీంకోర్టు స్పందించింది. శ్రీకృష్ణ భగవానుడు మొదటి మధ్యవర్తి అని, ఆయన అడుగుజాడల్లో నడవాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. బాంకే బిహారీ ఆలయానికి చెందిన రూ.500 కోట్ల నిధులతో ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టాలన్న అంశంపై వివాదం చెలరేగుతోంది. ఈ కేసులో వాదనలు విన్న సుప్రీంకోర్టు ... శ్రీకృష్ణుడు తొలి మధ్యవర్తి అని, సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది. వివాదం పరిష్కారం కోసం కమిటీని ప్రతిపాదిస్తున్నట్లు తెలిపింది. ఆలయ నిధులను రహస్య వినియోగించే పద్ధతిని సుప్రీంకోర్టు వ్యతిరేకించింది. ఈ అంశంలో యూపీ సర్కారు వైఖరిని కోర్టు తప్పుపట్టింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చి ఈ ప్రతిపాదన చేశారు. ఆలయ నిధులను వాడుకోవాలని మే 15వ తేదీన ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలిన సుప్రీం తెలిపింది. గతంలో ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నామని చెప్పింది. ట్రస్టీ సభ్యుల్లో మాజీ హైకోర్టు జడ్జి లేదా సీనియర్ విశ్రాంత న్యాయవాది ఉంటారని పేర్కొంది. ఆలయ పునరుద్ధరణ కోసం వినియోగించే నిధులపై తాత్కాలిక కమిటీకి అవకాశం ఇవ్వనున్నట్లు కోర్టు వెల్లడించింది.

తాగిన మత్తులో 30 మందిని కారుతో ఢీకొట్టిన ఆర్మీ అధికారి

ముంబై: ఆర్మీ అధికారి ఒకరు మద్యం తాగిన మత్తులో కారు నడుపుతూ సుమారు 30 మందిని ఢీకొట్టాడు. అదుపుతప్పిన ఆ కారు డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. స్థానికులు ఆ ఆర్మీ అధికారిని చుట్టుముట్టి కొట్టారు. అక్కడకు చేరుకున్న పోలీసులకు అతడిని అప్పగించారు. ఈ ఘటన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే... హర్ష్‌పాల్ మహాదేవ్ వాగ్మారే (40) అనే ఆర్మీ అధికారి అస్సాంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన నాలుగు రోజులు సెలవుపై మహారాష్ట్రకు వచ్చాడు. ఆదివారం రాత్రి ఆయన నాగ్‌పూర్‌లోని నాగర్ధాన్‌లోని దుర్గా చౌక్ మీదుగా హమ్లాపురికి కారులో వెళ్తున్నాడు. అయితే మద్యం తాగిన ఆయన కారును నిర్లక్ష్యంగా నడపడంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి సుమారు 30 మందిని ఢీకొట్టాడు. ఆ తర్వాత డ్రైనేజీలోకి కారు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ సంఘటనపై స్థానికులు ఆగ్రహించారు. మద్యం తాగి ఉన్న ఆర్మీ అధికారి హర్ష్‌పాల్ మహాదేవ్‌ను కారు నుంచి బయటకు లాగారు. గాయపడిన ఆయనపై దాడి చేశారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ ఆర్మీ అధికారిని అదుపులోకి తీసుకున్నారు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్ల నియామకంలో స్థానికత: నితీశ్

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మరో ప్రకటన చేశారు. రాష్ట్రంలో టీచర్ల నియామక విధానంలో కీలక మార్పు చేస్తున్నట్టు తెలిపారు. ఇకముందు టీచర్ల నియామకంలో బీహార్‌లో స్థిరనివాసం కలిగిన వారికే ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. 'బీహార్ స్థానికులకు టీచర్ల నియామకాల్లో ప్రాధాన్యత ఇచ్చేలా సంబంధింత నిబంధనల్లో మార్పు చేయాలని విద్యా శాఖకు ఆదేశాలు ఇచ్చాం. సవరించిన నిబంధనలు టీఆర్ఈ-4 నుంచి వర్తిస్తాయి. 2025 టీచర్స్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ నాలుగో దశ నుంచి ఇది అమల్లోకి వస్తుంది. 2026లో టీఆర్ఈ-5 ఉంటుంది' అని నితీశ్ తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం 2005 నవంబర్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యావ్యవస్థను మెరుగుపరచేందుకు నిరంతరం పనిచేస్తోందని, మరింత పటిష్టం చేసేందుకు పెద్ద సంఖ్యలో టీచర్ల నియామకాలు జరుపుతున్నామని చెప్పారు. టీఆర్ఐ-5కు ముందే రిక్రూట్‌మెంట్ రోడ్‌మ్యాప్‌లో భాగంగా స్టేట్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎస్‌టీఈటీ) కూడా నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వ టీచర్ల ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నది రాష్ట్ర ప్రజల చిరకాల డిమాండ్‌గా ఉంది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో స్థానికులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

కాన్వా ఇండియా 'దిల్ సే, డిజైన్ తక్' రెండవ ఎడిషన్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ: ప్రపంచంలోని ఏకైక ఆల్-ఇన్-వన్ విజువల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్ అయిన కాన్వా, భారతదేశంలో తన ఫ్లాగ్‌షిప్ బ్రాండ్ ప్రచారం రెండవ ఎడిషన్ 'దిల్ సే, డిజైన్ తక్'ను ప్రారంభించినట్లు ప్రకటించింది. గత సంవత్సరం అసాధారణంగా బలమైన ఊపుపై ఆధారపడి, రిఫ్రెష్ చేయబడిన ప్రచారం, భావోద్వేగ కథనాలు, సంస్కృతి ఉట్టిపడిన భావం కాన్వా ప్రధాన లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది. డిజైన్‌ను సరళంగా, ఆనందంగా, అందరికీ అందుబాటులో ఉంచడం దీని ఉద్దేశం. 'దిల్ సే, డిజైన్ తక్' అనేది అసలు ప్రచారం హృదయపూర్వక నేపథ్యాన్ని తిరిగి తీసుకువస్తూ, కుటుంబాలు హృదయ పూర్వక హావభావాలను రూపొందించడం నుండి నిపుణుల వరకు ఆలోచనలను సజావుగా జీవం పోసే వరకు కాన్వా సృష్టికర్తలకు అధికారం ఇచ్చే విభిన్న మార్గాలను హైలైట్ చేసే రెండు కొత్త కథాంశాలను పరిచయం చేస్తుందని కాన్వాలోని కంట్రీ హెడ్ చంద్రిక దేబ్ తెలిపారు. కాన్వా సహజమైన, ఏఐ-ఆధారిత డిజైన్ సాధనాలు రెండు కొత్త హీరో చిత్రాలు, బహుభాషా అనుసరణల లో కేంద్ర దశను తీసుకుంటాయి. ఇవి డిజైన్ సరళమైనది, ఆనందకరమైనది, సహకారమైనది, నిజంగా అందుబాటులో ఉండే ప్రపంచాన్ని చూపిస్తాయి.

6000 ఎంఏహెచ్ బ్యాటరీతో వివో వై400 5జీ విడుదల

ముంబయి: ప్రపంచవ్యాప్తంగా వైవిధ్యమైన మరియు సాంకేతికతను సమన్వయపరిచే బ్రాండ్ వివో తన తాజా వై సిరీస్ స్మార్ట్ ఫోన్‌గా వివో వై400 5జీని ఆవిష్కరించింది. ఎప్పుడూ చురుకుగా ఉంటూ ముందుకు సాగే జెన్-జెడ్ వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ ఫోన్, మునుపెన్నడూ లేని పనితీరు, స్టైల్ మరియు మన్నికను అందించేలా తయారైంది. ఇవన్నీ కేవలం 0.79 సెంటీమీటర్ల స్లిమ్ డిజైన్‌లో అందుబాటులో ఉన్నాయి. వివో వై400 5జీలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన 6000 ఎంఏహెచ్ భారీ బ్యాటరీ, దీని ద్వారా దీర్ఘకాలం పవర్‌తోపాటు 90డబ్ల్యు ఫ్లాష్‌చార్జ్ సాయంతో వేగంగా చార్జ్ అవుతుంది. 16.94 సెం.మీ. (6.67-ఇంచ్) ఎఫ్‌హెచ్‌డీ+ అమోలెడ్ డిస్‌ప్లేతో పాటు 120హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్ 1800 నిట్స్ లోకల్ పీక్ బ్రైట్‌నెస్ ద్వారా వినియోగదారులకు ధైర్యమైన దృశ్య అనుభవాన్ని అందిస్తుంది. ఇవన్నీ ఎండలో కూడా స్పష్టంగా చూడగలుగుతారు. ఇందులో వివో ఏఐ ఎఫీషియన్సీ సూట్ కూడా ఉంది, ఇది మల్టీటాస్కింగ్‌ను మరింత స్మార్ట్‌గా, మృదువుగా చేస్తుంది. 8జీబీ ర్యామ్128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.21,999, 8జీబీ ర్యామ్256జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.23,999 ఉంటుంది. 2025 ఆగస్ట్ 7 నుండి వివో ఇండియా ఈస్టోర్, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, అన్ని భాగస్వామి రిటైల్ స్టోర్లలో లభ్యమవుతుంది.

అన్ని విభాగాలలో అత్యధికంగా అమ్ముడైన వాహనంగా హ్యుందాయ్ క్రెటా

గురుగ్రామ్: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) జనవరి నుండి జూలై 2025 వరకు (అన్ని విభాగాలలో) దేశంలో అత్యధికంగా అమ్ముడైన మోడల్‌గా విజాయవంతమైన, అల్టిమేట్ ఎస్‌యూవీ, హ్యుందాయ్ క్రెటా ఉద్భవించిందని ప్రకటించింది. ఈ కాలంలో 1,17,458 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇది 8% వార్షిక వృద్ధిని (జనవరి-జూలై 2024 తో పోలిస్తే) తో, హ్యుందాయ్ క్రెటా భారతీయ ఆటోమోటివ్ ల్యాండ్‌స్కేప్‌లో ఆధిపత్యం చెలాయిస్తూనే ఉంది, ఇది వినియోగదారులలో అగ్ర ఎంపికగా దాని ఖ్యాతిని పటిష్టం చేస్తుంది. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ హోల్-టైమ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ మాట్లాడుతూ, "హ్యుందాయ్ క్రెటా దశాబ్ద కాలం జరుపుకుంటున్న సందర్భంగా, మా కస్టమర్లు అందించిన ప్రేమ, నమ్మకం మాకు నిజంగా గర్వకారణం. జనవరి - జూలై 2025 కాలంలో భారతదేశంలో అన్ని విభాగాలలో అత్యధికంగా అమ్ముడైన కారుగా అవతరించడం కేవలం అమ్మకాల మైలురాయి మాత్రమే కాదు, ఇది క్రెటా సంవత్సరాలుగా నిర్మించిన భావోద్వేగ సంబంధాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. క్రెటా భారత్‌లో అత్యంత ఇష్టపడే ఎస్‌యూవీగా తన స్థానాన్ని నిలుపుకుంటూ బెంచ్‌మార్క్‌లను సెట్ చేస్తూనే ఉంది.

పెట్రోకెమికల్ కన్సాలిడేషన్ వేగవంతం: బీసీజీ నివేదిక

న్యూఢిల్లీ: బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) "పెట్రోకెమికల్ కన్సాలిడేషన్ తదుపరి తరంగానికి సిద్ధమవుతోంది" అనే కొత్త నివేదిక ప్రకారం, దీర్ఘకాలిక తక్కువ మార్జిన్లు, అధిక సామర్థ్యం, ప్రాంతీయ వృద్ధి నమూనాలలో మార్పుల కారణంగా ప్రపంచ పెట్రోకెమికల్ రంగం గణనీయమైన ఏకీకరణకు లోనవుతుంది. ఈ నివేదిక రంగ లాభదాయకతలో బాగా తగ్గుదలను సూచిస్తుంది, సగటు ఆర్ఓసీఈ (రోస్) 2019లో 8% నుండి 2024లో 4%కి పడిపోయింది. అనేక ప్రాంతాలలో సామర్థ్య జోడింపులు డిమాండ్ పెరుగుదలను అధిగమిస్తాయని హైలైట్ చేస్తుంది. కంపెనీలు పెరుగుతున్న సవాలుతో కూడిన వాతావరణంలో పోటీతత్వాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నందున ఈ పరిస్థితులు హేతుబద్ధీకరణ మరియు ఏకీకరణ ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నాయి. భారతదేశం దాని బలమైన దేశీయ డిమాండ్, తయారీ సామర్థ్యాన్ని బట్టి ప్రాంతీయ ఏకీకరణదారుగా ఉద్భవిస్తుంది. ఈ వ్యూహాత్మక అవకాశాన్ని స్వీకరించడం ఉంచుకుని, భారతీయ పెట్రోకెమికల్ ఆటగాళ్లు ఇప్పుడు సేంద్రీయ వృద్ధికి మించి లక్ష్యంగా ఉన్న ఎం అండ్ ఏ, ఏకీకరణ, సాంకేతిక, స్థిరత్వ సామర్థ్యాలలో పెట్టుబడి వైపు చూడాలని బీసీజీ ఎనర్జీ ప్రాక్టీస్ మేనేజింగ్ డైరెక్టర్, భాగస్వామి కౌస్తుభ్ వర్మ అన్నారు.

గ్రీన్ ఎనర్జీ మొబిలిటీ సొల్యూషన్స్‌తో టాటా మోటార్స్ ఒప్పందం

చెన్నై: భారతదేశ అతిపెద్ద వాణిజ్య వాహన తయారీదారు టాటా మోటార్స్, యూనివర్సల్ బస్ సర్వీసెస్ (యూబీఎస్) లో భాగమైన చెన్నై కేంద్రంగా పనిచేసే మొబిలిటీ విభాగం గ్రీన్ ఎనర్జీ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (జీఈఎంఎస్)తో 100 అత్యాధునిక మాగ్నా ఈవీ ఇంటర్‌సిటీ కోచ్‌ల సరఫరా చేయడానికి అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకం చేసింది. చెన్నైలో ప్యాసింజర్ వెహికల్ ఎక్స్‌పో 2.0లో ఈ ఒప్పందం జరిగింది. ఇక్కడ టాటా మోటార్స్ అత్యుత్తమ పనితీరు, అసాధారణ మైన ప్రయాణీకుల సౌకర్యం, అత్యుత్తమ యాజమాన్యం కోసం రూపొందించబడిన ఆల్-ఎలక్ట్రిక్ మాగ్నా ఈవీ, ఎల్పీఓ 1822తో సహా దాని తాజా కమర్షియల్ ప్యాసింజర్ మొబిలిటీ పరిష్కారాలను ప్రదర్శిస్తోంది. యూనివర్సల్ బస్ సర్వీసెస్ దక్షిణ భారతదేశంలో ప్రముఖ ప్రీమియం ఇంటర్‌సిటీ ట్రావెల్ బ్రాండ్. దీని విస్తృత, విశ్వసనీయ త, కస్టమర్-కేంద్రీకృత సేవలకు అది ప్రసిద్ధి చెందింది. అందులో కొత్తగా చేర్చబడిన ఈవీ విభాగం, గ్రీన్ ఎనర్జీ మొబిలిటీ సొల్యూషన్స్ అధునాతన ఎలక్ట్రిక్ బస్సులు, ఛార్జింగ్ మౌలిక సదుపాయాల విస్తరణతో యూబీఎస్ సాగుతోంది. తమిళనాడు ప్రభుత్వ పరిశ్రమల మంత్రి డాక్టర్ టి.ఆర్.బి. రాజా, తమిళనాడు ప్రభుత్వ ప్రతినిధులు, ఆల్ ఓమ్ని బస్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు.

స్టింగ్ మెటావర్స్ రూ.199 కోట్ల ఏకీకృత ఆదాయం

హైదరాబాద్: భారతదేశంలో అగ్రగామిగా పబ్లిక్‌గా జాబితా చేయబడిన వెబ్3 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ అయిన స్టింగ్ మెటావర్స్ లిమిటెడ్ సోమవారం ఎఫ్‌వై26 మొదటి త్రైమాసికానికి దాని ఏకీకృత ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. కంపెనీ రూ.199.14 కోట్ల ఏకీకృత ఆదాయాన్ని మరియు రూ.18.29 కోట్ల పన్ను తర్వాత లాభాన్ని (పీఏటీ) నివేదించింది. ఇది దాని వేగంగా పెరుగుతున్న ప్రపంచ కార్యకలాపాలు మరియు డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్టికల్స్‌లో బలమైన పనితీరును ప్రతిబింబిస్తుంది. క్యూ1 ఎఫ్‌వై26 కన్సాలిడేటెడ్ ఫైనాన్షియల్ విషయానికొస్తే, ఆదాయం రూ.199.14 కోట్లు, పన్ను తర్వాత లాభం (పీఏటీ) రూ.18.29 కోట్లు, పీఏటీ మార్జిన్ 9.19%, ఆపరేటింగ్ ఈబీఐటీడీఏ రూ.21.83 కోట్లుగా నమోదైంది. వార్షిక వృద్ధి (క్యూ1 ఎఫ్‌వై25తో పోలిస్తే ఆదాయం 298% పెరగ్గా, నికర లాభం 240% పెరిగింది. బ్లాక్‌చెయిన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వెబ్3 గేమింగ్, ఫిన్‌టెక్ సేవలలో వృద్ధి ద్వారా బలమైన ఆదాయాలు దక్కాయి.

జూబ్లీహిల్స్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్ పేట డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ లో రూ.1 కోటి 5 లక్షల 30 వేల రూపాయలతో చేపట్టే సీసీ రోడ్ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని సహచర మంత్రి వివేక్ వెంకటస్వామి, మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలసి మంత్రి ఆవిష్కరించారు. అలాగే యూసుఫ్ గూడ సర్కిల్‌లో 1 కోటి 11 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు విడిసీసీ (వాక్యూమ్ డీవాటరేటెడ్ సిమెంట్ కాంక్రీట్) రోడ్ల పనులకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, మేయర్ గద్వాల విజయలక్ష్మిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. నగరంలో మౌలిక సదుపాయాల పెంపు పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారని, తెలంగాణలోని హైదరాబాద్ కు ప్రత్యేక స్థానం ఉన్నదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గరనే మున్సిపల్ శాఖ ఉండటంతో హైదరాబాద్ మహానగరాన్ని ఒక గొప్ప విశ్వనగరంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధికి మారుపేరైన వెంకటస్వామి గురించి దేశంలో ప్రతి ఒక్కరికి తెలుసని ఈ సందర్భంగా అన్నారు. హైదరాబాద్ మహానగరంలో ట్రిపుల్ ఆర్, మెట్రో, ఫోర్త్ సిటీ అలాగే మూసి ప్రక్షాళన అనే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలకు లక్షల కోట్ల రూపాయలు ఖర్చుచేస్తుందని వివరించారు. జీహెచ్ఎంసీ ద్వారా ప్రతి డివిజన్లో ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సంబంధిత కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు ముందుండాలని మంత్రి సూచించారు. అలాగే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి, భూగర్భ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజలు ఇచ్చిన మద్దతుకు కృతజ్ఞతగా అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు. హైదరాబాద్ మహానగరంలో 60 శాతం ఇన్‌కమ్ ఇక్కడినుండే ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలు వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు దగ్గరగా ఉండాలని ఈ వార్డులో ఏ సమస్యలు ఉత్పన్నమైన సత్వరమే స్పందించాలని కార్పొరేటర్లు మున్సిపల్ మున్సిపల్ సిబ్బందిని మంత్రి ఆదేశించారు. నగరం రూ.44 లక్షలతో చేపట్టే నూతన డ్రైనేజీ పనుల శిలాఫలకానికి మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి మంత్రి ఆవిష్కరించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మౌలిక సదుపాయాలు పెంపొందించడానికి అనేక అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిందన్నారు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు తమ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఉంటే

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు అదనపు కమీషనర్‌లకు ఫిర్యాదులు, విజ్ఞాపన పత్రాలను అందించి పరిష్కరించాలని కోరారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదులను అదనపు కమీషనర్ లు క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్జీల స్వీకరణ అనంతరం అదనపు కమీషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంకు అన్ని విభాగాల అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలు విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, అధికారుల ను ఆదేశించారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తే దరఖాస్తుదారుడు అదే పనిగా ప్రజావాణికి పలు మార్లు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి గుణాత్మక, సత్వర పరిష్కారం చూపా లనీ హెచ్చరించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంకు మొత్తం 60 విన్నపాలు వచ్చాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 88 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 39, సికింద్రాబాద్ జోన్ 27, శేరిలింగంపల్లి జోన్‌లో 6, ఎల్బీనగర్ జోన్ 8, చార్మినార్ జోన్‌లో 7, ఖైరతాబాద్ జోన్‌లో ఒక ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, సత్యనారాయణ, పద్మజ, గీతా రాధిక, సీత సూచేన్ రత్నాకర్, అడిషనల్ సి సి పి గంగాధర్, వెంకన్న, చీఫ్ వెటర్నరీ అధికారి డా.అబ్దుల్ వకీల్, చీఫ్ మెడికల్ అధికారి డా.పద్మజ, డిప్యూటీ సి ఈ ఓ పనస రెడ్డి, సంపద, హౌసింగ్ ఈ ఈ రాజేశ్వరరావు, ఈఈ ఓ పి వి రావు, ఎస్ ఈ ఎస్ డి పి డిప్యూటీ సి ఈ ఓ వి వి రావు, ఓ ఎస్ డి అనురాధ, హౌసింగ్ సిఈ నిత్యానంద, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ దుర్గా భాను పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మల్కాజ్గిరి నియోజకవర్గంలోని మౌలాలిలో నూతన పోలీస్ స్టేషన్ మంజూరు అయింది. నూతన పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా సైదయ్య నియమితులయ్యారు. మైనంపల్లిని కలిసిన మౌలాలి నూతన పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సైదయ్య మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో నూతన పోలీస్ స్టేషన్ మౌలాలి ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సైదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి శాంతిభద్రతల పరిరక్షణలో తమదైన పాత్ర పోషించాలని ఇన్స్పెక్టర్ కు సూచించారు. నూతన మౌలాలి పోలీస్ స్టేషన్ భవనం కోసం మున్సిపల్ కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌తో మాట్లాడి మౌలాలి పరిధిలో ఉన్న వాల్లు కార్యాలయాన్ని ప్రస్తుతం మౌలాలి పోలీస్ స్టేషన్ కోసం కేటాయించాలని మైనంపల్లి కోరారు. ఇందుకుగాను వారు సమ్మతించినట్లు మైనంపల్లి పేర్కొన్నారు. మౌలాలిలో ఉన్న కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఖాళీ స్థలంలో మౌలాలి పోలీస్ స్టేషన్ కోసం కోటిన్నర రూపాయలు నిధులు మంజూరయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన అనంతరం ఆగస్టు 15వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు మైనంపల్లి పేర్కొన్నారు. మౌలాలిలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మౌలాలి వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయడం ఎంతో సంతోషంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేశారు.

జెనరేటివ్ ఏఐ నగరంగా గ్రేటర్ హైదరాబాద్

విశాలాంధ్ర, హైదరాబాద్ : నగర పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గూగుల్‌తో చేతులు కలిపింది. నగరంలోని ప్రధాన పౌర సమస్యలను పరిష్కరించడానికి, పౌర సేవలను మెరుగుపరచడానికి జెన్ ఏఐ (జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- ఏఐ కంటే అడ్వాన్స్) ఆధారిత పైలట్ ప్రాజెక్టులను త్వరలో ప్రారంభం చేయడకు సన్నాహాలు చేస్తుంది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హైదరాబాద్‌ను జనరేటివ్ ఏఐ నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి ఈ ప్రాజెక్ట్ ఒక ముందడుగు. సోమవారం నగరపాలక సంస్థలో ఈ ప్రాజెక్ట్ అమలుపై చర్చించేందుకు పురపాలక శాఖ కార్యదర్శి దా కె ఇలంబరితి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, అదనపు, ఐటీ అదనపు కమిషనర్ అనురాగ్ జయంతిలు గూగుల్ క్లౌడ్ ప్లాట్ ఫాం టీమ్‌తో గూగుల్ మీట్ ద్వారా వర్చువల్ సమావేశంకు హాజరయ్యారు. ఈ జనరేటివ్ ఏఐ పైలట్ ప్రాజెక్ట్ భవిష్యత్ టెక్ ఆధారిత పరిష్కారాలను అన్వేషించి, స్మార్ట్ , పౌర సమస్యల పై సత్వరమే స్పందించే నగర పాలన నిర్మాణంపై దృష్టి సారించనుంది. ఏఐ ఆధారిత ప్రభుత్వ పౌర సేవలు, ప్రభుత్వ వెబ్‌సైట్ల కోసం జనరేటివ్ ఏఐ సెర్చ్ బార్, ప్రభుత్వ ఉద్యోగుల కోసం కన్వర్సేషనల్ చాట్‌బాట్‌లు, ఏఐ సెర్చ్ టూల్స్, పౌరుల విచారణ పరిష్కరణ కోసం ఏఐ సిస్టమ్, జి2ఐ (గవర్నమెంట్ టు సిటిజన్) సేవల కోసం బ్లాక్‌చెయిన్ ఆధారిత వికేంద్రీకృత క్రెడెన్షియల్స్, ఏఐ ఆధారిత టెండర్ మూల్యాంకన వ్యవస్థ, ఏఐతో స్మార్ట్ పార్కింగ్ నిర్వహణ, ఏఐతో సాంద్ర ఘన వ్యర్థ నిర్వహణ, పౌర దరఖాస్తుల కోసం ఆటోమేటెడ్ ఫారమ్ ఫిల్లింగ్, గూగుల్ మ్యాప్స్ ద్వారా పబ్లిక్ బస్సుల రియల్-టైమ్ ట్రాకింగ్, ఏఐ ఆధారిత రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ మోడల్స్, ఎఫ్.హెచ్‌ఐఆర్ -కంప్లైంట్ హెల్త్ రికార్డుల కోసం గూగుల్ క్లౌడ్ ఏపిఐలు, సత్వర వైద్య సేవలు, లేక్స్‌లో చెత్త, సి, డి వ్యర్థాల పారబోత నివారించేందుకు ఏఐ పర్యవేక్షణ, ఆరోగ్య వర్గర్ల కోసం "మాన్య" - ఏఐ అసిస్టెంట్. ఈ గూగుల్ భాగస్వామ్య పైలట్ ప్రాజెక్ట్ జీహెచ్ఎంసీ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలవనుంది. గూగుల్ భాగస్వామ్యంతో జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేయనున్న జనరేటివ్ ఏఐ పైలట్ ప్రాజెక్ట్ కేవలం ఒక సాంకేతిక ప్రయోగం మాత్రమే కాదని, పౌరులందరికీ స్మార్ట్, ఫ్రెండ్లీ, హైదరాబాద్‌ను నిర్మించే దిశగా ఇది ఒక ముందడుగు అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు.

నైపుణ్యంతో కూడిన జర్నలిజం అందించాలి : శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్ : నైపుణ్యంతో కూడిన జర్నలిజాన్ని సమాజానికి అందించాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో గిరిజన జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తితో పాటు తమని తాము తీర్చిదిద్దుకుంటూ జర్నలిజం పట్ల ఆసక్తి కనబరిచేలా వార్తలు రాయాలన్నారు. అందులో భాగంగానే గిరిజన జర్నలిస్టులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామని తెలిపారు. అదే విధంగా మిగిలిన వారికీ ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. సమాచార శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్ మాట్లాడుతూ గిరిజన జర్నలిస్టులకు మీడియా అకాడమీ శిక్షణా తరగతులు నిర్వహించడం గర్వించదగ్గ విషయం అన్నారు. తాను కూడా గిరిజన బిడ్డనే వస్తున్న వార్తల గురించి వివరించారు. దిశ ఎడిటర్ మార్కండేయ... వార్తా కథనాలు-ప్రత్యేక కథనాలు ఎలా రాయాలో తెలియజేశారు. గిరిజన జర్నలిస్టులు అడవి బిడ్డలు అయినందున ప్రత్యేక వ్యాసాలు రాయాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి... నేర వార్తల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన ఉండాలని, వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని చేసుకొని రాయాలని సూచించారు. నేర వార్తలలో చేయాల్సినవి, చేయకూడనివి అనే అంశాలను క్షుణ్ణంగా వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి సమాచార హక్కు చట్టం-2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర రావు, గిరిజన జర్నలిస్టులు పాల్గొన్నారు. వ్యవసాయంతో ఈ విధంగా మిమ్మలను కలుసుకో వడం ఆనందంగా ఉందన్నారు. శిక్షణలో పాల్గొన్న గిరిజన విలేకరులు మన గిరిజన జాతి ఔన్నత్యాన్ని చాటేలా కృషి చేయాలని కోరారు. ఈ శిక్షణ తరగతులలో ప్రముఖ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్-మీడియా ధోర ణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పులు, సోషల్ మీడియా యూట్యూబ్‌లో

చిత్తూరు జిల్లాలో హిందూస్తాన్ కోకా-కోలా బేవరేజెస్ సీఎస్ఆర్ కార్యక్రమాలు

చిత్తూరు: భారతదేశంలోని ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీలలో ఒకటైన హిందూస్తాన్ కోకా-కోలా బేవరేజెస్ (హెచ్‌సిసిబి), సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో తమ సమగ్ర సీఎస్ఆర్ కార్యక్రమం ప్రాజెక్ట్ షైన్ కింద పలు సామాజిక భాగస్వామ్య కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ కార్యక్రమాలలో ఆరోగ్య శిబిరాలు, ప్రజారోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధి, పాఠశాలల్లో పారిశుద్ధ్య ప్రాజెక్టులు, మహిళలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మరియు పర్యావరణ అనుకూల రీతిలో వ్యర్థాల నిర్వహణ పరిష్కారాలు వంటివి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యల శాఖల మంత్రి సత్య కుమార్ యాదవ్, శాసనసభ సభ్యులు (గంగాధర నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం, చిత్తూరు జిల్లా) డాక్టర్ వి ఎం థామస్, చిత్తూరులో జరిగిన ఒక కార్యక్రమంలో స్థానిక అధికారులు, సమాజ సభ్యులు, లబ్ధిదారుల సమక్షంలో ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ అవకాశాలను మెరుగుపరచడానికి హెచ్‌సిసిబి కట్టుబడి ఉంది. ఈ కార్యక్రమం కింద, చౌడేపల్లె, శాంతిపురం, వడమాలపేట, పాలసముద్రం, బుగ్గ అగ్రహారం, బైరెడ్డిపల్లె గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తోంది.

ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఆంథే 2025 ప్రారంభం

హైదరాబాద్: విద్యార్థుల ఆశయాలను విజయాలుగా మారుస్తూ 16 విజయవంతమైన సంవత్సరాలను పూర్తి చేసుకున్న దేశవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందిన టెస్ట్ ప్రిపరేషన్ సంస్థ ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్), తన ప్రధాన కార్యక్రమంగా ఆంథే 2025 (ఆకాశ్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్) ని గర్వంగా ప్రారంభిస్తోంది. భారత విద్యా క్యాలెండర్‌లో ప్రతిష్ఠాత్మకమైన వార్షిక ఈవెంట్‌లో ఇది ఒకటి. ఇది 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సవాళ్లను అధిగమించి నిజమైన సామర్థ్యాన్ని పరిష్కరించుకునేలా ఎదగడానికి ప్రేరేపిస్తుంది. నాణ్యమైన విద్యను అందరికీ అందించే లక్ష్యంతో ఆంథే 2025లో రూ.250 కోట్ల విలువైన 100% వరకు స్కాలర్‌షిప్‌...క్యాష్ అవార్డ్స్, ఆకాశ్ డిజిటల్, ఇన్విక్టస్ కోర్సులకు. అలాగే రూ.2.5 కోట్ల నగదు బహుమతులు ఇవ్వబడుతాయి. ఇవి వైద్యం లేదా ఇంజనీరింగ్ రంగాల్లో విజయవంతమైన కెరీర్ కలలు కన్న విద్యార్థులకు ఆ అవకాశాలను అందిస్తుంది. నీట్, జేఈఈ, స్టేట్ సీఈటీలు, ఎన్‌ఎస్‌ఈలు, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షల కోసం ఆకాశ్ నిపుణుల బోధనతో ఉత్తమ శిక్షణ పొందే మార్గాన్ని ఈ పరీక్ష అందిస్తుంది.

అయాన్ స్ట్రాటజీ హెడ్‌గా సుశాంత్ సారిన్

ముంబై: ప్రముఖ గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ అయిన అయాన్ పీఎల్‌సీ, సోమవారం సుశాంత్ సారిన్‌ను భారతదేశానికి స్ట్రాటజీ అండ్ కమర్షియల్ రిస్క్ సొల్యూషన్స్ హెడ్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఇది వెంటనే అమలులోకి వస్తుంది. ముంబయిలో నివసించే సరిన్, అయాన్ కోసం భారతదేశ సిఇఒ రిషి మెహ్రాకు నివేదిస్తారు. ఇండియా లీడర్‌షిప్ టీమ్‌లో చేరుతారు. ఈ బాధ్యతల్లో, అయాన్ వాణిజ్య రిస్క్ వ్యూహం, అమలుకు సారిన్ నాయకత్వం వహిస్తారు. కీలక రంగాలు, ప్రత్యేకతలలో సమగ్ర రిస్క్ సొల్యూషన్స్ డెలివరీని పర్యవేక్షిస్తారు. అతను అయాన్ ప్రపంచ ప్రాధాన్యతలతో అనుసంధానించబడిన వ్యూహాత్మక చొరవలను కూడా నడిపిస్తారు. ఈ ప్రాంతంలో సంస్థ దీర్ఘకాలిక వృద్ధిని రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తారు. "సుశాంత్ లోతైన పరిశ్రమ జ్ఞానం, వ్యూహాత్మక దూరదృష్టి మరియు అధిక పనితీరు గల బృందాలు, వ్యాపారాలను నిర్మించడంలో నిరూపితమైన ట్రాక్ రికార్డ్‌ను తెస్తాడు" అని మెహ్రా అన్నారు.

సిగ్నేచర్ గ్లోబల్ నాన్-కన్వర్టిబుల్ డిబెంచర్లకు కేర్ ఏ ప్లస్ రేటింగ్

ముంబయి: భారతదేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలలో ఒకటైన సిగ్నేచర్ గ్లోబల్ (ఇండియా) లిమిటెడ్, తమ ప్రతిపాదిత రూ. 875 కోట్ల విలువైన దాని దీర్ఘకాలిక నాన్-కన్వర్టిబుల్ డిబెంచర్ (ఎన్‌సిడీ) ఇష్యూకు క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నుండి కేర్ ఏ ప్లస్ రేటింగ్‌ను పొందిన ట్లు సోమవారం వెల్లడించింది. ఈ రేటింగ్, సిగ్నేచర్ గ్లోబల్ కొనసాగుతున్న ప్రాజెక్టుల నుండి దాని బలమైన అమ్మకాలు, కలెక్షన్ ఊపును కొనసాగించే అవకాశం ఉందనే నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. రియల్ ఎస్టేట్ పరిశ్రమలో కంపెనీ అనుభవం, 146 లక్షల చదరపు అడుగుల కంటే ఎక్కువ నివాస, వాణిజ్య ప్రాంగణాలను అభివృద్ధి చేసిన ట్రాక్ రికార్డ్, కేర్ ఏ ప్లస్ రేటింగ్‌ను పొందడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. సిగ్నేచర్ గ్లోబల్ యొక్క ప్రస్తుత ప్రాజెక్టుల సకాలంలో డెలివరీ చేయడం, ప్రాజెక్ట్ అభివృద్ధి దశలలో అంచనా వేసిన వైవిధ్యతను కూడా కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ హైలైట్ చేసింది.

హైదరాబాద్‌లో కొత్త బ్లెండ్‌తో ఏబీడీ స్టెర్లింగ్ రిజర్వ్ బీ7

హైదరాబాద్: భారతదేశ అతిపెద్ద స్పిరిట్స్ కంపెనీ అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిల్లర్స్ (ఏబీడీ), ఆధునిక భారతీయ వినియోగదారుల మారుతున్న అంచనాలను ప్రతిబింబించేలా రూపొందించిన రిఫ్రెష్డ్ సె మీ ప్రీమియం విస్కీ బ్లెండ్ అయిన రిన్యూడ్ స్టెర్లింగ్ రిజర్వ్ బీ7 (ఎస్ఆర్‌బీ7)ను ప్రవేశపెట్టింది. దీని రిఫైన్డ్ రుచి, రిన్యూడ్ బ్లెండ్ ఫినిషింగ్‌తో, ఎస్ఆర్‌బీ7 ఇప్పుడు స్పష్టమైన మాయాజాలం కంటే తక్కువ కాని మృదుత్వాన్ని అందిస్తుంది. నేటి వివేకవం తమైన రుచికి రూపొందించబడిన బోల్డ్, ఫుల్లర్ బాడీడ్ అనుభవంతో కూడిన బ్లెండ్. రీఇమేజిండ్ స్టెర్లింగ్ రిజర్వ్ బీ7 భారతదేశంలో విస్కీ అభిమానుల పెరుగుతున్న అభిరుచులకు అనుగుణంగా ఉంది. ప్రేరణ పొందిన సున్నితమైన, మరింత రిఫైన్డ్ టేస్ట్ ప్రొఫైల్‌ను కలిగి ఉంది. బీ7ని ఇంటింటా అభిమానించడానికి మా రిఫ్రెషింగ్ బోల్డ్ లక్షణాన్ని కాపాడుకుంటూ, కొత్త బ్లెండ్ నేటి వినియోగదారులు కోరుకునే సులభంగా తాగగలిగే సున్నితత్వాన్ని అందిస్తుంది. ఇది విస్కీ అభిమానులకు, ఆసక్తిగల కొత్తవారికి ఆకర్షణీయంగా దీన్ని సరైనదిగా చేస్తుంది.

ప్రసిద్ధ ఫంగిసైడ్ బ్రాండ్ బవిస్టిన్‌కు 50 ఏళ్లు

ముంబయి: భారతదేశంలోని ప్రముఖ పరిశోధన ఆధారిత అగ్రోకెమికల్ సంస్థ క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ (సిసిపిఎల్) తన ఐకానిక్ ఫంగిసైడ్ బ్రాండ్ బవిస్టిన్ గౌరవప్రదమైన 50 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకుందని ప్రకటించింది. 1975లో ప్రవేశపెట్టిన బవిస్టిన్ భారతీయ వ్యవసాయంలో అత్యంత నమ్మకమైన, అనుభవపూర్వకమైన అంతర్వాహక శిలీంధ్రనాశిని గ స్థిరపడింది. దీని వ్యాప్తి గల నిరోధక, చికిత్సా లక్షణాలు పంటల ఎదుగుదలలో అన్ని దశలలో ఫంగల్ వ్యాధుల నుండి రక్షణను అందించాయి. ఇది భారత రైతుకు అనుకూలమైన నమ్మకమైన సహాయకుడిగా ఎదిగింది. బవిస్టిన్ అంతర్వాహక లక్షణం కారణంగా, ఇందులోని యాక్టివ్ పదార్థం మొక్కలో అంతటా వ్యాపించి, ప్రతి పెరుగుతున్న భాగాన్ని రక్షిస్తుంది. దీని స్థిరమైన పనితీరు మరియు నమ్మకమైన ఫలితాలు దశాబ్దాలుగా దీన్ని కేవలం ఉత్పత్తిగా కాకుండా ఒక బ్రాండ్ వారసత్వంగా మార్చాయి. ఇది క్రిస్టల్ "రక్షణ, లాభదాయకత" వాగ్దానాన్ని ప్రతిబింబిస్తుందని క్రిస్టల్ మేనేజింగ్ డైరెక్టర్ అంకుర్ అగర్వాల్ తెలిపారు.

మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ, కృషి కాలనీ, పుష్పా గిరి, బస్తీ సాయి బాబా నగర్, పాండు బస్తీ, శివాజీ, శివాలయనగర్, అల్లూరి సీత రామ రాజు నగర్, వివేకా కాలనీ, తదితర బస్తిలలో మంజీరా నీరు సరిగా రాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడటం చూసి వారితో కలిసి మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి జీవిఎమ్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ రాజోలో రోజుల్లో రెండు రోజులకొకసారి మంజీరా నీళ్లు వదలకపోతే కుత్బుల్లాపూర్ ప్రజలతో కలిసి వాటర్ వర్క్స్ ఎమ్ డి ఆఫీస్ ఖైరతాబాద్ ముందు ధర్నా నిర్వహి స్తామన్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, మహిళా అధ్యక్షురాలు మంజు, అనిత, తార సింగ్, కిషన్‌లాల్, సత్యనారాయణ గౌడ్, కిషోర్, రాజు గౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమ వారం నిర్వహించే ప్రజావాణిలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదు లపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (82) ఫిర్యాదు లు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులుగా శివకుమార్ గౌడ్

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : మొయినాబాద్‌లో జరిగిన రంగారెడ్డి జిల్లా 17వ మహాసభలలో తుర్కయం జాల్ మున్సిపాలిటీకి చెందిన నాయకు లకు జిల్లా కౌన్సిల్లో కార్యవర్గంలో చోటు దక్కించుకున్నారు. విద్యార్థి యువజన సంఘాలలో క్రియాశీలకంగా పని చేస్తున్న పి.శివకుమార్ గౌడ్‌ను సిపిఐ జిల్లా కార్యవర్గంలోకి తీసుకోవడం జరిగింది. ప్రస్తుతం తుర్కయంజల మున్సిపాలిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న కాటంరాజును ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్న మన్నెగూడ ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్‌ను సిపిఐ జిల్లా సమితి సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన పి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికై నిరంతరం పనిచేస్తామని, మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకై పోరాడుతామని, విద్యార్థి, యువజన ఉద్యోగుల హక్కుల సంరక్షణ కోసం పాటుపడతామని వారు అన్నారు. 23 మందితో ఏర్పడిన జిల్లా కార్యవర్గం, 65 మందితో ఏర్పడిన జిల్లా కౌన్సిల్లో తుర్కయంజాల్ మున్సిపాలిటీ నాయకులకు చోటు దక్కడం పై రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకత్వానికి అభినందనలు తెలియజేశారు.

9న యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025

విశాలాంధ్ర - హైదరాబాద్ : సినిమా ఫ్యాషన్ ప్రపంచాలను ఒకచోట చేర్చి, వినోద పరిశ్రమలో శైలి ప్రభావాన్ని నిర్వచించే లక్ష్యంతో ఫిల్మ్‌ఫేర్, యూజెనిక్స్ ఆధ్వర్యంలో ఆగస్టు 9వ తేదీన ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 ను నిర్వహించను న్నట్టు జేఈఎస్ఎల్, బీసీసీఎల్ టీవీ, డిజిటల్ నెట్వర్క్ డైరెక్టర్ రోహిత్ గోపాకుమార్ తెలిపారు. హైదరాబాదు బంజారాహిల్స్ హెూటల్ రెసిడెన్స్ పార్క్ హయత్‌లో జరగనుంది అన్నారు. ముంబైలో పలుమార్లు విజయవంతంగా నిర్వహించామని, ఇటీవల కాలంలో నిర్వహించిన ఫిలింఫేర్ పశ్చిమ బెంగాల్‌లో విజయవంతమైన తరువాత, ఫిల్మ్‌ఫేర్ యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ & స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 ను హైదరాబాదులో చేస్తున్నామన్నారు. దీంతో భారతదేశంలోని దక్షిణ ప్రాంతంలో నిర్వహిస్తున్న వేడుకగా చెప్పారు. యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ సమర్పించిన ప్రారంభ ఈ మొట్టమొదటి సదరన్ ఎడిషన్ దక్షిణ భారత సినిమాలో శైలి, చక్కదనం ఫ్యాషన్‌ను గౌరవిస్తుందన్నారు. "ఫిల్మ్‌ఫేర్ ఎంతో ఇష్టపడే గ్లామర్ & స్టైల్ అవార్డులను సౌత్‌కు మొదటిసారిగా, యుజెనిక్స్ హెయిర్ సైన్సెస్ భాగస్వామ్యంతో తీసుకు వచ్చామన్నారు. ఫిలింఫేర్ హెడ్ జితేష్ పిళ్ళై మాట్లాడుతూ యూజెనిక్స్ తో కలిసి, ఫిల్మ్‌ఫేర్ గ్లామర్‌ను నిజంగా ప్రతిబింబించే ప్రదర్శనను అందించడానికి తాము ఎదురుచూస్తున్నామన్నారు. యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ చైర్మన్, వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రదీప్ సేతి మాట్లాడు తూ కళాత్మకత మరియు ఆవిష్కరణల ద్వారా జుట్టు పునరుద్ధరణలో గ్లోబల్ స్టాండర్డ్స్‌ను ఏర్పాటు చేశామని, ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025తో సమలేఖనం చేయడం మైలురాయిగా నిలుస్తుంది అన్నారు. హైదరాబాద్‌లో సినిమాటిక్ స్టైల్ ఎక్సలెన్స్ ఈ తొలి ప్రదర్శన గ్లామర్ అండ్ స్టైల్ అవార్డులతో భాగస్వామ్యం, ఇప్పుడు దక్షిణ భారతదేశంలో గొప్ప అరంగేట్రం చేస్తున్నామని చెప్పారు.

ఉప్పల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

విశాలాంధ్ర - కాప్రా : ఉప్పల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో చిన్నపాటి వర్షం తో రోడ్లన్నీ జలమయం అవుతున్నా యని స్థానికులు ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్ పన్నల దేవేందర్ రెడ్డి దృష్టికి తేవడంతో గ్రీన్ హిల్స్ కాలనీ వాసులకు శాశ్వత పరిష్కారంగా దిశగా చర్యలు చేపడుతూ 48 లక్షల రూపాయలతో ఆర్ సి సి భూగర్భ డ్రైనేజి పైప్ లైను పనులకు, బాక్స్ డ్రైన్ రిటైనింగ్ వాల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి, కాప్రా సర్కిల్ ఇంజినీరింగ్ డి ఈ రూపా, ఏఈ శ్రవంతి, స్థానిక కాలనీ వాసులు కొత్త మల్లారెడ్డి, రంగా రెడ్డి, కుంటి కృష్ణ, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, దయాకర్ రెడ్డి, అల్లాడి కృష్ణ, ఉస్మాన్, విశ్వరూప, చారి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

విశాలాంధ్ర - మొయినాబాద్: సిపిఐ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా 17వ మహాసభలు మొయినాబాద్ మండల కేంద్రంలో ఈ నెల 2వ తేదీన జరిగిన సభలో చేవెళ్ల నుంచి జిల్లా కౌన్సిల్ సభ్యులుగా తనకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. రామస్వామి, ప్రభు లింగం లకు కృతజ్ఞతలు తెలిపారు. సిపిఐ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఛాయ శక్తులకు కృషి చేస్తానన్నారు.

ఫలించిన సీతక్క పోరాటం..

విశాలాంధ్ర - హైదరాబాద్ : ములుగు జిల్లాలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క దీర్ఘకాలంగా చేస్తున్న పోరాటానికి ఫలితంగా, తెలంగాణ రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డు 9వ సమావేశంలో ములుగు ఏజెన్సీ ప్రాంతానికి సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అధ్యక్షతన, స్పెషల్ ఇన్వైటీగా మంత్రి సీతక్క నేతృత్వంలో బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి, వైల్డ్ లైఫ్ ప్రాంతాల గుండా రోడ్లు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్, సబ్‌స్టేషన్ల నిర్మా ణం, స్టాండింగ్ కమిటీ ఏర్పాటు వంటి అనేక అంశాలపై చర్చ జరిగింది. అలాగే మహబూబా బాద్ జిల్లా పాకాల కొత్తగూడెం గ్రామంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన 0.80 హెక్టార్ల అటవీ భూమిని బదిలీ చేయడంపై నిర్ణయం తీసుకున్నారు. మంత్రి సీతక్క దీర్ఘకా లంగా చేస్తున్న పోరాటం ఫలితంగా ములుగు ఏజెన్సీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వైల్డ్ లైఫ్ బోర్డు అనుమతులిచ్చింది. మంత్రి సీతక్క ప్రతిపాదనలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సీతక్క చొరవతో ఏజెన్సీ గ్రామాల్లో 10 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న రహదారుల సమస్యలకు ముగింపు లభించింది. సోమవారం జరిగిన తెలంగాణ వైల్డ్ లైఫ్ బోర్డు 9వ సమావేశం ఎట్టకెలకు ఆయా గ్రామాల రహదారుల నిర్మాణానికి అంగీకరించింది. మంత్రి సీతక్క ప్రతిపాదించిన ఆయా గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. అలాగే పాకాల కొత్తగూడెంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి క్లియరెన్స్ లభించింది. తాడ్వాయి, ఏటూరు నాగారం ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధి కోసం ప్రత్యేక సఫారీ వాహనాలపై బోర్డు అనుమతులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "అడవులతో ఆదివాసీల జీవితం అనుసంధానమై ఉంది. అటవి చట్టాలు రాక ముందే వారంతా అడవిలోనే నివసిస్తున్నారు. వారి అభివృద్ధికి చట్టాలు అడ్డుకాకూడదు. అటవీ భూమి పేరుతో ఆదివాసీలకు ఇబ్బందులు కలిగించకూడదు. మా ప్రాంతాల్లో రహదారులు లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదు" అని స్పష్టం చేశారు. పోడు రైతుల అభ్యంతరాలు తెలుసుకునేందుకు జిల్లా ఫారెస్ట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి సీతక్క ప్రతిపాదనల పట్ల తెలంగాణ వైల్డ్ లైఫ్ బోర్డు సానుకూలంగా స్పందించింది. ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మురళి నాయక్, వెడ్మ బొజ్జు పటేల్, రాందాస్ నాయక్‌లు పాల్గొన్నారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ సువర్ణతోపాటు పలువురు అధికారులు కూడా హాజరయ్యారు.

మందులు ఇచ్చే ముందు డేట్ చూసి ఇవ్వాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : వంద మందిరోగులకు ఎక్స్పైరీ డేట్ చూసి జాగ్రత్తగా ఇచ్చి, అందులో ఒక్కరికి డేట్ చూడకుండా ఇస్తే వంద మంది రోగులకు చేసిన వైద్యం కనిపించకుండా పోతుందని, ఫార్మసి సిబ్బంది ఎప్పటికప్పుడు మెడిసిన్ ఎక్స్పైరీ డేట్ చెక్ చేస్తూ, ఆన్‌లైన్‌లోనే కాకుండా మ్యానువల్‌గా రిజిష్టర్లను కూడా నిర్వహిస్తూ, అప్రమత్తంగా ఉంటూ పేషంట్లకు మందులు పంపిణీ చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం ఘట్కేసర్ మండలంలోని ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎఎన్‌సి ఎన్ని కేసులు మిస్ అవుతున్నాయని, పరీక్షలకు రానివారిని ఏవిధంగా గుర్తిస్తున్నారని గైనకాలజిస్టు డాక్టరును అడిగి తెలుసుకున్నారు. ఎఎన్ సి పరీక్షలకురాని వారిని గుర్తించి ఆశావర్కర్లు, ఎఎంసిల ద్వారా వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని కలెక్టరు తెలిపారు. ప్రతి నెల ఎన్ని కేసులు సి సెక్షన్ అవుతున్నాయని, సి సెక్షన్ వరకు వెళ్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేలా పేషంట్లకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఇన్ పేషంట్లుగా ఉన్న చిన్నారులతో ఏమైంది ఇప్పుడు ఎలా ఉంది, ఎం చదువుతున్నారు , జ్వరం తగ్గిపోతుంది అని కలెక్టరు మాట్లాడారు. ఎస్సెన్షియల్ మెడిసిన్ ఇన్డెంట్‌ను పరిశీలించి, మందులు ఎలా తెప్పిస్తున్నారని అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ల్యాబరేటరీని పరిశీలించిరోజుకు ఎన్ని పరీక్షలు చేస్తున్నారని, ఇక్కడ లేని పరీక్షలు ఎక్కడ చేయిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎక్స్ రే విభాగాన్ని పరిశీలించి డిజిటల్ ఎక్స్ రే ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఫోటోగ్రఫి మిషిన్స్ ను పరిశీలించి 5 మిషిన్లు సరిపోతున్నాయా అని కలెక్టరు అడుగగా, సరిపోతున్నాయని మెడికల్ ఆఫీసర్ సమాధానమిచ్చారు. కలెక్టర్ ఆసుపత్రి మొత్తం కలియ తిరిగి పరిశీలించి, అవసరమైన వైద్య పరికరాలకు, మరమ్మత్తులకు ఎస్టిమేషన్స్ వేసి తనకు పంపాలని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉందని, జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను పటిష్టంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ తహసీల్దారు రజని, మెడికల్ ఆఫీసర్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ సర్కిల్లో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేసే బిల్ కలెక్టర్లు పన్ను వసూల్ కోసం వెళ్తున్న క్రమం లో కొంతమంది అధికారుల వల్ల బిల్ కలెక్టర్లు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్న పరిస్థితి. ఆయా సర్కిళ్లలో పని చేసే కొంతమంది ఉప కమిషనర్, టాక్స్ ఇన్స్పెక్టర్లు పూర్తిగా అవినీతికి మరిగి వ్యాపార సముదాయాలకు నివాస సముదాయం కింద పన్నులు విధిస్తూ జిహెచ్ఎంసికి ద్రోహం చేస్తున్న పరిస్థితి నెలకొంటుంది. ఇటీవల సరూర్ నగర్ సర్కిల్లో ఓ బిల్ కలెక్టర్ తనకు జరిగిన అన్యాయంపై కమిషనర్ కే చెప్పుకునే ప్రయత్నం చేశారు. దీనిలో భాగంగా తనకు జరిగిన అన్యాయాన్ని ప్రజావాణిలో జోనల్ కమిషనర్ కు దృష్టికి తీసుకెళ్లి పలు సమస్యలను ఆయన తెలియజేశారు. దీనిపై జోనల్ కమిషనర్ సైతం గతంలో వ్యాపార సముదాయం నివాస సముదా యం కింద పన్నులు విధిస్తే సస్పెండ్ చేస్తాననే విషయాన్ని గుర్తు చేయగా అవునని తాను విచారించి చర్యలు తీసుకుంటారని బిల్ కలెక్టర్ శ్రీశైలం యాదవ్ కు హామీ ఇచినట్లు తెలిసింది. తన పరిధిలోని వ్యాపార సముదాయాల వివరాలను జోనల్ కమిషనర్ కు అందజేసినట్లు తెలిసింది. వీటిపై విచారించి సర్కిల్ అధికారులపై తక్షణ చర్యలు సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతుంది. అధికారులు తన సంస్థ ఆదాయ మార్గాలను చూపించి సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాల్సింది పోయి తమ జేబులు నింపుకోవడానికే అధిక ప్రాధాన్యతను ఇస్తున్నటువంటి పరిస్థితి జిహెచ్ఎంసిలో నెలకొంటుంది. ఇలాంటి అధికారులపై ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టినట్లయితే అవినీతి అధికారుల వల్ల జిహెచ్ఎంసికి జరిగే నష్టాన్ని కొంతమేరకైనా తగ్గించవచ్చని అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

రైతులకు ఎరువుల కొరత సృష్టించొద్దు



విశాలాంధ్ర - మొయినాబాద్ : రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ఎరువుల దుకాణాల యజమానులకు మండల వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మండలంలోని వివిధ ఎరువుల షాపును తనిఖీ చేశారు. యూరియా 71.865 మెట్రిక్ టన్నులు, డి.ఏ.పీ 15 టన్నులు, ఎస్.ఎస్.పీ 18.1 టన్నులు, ఎం.ఓ.పి 5.8 టన్నులు, కాంప్లెక్స్ 65.6 టన్నులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులకు కావాల్సిన ఎరువులు నాలుగు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. యూరియా అందుబాటులో లేకా పోయిన కొద్ది సమయంలో అందిస్తామని తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకూడదని సూచించారు. ఎరువులు కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని ఎరువుల షాపుల యజమానులను కోరారు.

గాయని ప్రసన్న ఆరోహికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

విశాలాంధ్ర - బషీర్ బాగ్: తెలంగాణ సాంస్కృతిని యువతరంలో అవగాహన కల్పించడానికి, పరిరక్షించ డానికి సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని తెలంగాణ శాసన మండలి సభ్యులు, తెలంగాణ మొదటి శాసన మాజీ సభాపతి మధుసూదనాచారి అన్నారు. సోమవారం కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్లో గాయని ప్రసన్న ఆరోహి నిర్విరామంగా 12 గంటల పాటు ఆగకుండా తెలుగు, తమిళం, కన్నడ భాషలలో సినీ పాటలను పాడినందుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డులు స్థానం లభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మానసిక ఉల్లాసం ఉత్సాహం కై పాత సినీ పాటలు ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ సౌజన్య సౌజన్యంతో ప్రసన్న ఆరోహి మ్యూజికల్ ఆర్ట్స్, కల్చరల్ సొసైటీ ఆధ్వర్యం లో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించినందుకు సమన్వయకర్త బింగి నరేంద్ర గౌడ్ ప్రశంసా పత్రం, గోల్డ్ మెడల్ ప్రసన్నకు అందజేశారు. అమెరికా పర్యట పర్యటనలో ఉన్న తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ ఈ సందర్భంగా గాయని ప్రసన్నకు ఒక సందేశం పంపుతూ అభినందనలు తెలిపారు. ప్రముఖ సంఘ సేవకులు ఇంచార్జ్ లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అభయ బంజారా క్లబ్ 320 ఏ ఇంచార్జి డాక్టర్ కటకం భాస్కర్, కోఆర్డినేటర్ శ్రీ బత్తుల హేమంత్, జి వేణుగోపాల్, విజయ్, బాబు, శ్రీనివాస్ గాయని ప్రసన్నకు శాలువా పూలమాలతో సన్మానించి అభినందించారు.

వరద నీటి ప్రాంతాల్లో పర్యటించిన కార్పొరేటర్

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: కురిసిన భారీ వర్షానికి 124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ఉషముళ్ళపూడి ప్రధాన రహదారిలో వరదనీరు రోడ్డు మీద ప్రవహించడంతో వాహనదారులకు ఇబ్బంది అవుతుందన్న విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటం దొడ్ల వెంకటేష్ గౌడ్ హుటాహుటిన అక్కడకు చేరుకుని జీహెచ్ఎంసీ, మన్సూన్ సిబ్బందికి సమాచారం అందించి వెంటనే వరదనీటిని క్లియర్ చేసి ట్రాఫిక్ నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రదానరహదారి కావడంతో వాహనదారులకు ఇబ్బంది కలగకుం డా, ట్రాఫిక్ నిలిచిపోకుండా వరదనీటిని క్లియర్ చేయడం జరుగు తుందని అన్నారు. అకాల వర్షాలతో ఎటువంటి ఇబ్బందులు కలిగిన, వంటి సమస్యలు ఎదురైన, వెంటనే సంబం ధిత అధికారులకు గాని, మాకు గాని, మా కార్యాలయంకు గాని సంప్రదించాలని తెలియచేసారు. అదేవిధంగా వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, జీహెచ్ ఎంసీ అధికారులు, మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్, డిజాస్టర్ మేనేజ్మెం ట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎటువంటి ఇబ్బంది లేకుండ చూడాలని తెలియచేసారు.

అన్ని కాలనీలకు మిషన్ భగీరథ నీరు అందేలా చూడాలి

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలకు మిషన్ భగీరథ నీరు అందే విధంగా చూడాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సునీత రెడ్డి సమక్షంలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరాపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి మున్సిపల్ సిబ్బంది మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు హాజరయ్యారు. ఇటీవల అనేక కాలనీలలో ఎమ్మెల్యే పర్యటించిన సందర్భంగా మహిళలు స్థానికులు పెద్ద ఎత్తున మిషన్ భగీరథ మంచినీటి సరఫరా పట్ల కొన్ని సమస్యలు తన దృష్టికి తెచ్చారని వాటిని వెంటనే పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. సమస్యలు చిన్నవిగా ఉన్నప్పుడే వాటిని గుర్తించి పరిష్కరి స్తే ఎలాంటి ఇబ్బందులు ఏర్పడవని అన్నారు. ఆయా కాలనీలకు మంచినీటి సరఫరా అందించే విషయంలో అధికారులు ఎక్కడ అలసత్వం ప్రదర్శించకూడదని అన్నారు. పట్టణంలోని పరిగి రోడ్డులో డివైడర్ ఏర్పాటు వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని అదే విధంగా విద్యుత్ కాంతులకు అనుగుణంగా ఆ ప్రాంతాన్ని ముస్తాబు చేయాల్సిన అవసరం ఉందన్నారు.మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మత్తు మందు సేవిస్తున్న వ్యక్తికి రిమాండ్

విశాలాంధ్ర - మేడిపల్లి: మత్తు సేవిస్తున్న వ్యక్తి రిమాండ్‌కు తరలించిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మత్తు సేవిస్తున్న వ్యక్తిని మేడిపల్లి పోలీసులు విసిబుల్ పోలీస్‌లో భాగంగా ఫుడ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించ దంతో అట్టి వ్యక్తిని తనిఖీ చేయగా అతని దగ్గర 80 గ్రాముల పాపి స్ట్రా పౌడర్ లభించింది. అట్టి వ్యక్తిని విచారించగా అతని పేరు కమల్ కిషోర్ (22) సొంత ఊరు రాజస్థాన్ నుండి వచ్చి చెంగిచెర్లలో నివాసం ఉంటూ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. పని భారం ఎక్కువగా ఉండడంతో తాను మత్తుకి బానిసగా మారాను అని ఒప్పుకున్నాడు. అది సేవించడం వలన నిద్ర బాగా వస్తుందని తెలిపినాడు. ఇటీవల కాలంలో సొంత రాష్ట్రమైన రాజస్థాన్ కు వెళ్లి అక్కడ తెలిసిన వ్యక్తుల ద్వారా కొంత మొత్తం పాపిస్ట్ర పౌడర్‌ను ఖరీదు చేసుకొని తిరిగి హైదరాబాదుకు వచ్చినాడు అవసరం ఉన్నప్పుడు దాని సేవిస్తూ తాను రిలీఫ్ పొందుతున్నాడు అని ఒప్పుకున్నాడు. ప్రతి వ్యక్తిపై మేడిపల్లి పోలీస్‌లు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

పోరాట యోధుడు గురూజీ

శిబు సోరెన్ మృతిపై సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర సాధనలోనూ... గిరిజన సమస్యల పరిష్కారంలోనూ మడమ తిప్పని పోరాటం చేసిన యోధుడు గురూజీ శిబు సోరెన్ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ మృతిపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వడ్డీ వ్యాపారుల ఆగడాలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరులోనూ శిబు సోరెన్ తనదైన ముద్ర వేశారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు శిబుసోరెన్ ఎప్పుడూ మద్దతు తెలిపేవారని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైతం చివరి వరకు ఆయన మద్దతుదారుగా నిలిచిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఆదివాసీ సమాజానికి గురూజీ చేసిన సేవలు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని సీఎం తెలిపారు. ఎనిమిది సార్లు లోక్‌సభ ఎంపీగా, రెండు సార్లు రాజ్యసభ సభ్యునిగా, జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు అందించారని తెలిపారు. శిబు సోరెన్ కుమారుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సానుభూతి తెలియజేశారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కొలను శంకుస్థాపన

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31,33 వ డివిజన్ లో సీసీ రోడ్ పూర్తిగా పాడువటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ గత నెల నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా వారి సమస్యపై వెంటనే స్పందించి కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి మంజూరు చేయించారు. సోమవారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో కొలన్ హన్మంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు కొలను హన్మంత్ రెడ్డి, కొలను శ్రీనివాస్ రెడ్డిని శాలువాలతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, బీసీ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, 33వ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, 31వ డివిజన్ అధ్యక్షులు పితాని శ్రీనివాసరావు, నరసింహారావు, రాంచందర్ నాయక్, దాల్ నాయుడు, ఆటో శ్రీను, గౌస్ బాయ్, భుజంగ రెడ్డి, రాయుడు, వెంకట్ రెడ్డి, సరితా రెడ్డి. రాధా జ్యోతి, ధనలక్ష్మి, నవ్య బేకరీ, సత్యవతి, చిరంజీవి, ఈశ్వర్, రాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు త్వరలో జిల్లాల పర్యటన



విశాలాంధ్ర, బషీర్ బాగ్ : అగర్వాల్ సమాజ్ సభ్యుల సభ్యత్వ నమోదు కోసం త్వరలో తెలంగాణలోని జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నట్లు అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా వెల్లడించారు. హైదరాబాద్ బషీర్ బాగ్ రాఘవ రత్న టవర్‌లో ఉన్న అగర్వాల్ సమాజ్ మీటింగ్ హాల్‌లో అగర్వాల్ సమాజ్ కమిటీ సభ్యుల కార్య నిర్వాహక కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల్లో విడతల వారీగా పర్యటించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడతామని పేర్కొన్నారు. అగర్వాల్ సమాజ్ భవిష్యత్ ప్రణాళికల గురించి తెలిపి సభ్యత్వ ప్రచారాన్ని పెంచాల్సిన అవసరాన్ని ఈ సమావేశంలో ఆయన వివరించారు. ఈ సమావేశంలో సభ్యత్వ రుసుమును ఒక సంవత్సరానికి రూ. 350 నుండి రెండు సంవత్సరాలకు రూ. 21కి తగ్గించడంపై చర్చ జరిపారు. కుటుంబంలో 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి సభ్యత్వం తప్పనిసరి చేయడం, 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారికి ఉచితంగా సభ్యత్వం కల్పించడం వంటి సమస్యలపై చర్చ జరిగింది. అనంతరం అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ ప్రారంభంపై చర్చించారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలి

విశాలాంధ్ర - ఆమనగల్లు : 42 శాతం బీసీ రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదిం చాలని, ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను పెద్ద ఎత్తున బిసి సామాజికవర్గం హాజరై విజయవంతం చేయాలని సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు. కడ్తల్ మండల కేంద్రంలో స్థానిక యంబిఎ గార్డెన్‌లో పార్టీ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశం శివగల రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య కార్యదర్శి వర్గ సభ్యులు కందుకూరి జగన్ హాజరై మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చినప్పటికీ కేంద్ర బిజెపి ప్రభుత్వం అట్టి బీసీ రిజర్వేషన్లు అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని తక్షణమే బీసీ రిజర్వేషన్లు ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసి సామాజిక వర్గాన్ని ఏకం చేసి భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాదులు హిందూ ముస్లింల పోరాటంగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరించే పోరాటం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపైన సెప్టెంబర్ 1 నుంచి 17 వరకు జిల్లా వ్యాప్తంగా సభలు సదస్సులు సంస్కృతిక కార్యక్రమాలు బైకు యాత్ర వంటి కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఘనతను ఇంటింటికి తెలిపాలని పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ అమనగల్లు ఏరియా కన్వీనర్ పిప్పల శివశంకర్ నాయకులు గుమ్మడి కురుమయ్య జల్లెల పెంటయ్య శివగల రమేష్ తొగరి పోచయ్య నరసింహ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించిన మాజీ మేయర్



విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను మాజీ మేయర్ అమర్ సింగ్ సోమవారం ఉదయం సీనియర్ నాయకులు బండి సతీష్ గౌడ్, బండి శ్రీరాములు, గణేశ్, కృష్ణ, స్థానిక కాలనీ వాసులతో కలిసి పనులను పరిశీలిం చారు. మాజీ మేయర్ అమర్‌సింగ్ పనుల స్థలాన్ని సందర్శించి, జరుగుతున్న పనులను పరిశీలించారు. అధికారులకు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను సమయానికే పూర్తి చేయాలని సూచించారు. ఈ డ్రైనేజ్ వ్యవస్థ త్వరగా పూర్తయితే స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

ఉప్పర్‌పల్లి ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్లే పాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు మెడల్స్ పంపిణీ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాలుగొని విద్యార్థులకు ఫౌండేషన్ సభ్యులతో కలిసి బ్యాగులు చదువులో మంచి మార్కులు పొందిన విద్యార్థులకు మేడల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసిన ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ప్రతి ఒక్కరు సేవ చేయడం అలవాటు చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు మంచిగా చదివి తల్లితండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకొని రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఉపాధ్యాయులు విద్యార్థులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వర్గ పోరాటాల ఘన చరిత్ర సీపీఐదే

- వందేళ్ల ఎర్రజెండా భవిష్యత్ తరాలకు దిక్సూచి
- మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్
- ప్రజా చైతన్యంలో కీలక భూమిక కమ్యూనిస్టులదే: పి.హరినాథ్ రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: సీపీఐ వర్గ పోరాటాల ఘనమైన చరిత్ర కలిగిన పార్టీ అని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. సీపీఐ తిరుపతి జిల్లా ప్రతినిధుల మహాసభలు సోమవారం సూళ్లూరుపేట సత్యసాయి కళ్యాణ మండపంలో చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, బండి చలపతి, నదియా అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరయిన జల్లి విల్సన్ మాట్లాడుతూ సీపీఐ స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్ ముష్కరులకు వ్యతిరేకంగా పోరాడిందని, అనంతరం కార్మిక కర్షకుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తోందని తెలిపారు. మోదీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని, ఆర్ఎస్ఎస్ ఆదేశాలతో మోదీ దేశాన్ని పాలిస్తున్నాడని అన్నారు. ఒకే దేశం... ఒకే భాష... ఒకే మతం అనే నినాదంతో మత కలహాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందుతున్నారని మండిపడ్డారు. అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి గిరిజనుల కడుపులు కొడుతున్నారని అన్నారు. రామజన్మ భూమి విషయంలో న్యాయ వ్యవస్థను ప్రభావితం చేసి హిందువులకు అనుకూలంగా తీర్పు ఇప్పించారని తెలిపారు. అనంతరం అదే జడ్జికి రాజ్యసభ పదవి కట్టబెట్టడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. హిందువులకు అనుకూలంగా ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలు పని చేస్తుంటే పవన్ కల్యాణ్ లాంటి వారు సనాతన ధర్మాన్ని భుజానికి ఎత్తుకోవడం శోచనీయమని విమర్శించారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొస్తే దేశ వ్యాప్తంగా మహోద్యమం వచ్చి తిప్పికొట్టడం జరిగిందన్నారు. ట్రంప్‌నకు మోదీ భయపడి అమెరికా అధ్యక్షుడు చెప్పిన పనులు చేస్తున్నారని తెలిపారు. భారత్-పాక్ మధ్య ఎప్పుడు ఘర్షణ వచ్చినా స్వతంత్ర నిర్ణయాలు ఉండేవని... మోదీ వచ్చాక అమెరికా జోక్యం పెరిగిందన్నారు. దేశంలో అన్ని రంగాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, జగన్ స్వయం కృపరాధంతో ఇంటికి వెళ్లాడని చెప్పారు. కూటమి ప్రభుత్వం వస్తే అభివృద్ధి పరుగులు పెట్టిస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు చేయలేనని తప్పించుకుంటున్నాడని అన్నారు. ఒకప్పుడు వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ ఇవ్వాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తే, నేడు స్మార్ట్ మీటర్ల పేరుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగుల కొట్టాలని చెప్పిన నారా లోకేశ్ నేడు బిగించండి అని చెప్పడం శోచనీయమని అన్నారు. అమరావతి అభివృద్ధి పేరుతో లక్ష ఎకరాల భూమి సేకరించాలని చంద్రబాబు టార్గెట్‌గా పెట్టుకున్నారని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాలపై భవిష్యత్‌లో వామపక్ష, లౌకిక పార్టీలను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు.

హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేయడంలో కీలక భూమిక కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. వంద సంవత్సరాలలో దేశంలో అధికారంలోకి రాకపోయినా ప్రజలపక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు సాగించిందని తెలిపారు. దేశంలో ఆకలి, అణచి వేత, దోపిడి ఉన్నంత వరకు కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతం సజీవమైందని, ఆ విషయం వర్గ శత్రువులకు తెలుసన్నారు. బ్యాంకుల జాతీయీకరణ కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడటంతో ఆ వ్యవస్థ బలపడటంతో పాటు సామాన్యుడి ఆర్థిక స్థితి మెరుగుపడిందని తెలిపారు. దళితులకు భూములు ఉండాలని భూ పోరాటాలు చేసిందన్నారు. బీజేపీ దేశాన్ని అభివృద్ధి చేయకపోయినా ప్రజల దృష్టి మరల్చే పనులు చేస్తోందన్నారు. దేశ భద్రతకే ప్రమాదం ఏర్పడిందనడానికి పహల్గాం దాడి ఘటనే ఉదాహరణ అని అన్నారు. ట్రంప్ నేను చెబితే యుద్ధం ఆగిపోయిందంటున్నాడని, అంటే మోదీ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్య విధానాలకు దాసోహం అయిపోయిందన్నారు. అమెరికాలోనే తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న ట్రంప్ మన దేశాన్ని శాసించడం ఏమిటని ప్రశ్నించారు. టీటీడీలో అన్యమతస్థులు ఉన్నారని చెబుతున్న బీజేపీ నేతలు... ముస్లిం కమిటీలో హిందువులు ఎందుకు ఉన్నారో సమాధానం చెప్పాలన్నారు. జగన్ ప్రభుత్వానికి కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం కొనసాగుతోందే తప్ప కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి చంద్రబాబు నాయుడు ఎందుకు గొడవ చేయడం లేదని ప్రశ్నించారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకపోగా బనకచర్ల ప్రాజెక్టును తెర మీదకు తీసుకువచ్చారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే అవినీతి విపరీతంగా పెరిగిందని, దీనిపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు రాజకీయ చైతన్యం పెంచుకోవాలని కోరారు. మహాసభల ప్రారంభ సూచికగా సీపీఐ సీనియర్ నాయకులు పార్థసారథి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గం స్టీరింగ్ కమిటీగా వ్యవహరించింది. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, శివారెడ్డి, జయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పాల్గొని ప్రసంగించారు.

కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

రామకృష్ణ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కళాకారుల్ని ప్రభుత్వం ప్రోత్సహించాలని, 'మట్టి మనిషి' వంటి నాటికలను ప్రజలు ఆదరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. విజయవాడ ఎంబీ విజ్ఞాన భవనంలో రెండు రోజుల పాటు ప్రదర్శించిన అభ్యుదయ రచయితల సంఘం వారి కళాతోరణం 'మట్టి మనిషి' నాటిక ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. రామకృష్ణతోపాటు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వీక్షించారు. అనంతరం అభినందన సభలో 50 మంది కళాకారులు, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్, దర్శకులు ఎస్ఎం బాషా, సాంకేతిక నిపుణులను రామకృష్ణ సత్కరించారు. 'రచయిత సామాజిక అంశాలను తన మనసుకు నచ్చిన విధంగా మలుచుకుంటూ ఒక కథను, సాహిత్యాన్ని రచించడం ఒక ఎత్తైతే దాన్ని నాటికగా ప్రదర్శించడం, 50 మంది ఒకే వేదిక మీదకు రావడం సాహసోపేతం' అని రామకృష్ణ అన్నారు. 'మట్టి మనిషి' నాటిక బృందానికి చెందిన విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పి.లక్ష్మణరావు, కో-కన్వీనర్ గోలి సీతారామయ్య, గోలి మధు బృందాన్ని సత్కరించారు. కార్యక్రమంలో జయప్రకాష్, అరసం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్, కార్యదర్శి మోతుకూరి అరుణకుమార్, ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్, ఎక్స్‌రే ఆంజనేయరాజు పాల్గొన్నారు.

శిబూ సోరెన్ మృతి బాధాకరం: సీపీఐ

న్యూఢిల్లీ: దేశంలోని గొప్ప గిరిజన నాయకుడ్ని కోల్పోయిందని, జార్ఖండ్ రాజకీయ దిగ్గజం శిబు సోరెన్ మరణం బాధాకరమని సీపీఐ సంతాపం ప్రకటించింది. ఆయనను గిరిజన హక్కులు, సామాజిక న్యాయం చాంపియన్‌గా శ్లాఘించింది. జార్ఖండ్ గుర్తింపు, రాజకీయ ఎదుగుదలలో శిబు సోరన్ పాత్ర కీలకమని, అణగారిన వర్గాల గళాన్ని వినిపించడంలోనూ ఆయన ప్రముఖంగా వ్యవహరించాంటూ సోమవారం ఒక ప్రకటనలో సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం పేర్కొంది. 'శిబు సోరెన్... సీపీఐ నాయకుడు వినోద్ బిహారీ మహతో, మార్క్సిస్టు నాయకుడు ఏకే రాయ్‌తో కలిసి జార్ఖండ్ ముక్తీ మోర్చాను స్థాపించారు. ఇది గిరిజనుల హక్కులు, గుర్తింపు సాధన కోసం పోరాట మాధ్యమంగా మారింది. ఆదివాసీలకు ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాటం, జార్ఖండ్ రాజకీయ ఆవిర్భావానికి శిబు సోరెన్ గణనీయమైన తోడ్పాటు అందించారు. ఆయనను జార్ఖండ్ మరువలేదు.ఎప్పటికీ గౌరవిస్తుంది' అని సీపీఐ పేర్కొంది. శిబు సోరెన్ భార్య రూపి సోరెన్, కుమారులు హేమంత్ సోరెన్, బసంత్ సోరెన్, కుమార్తె అంజలి సోరెన్, కోడలు కల్పనా సోరెన్‌తో పాటు జార్ఖండ్ ముక్తీ మోర్చా నాయకత్వం, కేడర్‌తో పాటు ఆయనకు ఆత్మీయులు, శ్రేయోభిలాషులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది.

రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం

- ట్రాన్స్‌జెండర్లుకూ అనుమతి
- 15 నుంచి శ్రీకారం: మంత్రి మండిపల్లి

విశాలాంధ్ర - సచివాలయం: "సూపర్ సిక్స్" హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఈ నెల 15వ తేదీ నుంచి అమలుకు శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయ ప్రచార విభాగంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎటువంటి లోటుపాట్లు, విమర్శలకు అవకాశం లేకుండా రాష్ట్రంలో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినట్టు చెప్పారు. కర్నాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల్లో అమలు తీరును పరిశీలించేందుకు ముగ్గురు మంత్రులతో కూడిన బృందం పర్యటించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేసినట్టు పేర్కొన్నారు. బుధవారం జరిగే క్యాబినెట్ సమావేశంలో దీనికి ఆమోదముద్ర లభించనుందని తెలిపారు. రాష్ట్రానికి చెందిన మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ... రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించినట్టు స్పష్టం చేశారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించొచ్చని చెప్పారు. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను గుర్తింపుగా చూపించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో 6,700 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించినట్టు వివరించారు. ఏడాదికి దాదాపు రూ.1,950 కోట్ల వ్యయం అవుతుందన్నారు. ఈ ఏడాది అదనంగా మూడు వేల విద్యుత్ బస్సుల కొనుగోలుకు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. రాబోయే రెండేళ్లలో మరో 1,400 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తామన్నారు. డిమాండుకు తగ్గట్టుగా డ్రైవర్లు, మెకానిక్‌ల నియామకాలు చేపడతామన్నారు.

నేడు విద్యుత్ ఉద్యమం

- రాష్ట్ర వ్యాప్తంగా నిరసన గళం
- చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపుపై వ్యతిరేకత
- వామపక్ష, ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ, అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యుత్ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టనున్నారు. వామపక్ష, ప్రజా సంఘాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐక్య ఉద్యమంతో చంద్రబాబు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నారు. ప్రభుత్వం దిగివచ్చేలా అన్ని జిల్లాల్లోను వామపక్ష, ప్రజా సంఘాలను కలుపుకుని కార్యాచరణ ఏర్పాటు చేశారు. ఈ ఉద్యమం విజయవంతానికి వివిధ రూపాల్లో సన్నద్ధత కార్యక్రమాలను నిర్వహించారు. విజయవాడ దాసరి భవన్ కేంద్రంగా వామపక్ష, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ నిర్వహించి, ఉద్యమ కార్యాచరణ రూపొందించారు. ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలను చైతన్యవంతులను చేశారు. విద్యుత్ చార్జీల పెంపుతో పేద, మధ్య తరగతి, వ్యాపార వేత్తలు ఆర్థికంగా చితికిపోతున్నారు. విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ చేపట్టే ఉద్యమం ఒక్క వామపక్ష, ప్రజా సంఘాలకే సాధ్యంగా మారింది. 26 జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడే విద్యుత్ కార్యాలయాల వరకు ప్రదర్శనలు నిర్వహించి... అక్కడ నిరసన గళం వినిపిస్తారు. 2019-20 నుంచి 2023-24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ రిటైల్ వ్యాపార లోటు పేరుతో రూ.12,771 కోట్ల ట్రూ అప్ భారం వేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపి బహిరంగ ప్రకటన చేశాయి. రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకుండా ఇది జరగబోదని, వెంటనే స్పందించి చార్జీల పెంపుదలను నిలుపుదల చేయాలని వామపక్ష, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. 36 నెలల నుంచి 2014-19 కాలానికి సంబంధించిన రూ.3 వేల కోట్ల ట్రూ అప్ చార్జీలు వసూలు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక... 2022-23, 2023-24 సంవత్సరాల కాలానికి రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీల భారం మోపారు. 2024-25 సంవత్సరానికి ప్రతినెలా యూనిట్‌కు 40 పైసల చొప్పున ఒక్క సంవత్సరంలోనే రూ.2,787 కోట్లు వసూలు చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపుతో వినియోగదారులపై అదనపు చార్జీల వడ్డన ఉంది. గత ప్రభుత్వం వేసిన విధంగా విద్యుత్ భారాలు వేయబోమని, తగ్గిస్తామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు హామీ ఇచ్చి... తీరా అధికారంలోకి వచ్చాక... ఇచ్చిన మాట తప్పడంపై సర్వత్రా విమర్శలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ధర్నాలు విజయవంతం చేయాలని ఇప్పటికే వామపక్ష పార్టీల తరపున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చిన విషయం విదితమే.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతన బకాయిలు

రావులపల్లి రవీంద్రనాథ్, సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో కాంట్రాక్టు కార్మికులకు చట్టపరంగా కాంట్రాక్టర్/ కంపెనీలు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా నెలల తరబడి వేధిస్తున్నారని, వారికి రావాల్సిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ ఈఈ/ఎస్ఈ కార్యాలయాల వద్ద మైలవరం గ్రామసబ్ డివిజన్ మెయింటెనెన్స్ పనులు చేస్తున్న కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పిస్తూ సోమవారం ఆందోళన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరయిన రవీంద్రనాథ్, కోటేశ్వరరావు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ రక్షిత రక్షణ మంచి నీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు అతి తక్కువ వేతనాలిస్తున్నారని, కార్మిక చట్టాలను చేయకుండా కట్టుబానిసల కంటే హీనంగా చూస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారని చెప్పారు. కాంట్రాక్టర్‌కు లాభాలు చేర్చేందుకే దోపిడీ విధానాన్ని అమలుపరుస్తూ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా నెలల తరబడి జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. చట్ట పరిధిలో సరిపడా వేతనాలను... సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేతన బకాయిలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సాధించే వరకు పట్టుదలతో ఆందోళన కొనసాగించాలని, దానికి ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. ఈ ఆందోళన సాగుతున్న దశలో ఈఈ/ఎస్ఈఎస్ విద్యాసాగర్... కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ నుంచి వచ్చి కార్మిక నాయకులు, కార్మికులతో మాట్లాడారు. అన్ని విషయాలు వివరంగా అడిగి తెలుసుకున్న తర్వాత చట్ట పరిధిలో మీరు చెప్పినవన్నీ వెంటనే పరిశీలించి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు, గ్రామీణ ప్రజలకు తాగునీరు అందించడంలో ఎంత శ్రమ చేస్తున్నారో తమకు తెలుసునని అన్నారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

ఆదర్శనేత మండలి

- విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన నేత
- దివిసీమ గాంధీగా ప్రజల గుండెల్లో నిలిచారు
- మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సభలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దివి సీమ గాంధీగా మండలి వెంకట కృష్ణారావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కొనియాడారు. విజయవాడలో మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా 'లైట్ హౌస్ ఇన్ ది స్టార్మ్' పుస్తకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ మండలి వెంకట కృష్ణారావుతో కలిసి తాను ఎమ్మెల్యేగా పని చేశానని గుర్తు చేసుకున్నారు. గాంధీజీ ఆశయాలను తూచా తప్పకుండా ఆచరించిన వ్యక్తి మండల కృష్ణారావు అని ఆయన పేర్కొన్నారు. ఒకప్పుడు విలువలతో కూడిన రాజకీయాలు చూశానని, ప్రస్తుతం రాజకీయాలు చూస్తుంటే బాధేస్తుందన్నారు. ఎందరో మహానుభావులకు నిలయం కృష్ణాజిల్లా అని చెపుతూ... ఆయా రంగాల్లో ప్రముఖుల పేర్లు ప్రస్తావించారు. సమాజానికి ఎక్కడ ఇబ్బంది వచ్చినా తనకు వచ్చిన ఇబ్బందిగా భావించి పని చేసిన వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు అని తెలిపారు. విద్య శాఖ మంత్రిగా పని చేసే సమయంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. తెలుగు భాషా సంస్కృతికి కృషి చేసిన వ్యక్తి ఆయన అని చెప్పారు. ప్రపంచ తెలుగు మహాసభలను తెలుగు వారికి పరిచయం చేసిన నేత మండల కృష్ణారావేనని పేర్కొన్నారు. బాల్యం నుండే విలువలతో కూడిన జీవితం గడిపారు. గాంధేయ సిద్ధాంతాన్ని ఆచరించిన ప్రజా సేవకుడు. యువజన నాయకుడుగా నిరుపయోగంగా ఉన్న బీడు భూములను పేదలకు పంచి... వారి జీవన ప్రమాణాలు పెంచడానికి కృషి చేశారు. 1957లో లోక్‌సభ సభ్యుడుగా ఎన్నికై అవనిగడ్డ, నాగాయలంక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రచించి... వాటిని ప్రభుత్వం ద్వారా అమలు చేయడానికి కృషి చేశారు. 'గుల్లలమోద లైట్ హౌస్'ను తిరిగి ప్రారంభించారు. కృష్ణా జిల్లా పరిషత్తు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అవనిగడ్డ పంచాయతి సమితి అధ్యక్షులుగా ఎన్నికై వ్యవసాయ రంగంలో కో-ఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటు చేసి... లంకగ్రామాల ముంపు నివారణ చర్యలు 1965లో చేపట్టారు. దివిసీమ అభివృద్ధికి శాస్త్రీయ దృక్పథంతో సంఘ సేవా ట్రస్టు ఏర్పాటు చేసి...వ్యవసాయదారుల మన్ననలు పొందారు. అవనిగడ్డలో గాంధీక్షేత్రాన్ని ప్రారంభించి గ్రామీణ విద్యా పథకాన్ని అమలు చేశారు. 1977లో వచ్చిన 'దివి సీమ' ఉప్పెన సందర్భంగా ఆయనే రంగంలోకి దిగి పునరావాస కార్యక్రమాలు పర్యవేక్షించి అన్నార్తులను చేరదీసి...అవసరమైన సహాయ చర్యలు చేయడంలో జాతీయ, అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షింప చేశారు. ఆ సమయం ఆరోగ్యం పాడయినా లెక్క చేయకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రభుత్వ వర్గాలకు స్ఫూర్తినిచ్చారు. మండల కృష్ణారావు లక్షణాలు కుమారుడు మండల బుద్ధ ప్రసాద్‌కి కూడా వచ్చాయని ప్రశంసించారు. దేశంలో కుటుంబ వ్యవస్థ ఉన్న ఏకైక దేశం భారత్ అని అన్నారు. అమెరికాలో తెలుగు వారి తలసరి ఆదాయం ఆ దేశం కంటే ఎక్కువ వస్తుందని చెప్పారు. అమెరికాలో భారతీయులకు ఉద్యోగాలు ఇవ్వొద్దంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాత్కాలికంగా చెప్పినా... మనం లేకపోతే వాళ్లకి పనులు జరగవని వివరించారు. మన అవసరాలు వాళ్లకు ఉన్నాయన్న విషయం మర్చిపోతున్నారన్నారు. ప్రభుత్వం ఆంక్షలు పెడితే తాను భారత్ వెళ్లి కంపెనీ పెడతానని బిల్‌గేట్స్ ఒకప్పుడు చెప్పారని గుర్తుచేశారు. హైదరాబాదులో మైక్రోసాఫ్ట్ కంపెనీ స్థాపించారని చంద్రబాబు గుర్తు చేశారు. మండలి కృష్ణారావు శతజయంతి ఉత్సవాలు జయప్రదంగా నిర్వహిస్తున్న శత జయంతి కమిటీకి శుభాభినందనలు తెలియజేసిన సీఎం... ఆయన జీవితం, సేవానిరతి భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగిన శత జయంతి వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు, శ్రీరాం తాతయ్య, గరికపాటి నర్సింహారావు, ఆధ్యాత్మిక గురు విశ్వంజీ, అన్నవరపు రామస్వామి, దండమూడి సునీత, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, వీర్రాజు తదితరులు ప్రసంగించారు.

కలెక్టరేట్ వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర -చిత్తూరు: తన భూమి సమస్య పరిష్కరించాలని ఏళ్లతరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన ఓ రైతు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న పోలీసులు, వైద్య సిబ్బంది తక్షణమే స్పందించిన ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వి. కోట మండలం నడమంత్రానికి చెందిన చౌడప్పకు రెండు ఎకరాల పొలం ఉంది. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి తన పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకోవడంతో పాటు, పొలంలో గుంతలు తీస్తున్న విషయాన్ని స్థానిక రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి అనేకసార్లు విన్నవించినా స్పందించ లేదు. చౌడప్ప తన భార్య శ్యామలతో కలిసి చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి హాజరయ్యారు. చౌడప్ప తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక వైద్య సిబ్బంది... పోలీసులు చౌడప్పకు ప్రథమ చికిత్స చేసి అనంతరం చిత్తూరు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య శ్యామల మాట్లాడుతూ మాకు ఉన్నది రెండు ఎకరాల పొలం అని, తమ గ్రామానికే చెందిన ఓ వ్యక్తి తమ పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నాడని తెలిపారు. ప్రస్తుతం తమ పొలంలో గుంతలు తవ్వుతున్నాడని, ఈ విషయాన్ని అనేక పర్యాయాలు ఎమ్మార్వో కార్యాలయానికి తెలియజేసినా పట్టించుకోలేదని చెప్పారు. దీన్ని అదనుగా చేసుకుని తమ భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడని వాపోయారు. తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఎరువుల కొరతపై కలెక్టర్లకు వైసీపీ వినతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైసీపీ అధ్వర్యంలో జిల్లా కలెక్టర్లకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ప్రతిచోటా పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చి... యూరియా సహా ఎరువుల కొరత తీర్చడంతో పాటు రైతుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన ఎరువులు సబ్సిడీపై అందించాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో రైతులు ఎరువులు అందక ఇబ్బంది పడుతున్న విషయమై జిల్లా కలెక్టర్‌కు వైసీపీ నేతలు నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంటు నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు కుంభ రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, విజయనగరం పార్లమెంటు నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ తదితరులున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గం ఇంఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు వినతిపత్రం ఇచ్చారు. విజయనగరం జిల్లాలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.